
ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



మహాత్మాగాంధీ విగ్రహము
(శ్రీ దేవీప్రసాద్ రాయచౌదరి శిల్పము)

9-6-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

వార్తా చిత్రాలు




అస్సాంగవర్నరుదంపతులు, అక్బర్ హైదరీ, సతీమణి, బొంబాయినుంచి అస్సాంకు తిరిగివెళ్తున్నప్పుడు తీసిన చిత్రం.



కింగ్స్వే కాందిశీక శిబరము అగ్నిపాలైనపుడు, 12,000 మంది నిరాశ్రయులై పోయారు. పంజాబ్ కాలేజీవిద్యార్థినులు, అక్కడిపిల్లలకు పాలు పంచిపెడుతున్నప్పటి దృశ్యం.



మద్రాసు కార్పొరేషన్‌వారు ప్రారంభించిన ఆరోగ్యవిశ్రాంతిమందిరానికి గవర్నరు సతీమణి లేడీ నై, ప్రారంభోత్సవంజరిపిన దృశ్యం



అమృతసర్ విమానకేంద్రంవద్ద దిగినప్పుడు ప్రధాని పండిట్ నెహ్రూను బాలికలు పుష్పమాలలతో స్వాగతమిస్తూన్న దృశ్యం.



కాశ్మీర్ బాలకులు భారతప్రధాని పండిత నెహ్రూను స్వాగతమిస్తూన్నారు.



నయాకాశ్మీర్ — షేక్ మహమ్మద్ అబ్దుల్లా మంత్రివర్గము; తదితర ప్రజామండలి సభ్యులు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 40

సంచిక 39

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర జ్యేష్ఠ శుద్ధ విదియ బుధవారము



ఎల్లోరా గుహలు

*



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూన్ నెల 9-వ తేది బుధవారము

భాషాప్రయుక్తరాష్ట్ర-తత్త్వౌవశ్యకత

రష్యాలో జార్ ప్రభుత్వమును పదభ్రష్టము చేసి సోవియట్ రాష్యాంగ వ్యవస్థను స్థాపించిన ఉత్తర క్షణమున బోల్షివిక్ విప్లవనాయకులు లెనిన్ ప్రభృతుల ప్రప్రథమచర్య, రష్యా యందలి జాతీయ అల్పసంఖ్యాకవర్గములకు సాంఘిక, సాంస్కృతిక విద్యా విషయములందు సరిపూర్ణ స్వాతంత్ర్యమును ప్రసాదించుచు, వారి రాజకీయ హక్కుల నిర్వచించుచు చేసిన ఒక దీర్ఘప్రకటన. ఆ ప్రకటనాంశముల నమలు చేయుటకు ఏడాది తిరుగులోపునే అవసరమైన చర్యలు తీసుకొనిరి. అప్పటి కింకను జరుగుచున్న ప్రపంచసంగ్రామము గాని, అంతర్యుద్ధముగాని వారి కార్యక్రమమును అమలు పరచుటకు అధిగమింపసాధ్యముగాని ప్రతిబంధకములు కాలేదు. 1917 లో విప్లవము విజయవంతమైనను 1921 సంవత్సరము వరకును పాశ్చాత్యరాజ్యముల సైనిక చర్యల నెదుర్కొని, తమ నూత్న రాజ్యమును స్థిరపరచుకొన గలిగిరి. శాంతి ఏర్పడువరకు, దేశము శత్రు నిశ్శేష మగువరకు వారు తమ ప్రకటిత కార్యకలాపముల నమలు చేయక యుండలేదు.

ఇదే విధముగ బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పక్షమును పదచ్యుతి చేసి అధికారమును కైవసము చేసికొనుటకు బ్రిటిష్ కార్మికపక్షమునకు ప్రపంచ సంగ్రామము ప్రతిబంధకము కాలేదు. యుద్ధము పరిసమాప్తమగువరకు వెనుకటి ఆర్థిక, సాంఘిక వ్యవస్థను వారు యథాతథముగ కొనసాగింపలేదు. తమ ఎన్నికల వాగ్దానముల ననుసరించి అవసరమైనట్టి సంస్కరణలను చేయుచునే యుండిరి.

అట్టి సందర్భములలో భారత ప్రభుత్వము అతిస్వల్పమైన భాషా రాష్ట్ర పునర్నిర్మాణ సమస్యను పరిష్కరించుటకు కాందిశీక పునరుద్ధరణ, కాశ్మీరులో సైనికచర్యలు, దేశఆర్థిక సాంఘిక వ్యవస్థా పునర్నిర్మాణము— ఇత్యాది సమస్యలసాకుగ పేర్కొనుట వింతగాను, విపరీతముగాను కన్పింపక మానదు. యుద్ధము ముమ్మరముగ జరుగుచున్న సమయమున, స్వతంత్ర భారతనిర్మాణము అవసరమని, సాధ్యమని వాదించినవారు, ఇప్పుడు భాషారాష్ట్ర నిర్మాణము సాధ్యము గాదని వాదించుట ఏవిధముగను సమర్థనీయము గాదు. భాషా రాష్ట్రనిర్మాణము అధికారవర్గములకు సమ్మతము గాకుండనైన యుండవలెను; లేక ఈ సమస్యాప్రాధాన్యమునైనను వారు గుర్తించియుండకపోయి ఉండవచ్చును.

దాదాపు 20 సంవత్సరములుగ ప్రస్తుతము అధికారమునను న్న కాంగ్రెస్ యాజమాన్యముననే భాషా రాష్ట్రనిర్మాణ ఉద్యమము సాగినది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటము జరుగుచున్న కాలము కాంగ్రెస్ నాయకులు ఈ ఉద్యమనిర్వహణమునకు తగినది గాదని, స్వాతంత్ర్యము సంప్రాప్తమైన భాషారాష్ట్రములు స్వతంత్ర భారత ప్రభుత్వ ప్రథమ చర్యగ ఏర్పడగలవని ప్రత్యేకరాష్ట్రముల కోరి వారిని సమాధానపరచిరి. భారతదేశము స్వతంత్రమైనది. లోగడ చేసిన వాగ్దానముల ప్రకారము భాషా రాష్ట్రనిర్మాణమున కవసరమైన చర్యలు తీసికొనుటకు బదులు, అంతకంటె ఎంతో ప్రధానమైన సమస్యలున్నవని, అవి పరిష్కారమగువరకు ఈ సమస్య వేచియుండవలసినదే నని అధికారమందున్న కాంగ్రెస్ నాయకులు ప్రకటించుచువచ్చిరి. అంతటితో తృప్తిపడక అసలు ఉద్యమమునే నిరసింప నారంభించిరి. కాబోవు గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారిగారు, ప్రస్తుతప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ మొదలు టి ఆర్. వెంకట్రామశాస్త్రిగారివరకు ఈ రాష్ట్ర తత్వమును తెగడ నారంభించిరి.

రాష్ట్రాభిమానము దేశద్రోహముగ వీరు పరిగణించుట శోచనీయమే గాక, ప్రమాదకరముకూడ. జాతీయాభిమానము ఉన్మాదముగ, సంకుచితమైనదిగ పరిణమింప నంతకాలము వాంఛనీయమే అయినట్లు రాష్ట్రాభిమానము కూడ సామాన్యహద్దుల నధిగమింప నంతకాలము వాంఛనీయమె. జాతీయాభిమానమునకు రాష్ట్రాభిమానము మూలము. ఏక ప్రపంచమును, యావత్తు ప్రపంచమునకును ఏకప్రభుత్వమును కోరువారు ప్రపంచమునందలి వివిధజాతులను పరిగణింపరాదని గాని, జాతీయరాజ్యములు రద్దుకావలెనని గాని వాంఛించుటలేదు. అంతేగాక పరతంత్ర రాజ్యములు, జాతులు స్వాతంత్ర్యమును బొందవలెనని, వివిధదేశములు, రాజ్యములు సమానస్థాయిని పొందిననే ఏకప్రపంచ రాజ్యాంగవ్యవస్థయందవి సోదరి రాజ్యములుగ ఇమడగలవని తత్వజ్ఞులే గాక రాజ్యాంగ తంత్రజ్ఞులుకూడ అంగీకరించిరి.

భారతసమితియందు రాష్ట్రములును అంతే. ఏకత్వమున విభిన్నత్వముకంటె విభిన్నత్వమున ఏకత్వము అన్ని విధముల వాంఛి పదగినది. భాషా ప్రయుక్తముగ రాష్ట్రముల పునర్నిర్మాణము జరిగిన వివిధ రాష్ట్రముల మధ్య ఐక్యతను, ఏకత్వమును సాధించుట సులభము. అట్లుగాక రాష్ట్రాభిమానము సంకుచితమని, అది అంతరింపవలెనని వాదించుట హ్రస్వదృష్టినే ప్రకటించును. రాష్ట్రాభిమానము ప్రమాదకరమైన మార్గముల పట్టకుండ చూచుటకు, ఆయా భాషా ప్రాంతములను ప్రత్యేక రాష్ట్రములుగ నిర్మించుటే. అట్టి నిర్మాణమును గురించి విచారింపవలసినదే. గాని అందు కిది సమయము కాదని పండిట్ నెహ్రూ మొన్న ఆదివారము ఢిల్లీలో ఒక బహిరంగ సభయందుపన్యసించుచు ప్రకటించెను.

ఈ వాదమే సబబుగలేదు. వివిధ సంస్థానముల ఏకీకరణమువలన భారతదేశ స్వరూపమే మార్పు చెందినది. ఇట్టి కార్యక్రమముల నిర్వహణకు లేని అంతరాయములు భాషారాష్ట్ర నిర్మాణమునకు మాత్రము ఎందుకు ఉండవలెను? ముస్లిములు పాకిస్థాన్ కావలెనని ఆందోళన చేయుచున్నపుడు సిక్కులు తమకు ప్రత్యేక సిక్కుస్థాన్ కావలెనని కోరగా వారి సంస్కృతి, సంప్రదాయము, విద్య మున్నగు వాటిని సంరక్షించుకొనుటకు ఒక విధముగు స్వపరిపాలిత రాజ్యము నిత్తుమని పండిట్ నెహ్రూ ప్రకటించి యుండెను. భాషా రాష్ట్రములు ఇంతకంటెను మేలైనవి తక్కువ ప్రమాదము కలవి. నిర్హేతుకముగ అసందర్భముగ ఈ ఉద్యమమును ఖండించుట ఈ సమస్యాపరిష్కారమునకు మార్గము గాదు. అసలు ఈనాడు రాష్ట్రాభిమానమును విమర్శించువా రింతవరకు అనుసరించిన విధానమే కొంతవరకు ఈ ఆందోళన తీవ్రతరమగుటకు కారణమని చెప్పవలసి యున్నది. కనుక వా రింతకు పూర్వపు విధానమును మార్చుకొని సత్వర భాషారాష్ట్ర నిర్మాణమునకు పూనుకొనవలెను. ఇట్టి అవసర నిర్మాణాత్మక కార్యకలాపములకు ఎట్టి ప్రతిబంధకములును ఉండరాదు. కల్పిత అవరోధము లేర్పడినను, వాటి నధిగమించుటకు ప్రయత్నింపవలెనేగాని, అసలు సమస్యను వాయిదా వేయుటకు ప్రయత్నింపరాదు.

పండిట్ నెహ్రూ అధిక్షేపణ

కాశ్మీరుసంస్థానముపై దురాక్రమణ జరిపిన దుండగులకు పాకిస్థాన్ ప్రభుత్వము ప్రచ్ఛన్నముగను, ప్రత్యక్షముగను సహాయము చేయుటేగాక, పాకిస్థాన్ పౌరులు, పాకిస్థాన్ ప్రభుత్వాధికారులు ఈ యుద్ధచర్యలందు పాల్గొనుచుండుట అంతర్జాతీయ ధర్మశాస్త్రమును అనుసరించి శత్రుచర్యగ పరిగణింపవలసియుండునని, భద్రతా మండలి ఈ విషయమును విచారించి పాకిస్థాన్ భారతదేశముపై ఇట్టి శత్రుచర్యలు జరుపకుండ చేయవలెనని భారతప్రభుత్వము చేసిన ఫిర్యాదు గతి ఏమైనదో భద్రతామండలికే తెలియని పరిస్థితి ఏర్పడినది. భారత ప్రభుత్వము ఫిర్యాదు చేసి అయిదు మాసములు పూర్తి అయినవి. ఇది చాల అవసరవిషయమని, తక్షణము విచారణ జరుగవలసి యున్నదని, పాకిస్థాన్ చేసిన నిర్హేతుక, నిరాధారమైనట్టి ఎదురు ప్రతిపాదనలతో ముడిపెట్టుటకు వీలు లేదని భారతప్రతినిధివర్గము, భారత ప్రభుత్వము భద్రతామండలికి ఎప్పటికప్పుడు స్పష్టము చేయుచునే యుండెను.

సావధానముగ అయిదు మాసములు, అనవసర, అప్రస్తుత విషయము లన్నింటిని విచారించి, అసలు ఫిర్యాదుకు సంబంధము లేనట్టి ఇతర విషయములకు ప్రాధాన్య మిచ్చి వాటి పరిష్కారమునకు మండలి ఒక సంఘమును నియమించెను. ఈ సంఘ నియామక సమయముననే భారతప్రభుత్వము తన ఆక్షేపణమును తెలిపియుండెను. కాని భద్రతామండలి ఈ ఆక్షేపణలను అంగీకరించియుండలేదు. గతవారము జరిగిన సమావేశమునందు భద్రతా మండలి కాశ్మీరుకమిషను సత్వరము వివాదప్రాంతములకు వెళ్లవలసిందని తీర్మానించుటతోబాటు బ్రిటిష్ ప్రతినిధి సూచనపై ఈ కమీషన్ అధికారమును, విధులను విస్తృతము చేసెను. పాకిస్థాన్ ఫిర్యాదునందలి ఇతర అంశములనుకూడ ఇప్పుడీ సంఘము విచారణ చేయును.

ఇట్టి పాక్షిక, పక్షపాత, విచారణవలన భద్రతామండలి సాధింపగలదేమియు లేదు. భారతదేశ విభజన సమయమున జరిగిన హత్యలకు బాధ్యులెవరని ఇప్పుడు నిర్ధారణ చేయ ప్రయత్నించుటవలన ఎవరికి ఎట్టి ప్రయోజనము ఉండదు సరిగదా, పాతగాథలను తిరిగి రేకెత్తించుటవలన

ప్రస్తుత మున్న సయోధ్య పోయి తిరిగి సంఘర్షణలు ప్రారంభము కావచ్చును.

పండిట్ జవహర్లాల్ నెహ్రూ భద్రతామండలికి జూన్ 5వ తేదీన పంపిన అధిక్షేపణమునందు వివరించినట్లు జునాఘడ్ సమస్యగాని, ఇండియా, పాకిస్థాన్ ఒడంబడిక అమలు విషయముగాని, 'ముస్లింజాతి నిర్మూలన యత్నము' గాని ప్రపంచ శాంతికి ప్రమాదము తెచ్చిపెట్టగలవి కాదు. ఈ మాటవిషయమున పాకిస్థాన్ ప్రభుత్వ ఫిర్యాదు నిర్హేతుకమని, నిరాధారమని భారతప్రభుత్వ మిప్పటికి అనేకపర్యాయములు ఋజువు చేసియున్నప్పటికిని భద్రతామండలి కేవలము పాకిస్థాన్ అభూత కల్పనలకే ప్రాధాన్య మిచ్చి ఇప్పుడు వాటిని కూడ విచారణ జరప నిశ్చయించినది.

భద్రతామండలి ఈ విధానమును అనుసరించుటవలన కాశ్మీరు విచారణలో కూడ భారత ప్రభుత్వము ఈ కమిషన్‌తో సహకరించు విషయమై లోగడ నిర్ణయములను మార్చుకొనవలసిన పరిస్థితు లేర్పడినవి. భారత ప్రభుత్వము వివరించి యుండినట్టి అభ్యంతరముల ఆక్షేపణలకు తృప్తికరమైన సమాధానము నిచ్చువరకు కాశ్మీరు తీర్మానమును ఈ కమీషను అమలు జరుపుట యన్నది లేదని పండిట్ నెహ్రూ స్పష్టము చేసెను. కాని భద్రతామండలి భారతప్రభుత్వ అధిక్షేపణము గౌరవించునని యాశించుటకు గత రెండు సంవత్సరముల సంఘటనలు అంత అవకాశము నిచ్చుట లేదు. కాశ్మీరు కమిషను ఈ నెల 15వ తేదీన జనీవాలో సమావేశమై ముందు కార్యక్రమమును నిర్ణయించుకొనును. భద్రతామండలి నిర్ణయించిన విధముగనె ఈ కమీషను వ్యవహరింపవలసి యుండును. ఈలోపునే భద్రతామండలి తన లోగడ ఆదేశమును ఉపసంహరించుకొనవలెను. అట్లుగాక తొలి నిర్ణయమునకే కట్టుబడియున్న భారత ప్రభుత్వము ఈ కమీషన్ యెడలనే గాక, ఐక్యరాజ్య సమితియెడలకూడ తన వైఖరిని మార్చుకొనవలసి యుండును. ప్రపంచ రాజకీయ రంగమునందు భారతదేశస్థానము భవిష్యత్తు ఈ నిర్ణయముపైననె ఆధారపడి యుండును. ఈ విషమ పరిస్థితులలో సరియైన నిర్ణయము తీసుకొనకున్న భారతదేశము రెండవ చైనావలె తయారు కాగల ప్రమాద మున్నది. దూరదృష్టితో భారతవిదేశాంగ విధానమును నిర్ణయించుకొనిననే గౌరవ ప్రదముగ ప్రస్తుత సంకటస్థితినుండి బయటపడ వీలగును

—

ప్రపంచం

పాలస్తీనాయుద్ధవిరమణసమస్య

ఇండోచైనాలో ఫ్రెంచి కుతంత్రం

పాలస్తీనాలో ఉభయపక్షాలు యుద్ధం విరమించడం అవసరమని భద్రతామండలి యూదు అరబ్ జాతులకు ఆదేశం ఇచ్చి ఇప్పటికప్పుడే వారంరోజులు దాటిపోయినది అక్కడి పరిస్థితి మాత్రం యథాప్రకారంగానే వున్నది. భద్రతామండలి పంపిన ఆదేశాన్ని యూదు, అరబ్ పక్షాలు రెండూ కొన్ని షరతులమీద ఆమోదించినప్పటికీ యుద్ధ తీవ్రత ఈవారంలో ఎక్కువైంది తప్ప తగ్గినట్లుగాని, తగ్గిపోయేటట్లు గాని సూచన లేవీ కనిపించడంలేదు.

జూన్ 1 వ తేదీ రాత్రినుంచి యుద్ధం విరమించవలసిందని భద్రతామండలి చేసిన తీర్మానం తాము బేషరతుగానే ఆమోదిస్తున్నామని యూదుప్రభుత్వం రాజధాని టెల్ అవీవ్ నుంచి ప్రకటించింది. భద్రతామండలి ఆదేశం ఇవ్వడంలో ఉద్దేశ్యాలను తాము ఈ విధంగా భావిస్తున్నామని కూడా యూదుప్రకటన తెలియజేసింది.

(1) అరబ్ రాజ్యాలకు యుద్ధ సామగ్రి ఎగుమతిపై అమలు పరచవలసిన నిషేధాజ్ఞ అరబ్ రాజ్యాలలో విదేశాల అధీనంలో వున్న ఆయుధ గిడ్డంగులకు కూడా వర్తించాలి. (2) యుద్ధ విరమణ ఆదేశం అమలులో వున్న నాల్గు వారాల వ్యవధిలోనూ ఏ పక్షంవారూ తాము ప్రస్తుతం ఆక్రమించిన ప్రాంతాల సరిహద్దులు దాటి ముందుకు రాకూడదు. ఉభయపక్షాలూ తమ స్థానాలను తమ అధీనంలోనే వుంచుకొని కాపాడుకోవచ్చు. (3) ఆహారం మొదలైన అత్యవసరపదార్థాలను తెచ్చుకోడానికి యథేచ్ఛగా జెరూసలెం నగరంలో ప్రవేశించే అధికారం వుండాలి. పౌరులు స్వేచ్ఛగా లోపలికి వెళ్లి, బయటికి వచ్చే అధికారం కూడా వుండాలి (4) ఇస్రాయిల్ రాజ్యానికి మామూలుగా రవాణా అయే పదార్థాలను అటకాయించినట్లయితే, అట్టి చర్యను సాయుధ చర్యగానే పరిగణించడం జరుగుతుంది భద్రతామండలి ఏ ఉద్దేశ్యాలతో ఆదేశించినప్పటికీ యుద్ధ విరమణ ఆదేశాన్ని యూదుప్రభుత్వం ఆమోదించింది. బ్రిటిష్ ప్రభుత్వం తన పలుకుబడిని వినియోగించినందువలనైతేనేమి, ఇతర కారణాలవల్లనైతేనేమి అరబ్ రాజ్యాలు కూడా ఆదేశానికి సమ్మతించినవి.

యుద్ధవిరమణ సాధనకై భద్రతామండలి తరఫున యూదు అరబ్ వర్గాలతో ప్రస్తుతం మధ్యవర్తిగా పనిచేస్తున్న కౌంట్ బెర్నడోట్ ఉభయపక్షాలతో ప్రస్తుతం సంప్రతింపులు జరుపుతున్నాడు. ఈ సంప్రతింపుల ఫలితం ఏ విధంగా వుంటుందో చెప్పలేము గాని అరబ్ రాజ్యాలు మాత్రం ఐక్యరాజ్య సమితి వైఖరిని తీవ్రంగా నిరసించడం, అనుమానించడం జరుగుతున్నది.

మధ్యవర్తి బెర్నడోట్‌తో ప్రసంగిస్తూ అరబ్ రాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అజ్జాం పాషా "అరబ్ జాతి యుద్ధం కావాలని కోరలేదు ఐనప్పటికీ పాలస్తీనా పరిస్థితి అరబ్బుల అదుపులోనే వున్నది. ఏ విధంగానైనా యూదులను రక్షించడానికి ఐక్యరాజ్యసమితి ఇప్పుడు ముందుకు వస్తున్నది." అని వ్యాఖ్యానించాడంటే అరబ్బుల వైఖరిని బోధపరుచుకోవచ్చు.

హైఫా, అమ్మాన్, కైరో నగరాల మధ్య ఎడతెరిపి లేకుండా విమాన విహారంచేస్తూ మధ్యవర్తిత్వం సాగిస్తున్న కౌంట్ బెర్నడోట్ టెల్ అవీవ్ నగరంలో యూదు రాజ్య విదేశీ మంత్రి మోషీ షెర్టాక్‌తో కూడా సంప్రతించాడు.

బెర్నడోట్ జరుపుతున్న ఈ సంప్రతింపులలో యూదు ప్రాంతానికి యూదులను నిరాఘాటంగా వలస రానివ్వవచ్చునా, రానివ్వకూడదా అనే సమస్యమీద తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ ప్రతిష్టంభన కారణంగానే మధ్యవర్తి బెర్నడోట్ యుద్ధవిరమణ అమలుకై జరుపుతున్న చర్చలు ఇంకా ఫలితానికి రాలేదు. అందుచేత యూదు వలస విషయంలో భద్రతామండలి ఉద్దేశ్య మేమిటో స్పష్టపరచవలసిందని కోరుతూ కౌంట్ బెర్నడోట్ మండలికి వర్తమానం పంపాడు. దీని పర్యవసానం త్వరలో తేలుతుందో, లేక భద్రతామండలి మరికొంత కాలంపాటు మీనమేషాలు లెక్కపెడుతూనే వుంటుందో చూడాలి భద్రతామండలి తన ధోరణిలో తాను ఒగరుస్తుండా ఒకవైపు చర్చలు జరుపుతూనే వున్నది; మరొకవైపున ప్రచండయుద్ధం పాలస్తీనాలోని వివిధరంగాలలో సాగుతూనే వున్నది.

టెల్ అవీవ్ హైఫా నగరాల మధ్య వున్న ఒక యూదుకోస్తా పట్టణంపై ఈజిప్షన్ నౌకలు పెద్దపెట్టున దాడి జరపడము, ఆ దాడిని యూదు నౌకలు విమానాలు కలసి ప్రతిఘటించడమూ జరిగింది. ఉభయపక్షాలమధ్య తీవ్రమైన నౌకా విమానయుద్ధం సుమారుగంటలపాటు సాగింది. చివరకు యూదులు శత్రు నౌకలను తరిమివేయ గలిగారు. పాలస్తీనా కోస్తాలో జరిగిన ప్రథమ నౌకాయుద్ధం ఇదే.

కొంతమంది యూదు సైనికులు కవచ శకటాలతో బయలుదేరి ట్రాన్స్‌జోర్డాన్ భూభాగంలోనే ఎనిమిది మైళ్ళు చొచ్చుకొని వెళ్ళి దాడి జరిపారు. ఒక పోలీసుస్టేషనుమీద దాడి చేసి, అక్కడ వున్న 8 మంది అరబ్ భటులను హతమార్చారు

కొత్త జెరూసలెం చుట్టూ ఏర్పడిన అరబ్ రక్షణవలయాన్ని ఛేదించి, నగరంలో వున్న యూదు బలాలకు అదనపు సైనిక సహాయాన్ని ఆయుధసామగ్రిని అందజేస్తామనీ, అప్పటివరకూ వీరోచితంగా పోరాడవలసిందనీ యూదు ప్రధాని బెన్ గురియన్ తన సేనలకు అభయహస్త మిచ్చి ఉత్సాహపరుస్తున్నాడు. ఇవన్నీ యుద్ధ విరమణా దేశానంతరం జరిగిన సంఘటనలే.

ఈ పరిస్థితులలో పాలస్తీనా యుద్ధ విరమణ ఆదేశం సఫలమవుతుందనిగాని, అథవా అది సఫలమైనప్పటికీ పాలస్తీనాసమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని గాని చెప్పలేము. పర్యవసానంగా ఆచరణలో ప్రత్యక్షమయేది ఇదివరలో ఐక్యరాజ్యసమితి చేసిన విభజన పథకమే. ఇపుడు అందజేసిన యుద్ధవిరమణ ఆదేశ అంతర్యం కూడా అదేనన్న విషయాన్ని అరబుజాతి వారు దాపరికంలేకుండా చెబుతూనే వున్నారు.

యూదు రాజ్యాన్ని గుర్తించడం ఎప్పుడైతే జరిగిందో అప్పుడే అమెరికా బలం దానికి లభ్యమైంది; అమెరికాతోపాటు రష్యా అండ మరికొన్ని ఇతర రాజ్యాల ప్రాపకం కూడా లభ్యమైనవి అరబ్ రాజ్యాలు ప్రస్తుతం తమపై ఎంత ప్రతికూలభావాన్ని కనబరుస్తున్నప్పటికీ, పాలస్తీనా సమస్యపై రష్యా అమెరికాలు కపట నాటకం ఆడకమానవు యూదు అరబ్ పక్షాలు తమలోతాము ఒక ఒడంబడికకు రానంతకాలం పాలస్తీనా సమస్యను అగ్రరాజ్యాలు స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకుంటూనే వుంటవి. యూదు అరబ్ వర్గాల పరస్పర సుహృద్భావం ఒక్కటే ఈ క్లిష్టసమస్యకు సవ్యమైన పరిష్కార మార్గం. ఐతే ఈ సుహృద్భావం ఏర్పడడానికి ఎంతకాలం పడుతుందన్నదే పెద్ద సమస్య!

ఇండోచైనా తరఫున అన్నాం మాజీ చక్రవర్తి బావ్‌దాయ్, అతిడి గులాము వీట్‌నాం తాత్కాలిక ప్రధాని అయిన జనరల్ న్యూయెన్ వాన్ క్సువాన్ ఫ్రెంచి సామ్రాజ్యంతో ఒక ఒడంబడికను చేసుకున్నారు. ఈ ఒడంబడిక ప్రకారం ఇండోచైనా ఫ్రెంచి సామ్రాజ్యంలో ఒక అంతర్భాగంగా వుంటూ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తుందట. ఇండోచైనా సమీపాన ఎలాంగ్ అఖాతంలో "డూగ్వే ట్రూయిన్" అనే ఒక ఫ్రెంచి యుద్ధఓడలో ఫ్రెంచి హైకమిషనర్ ఎమిలీ బొల్లార్ట్, అన్నాం మాజీ చక్రవర్తి, బావ్‌దాయ్, తాత్కాలిక ప్రధాని న్యూయెన్ వాన్ క్సువాన్ ఈ ముగ్గురూ ఒడంబడికమీద మొన్న జూన్ 5-న సంతకాలు చేశారు. ఫ్రెంచి యూనియన్‌లో ఒక అనుబంధ రాజ్యంగా ఇండోచైనా స్వాతంత్ర్యప్రతిపత్తిని ఫ్రాన్సు గుర్తిస్తున్నది ఫ్రెంచి యూనియన్‌లో అంతర్భాగం కావడంవల్ల వర్తించే నిబంధాలుతప్ప ఏ ఇతర నిబంధాలు ఇండోచైనాకు వర్తించవట. ఆర్థిక, సైనిక, వైజ్ఞానిక, రాజకీయంగాలకు వర్తించే ఒడంబడికలు ఉత్తరోత్తరా ఫ్రాన్సు, ఇండోచైనాల మధ్య జరగగలవని కూడా ప్రకటిస్తున్నారు.

ఈ ఒడంబడికద్వారా ఇండోచైనాకు నేడు లభించింది సంపూర్ణస్వాతంత్ర్యం కాదు. తమ దేశస్వాతంత్ర్యంకోసం ఫ్రెంచి సామ్రాజ్య దాస్యబంధాల విచ్ఛేదంకోసం ఇప్పటికి పద్దెనిమిది మాసాలనుంచీ ఫ్రెంచి సామ్రాజ్యాధిపత్యంపై హోరాహోరిగా యుద్ధం సాగిస్తూ, వీట్‌నాం రిపబ్లిక్‌ను స్థాపించిన డా॥ హోచిమిన్‌కు గాని, ఆయన పక్షంవారికిగాని ఈ ఒడంబడికతో ఏవిధమైన ప్రమేయమూ లేదు 1946, డిసెంబరు 19 వ తేదీన డా॥ హోచిమిన్ వీట్‌నాం రిపబ్లిక్ తరఫున స్వాతంత్ర్యసమరం ప్రారంభించినప్పటినుంచీ ఫ్రెంచివారు అతడిపై కత్తికట్టారు హోచిమిన్‌ను, ఆయన పార్టీలో వున్న స్వాతంత్ర్యప్రియులను క్రోధిరాజని అన్నాం మాజీ చక్రవర్తితో తొలుతనే గాయబారాలు ప్రారంభించారు. వీట్‌నాం రిపబ్లిక్ ప్రభుత్వసేనలను అణచివేయడానికి ఫ్రెంచివారు తమ సామ్రాజ్య బలసంపదను ప్రయోగించి చూశారు. దాన్ని అణచివేయడం సాధ్యపడలేదు. తర్వాత ఇండోచైనా ప్రజలలోనే విభేదాలు కల్పించడానికి విశ్వప్రయత్నంచేసి, ఇప్పటికి కృతకృత్యులైనారు

ప్రస్తుతం జరిగిన నామమాత్ర స్వాతంత్ర్య ఒడంబడిక ఫలితంగా ప్రయోజనం ఏదీ చేకూరదు గాని, ఇండోచైనా ప్రజలలో డా॥ హోచిమిన్ ప్రభుత్వ వర్గానికి, బావ్‌దాయ్ పక్షానికీ మధ్య విభేదాలు పెరిగి అంతర్యుద్ధ ప్రమాదం సంభవించే అవకాశం వున్నది. తాము చేయలేని పనిని తమ గులాములైన ఇండోచైనా ప్రజల చేతనే ఫ్రెంచివారు చేయించ బూనుకున్నారు.

ఇండోచైనా సమస్య ఈవిధంగా పరిణమిస్తే ఇండోనీసియా సమస్యను డచ్చి సామ్రాజ్యవాదులు ఇప్పటికీ పరిష్కరించనే లేదు. "రెన్‌విల్" ఓడమీద డచ్చి, ఇండోనీసియన్ వర్గాల మధ్య ఒడంబడిక జరిగి ఆరునెలలు దాటిపోయినా, నేటికీ అది పూర్తిగా ఆచరణలోకి రానేలేదు డచ్చి సామ్రాజ్యవాదులు ఇండోనీసియాలోనూ 'విభజించి పాలించు' విధానాన్నే అవలంబించి రిపబ్లికన్లలో చీలికలు తెచ్చిపెడుతున్నారు. తూర్పుజావాలో ప్రత్యేక ప్రభుత్వాన్ని స్థాపించడం డచ్చివారి కుటిల రాజనీతిలో భాగమే. డచ్చివారి తతంగంవల్ల తమ దేశానికి ఏర్పడుతున్న ముప్పును గ్రహించి, ఇండోనీసియాలోని పదకొండు రాజకీయ పక్షాలు ఏకమై "నేషనల్ ఫ్రంట్" స్థాపనకు నిర్ణయించుకొన్నవి. ఏకజాతీయ నిర్మాణ కార్యక్రమాన్ని తయారుచేసుకోదలచినవి. ఇండోనీసియా రిపబ్లిక్ ప్రధాని డా. మహమ్మద్ హట్టా స్వయంగా వివిధపక్షాల నాయకులతో సంప్రతింపులు ప్రారంభించి, రాజకీయ పక్షాల ఏకీకరణ విషయమై విశేష శ్రద్ధ తీసుకుంటున్నాడు. దేశ రాజకీయ, ఆర్థిక, సైనిక, సామాజిక రంగాలలో ఏకీభావాన్ని స్థాపించి, ఏకోన్ముఖకృషి చేయడమే సామ్రాజ్య కుతంత్రాలను అరికట్టడానికి ఉత్తమమార్గం.



౧౮

మరునాడు ఉదయం, ఓడిన్ట్సోవ్ సతి టీకి మేడదిగి వచ్చేసరికి, బజరోవ్ తలవంచుకుని టేకప్పుమీద దృష్టిని నిల్పి అల్లాకూర్చుని ఉన్నాడు. చటుకుని తలఎత్తి ఆమెను చూశాడు. చటుకుని, ఆమె దెబ్బ తిన్నట్టుగా అతనివేపు చూసింది. ఆమె ముఖం క్రితం రాత్రికంటే పాలిపోయినట్టు అతనికి అనిపించింది. ఆమె తొందరగా తన గదికి తిరిగి వెళ్లిపోయింది. మళ్ళీ మధ్యాహ్నం భోజనం దాకా రాలేదు. ప్రొద్దుటినించీ వానకురుస్తోంది. అవతల తిరిగి రావడానికి వీలులేకపోయింది. అందరూ ముందు సావడిలో కూర్చున్నారు. ఆర్కాడీ ఏదో పత్రిక కొత్తప్రతి తీసుకుని పైకి చదవడం ప్రారంభించాడు. ముసలి రాకుమారి, ముఖంలో, తనకు ఆశ్చర్యం కలిగిందని వ్యక్తపరచడానికి ప్రయత్నించింది — అతనేదో తప్పుపని చేస్తున్నట్టు. ఆతనివేపు కోపంగా చూసింది. కాని అతడామెను లక్ష్య పెట్టలేదు.

“యవ్‌గనీ వాసిలిచ్”, ఆనాసర్గీవ్నా అంది. “నాగదికి రండి. ...మిమ్మల్ని అడగాలి... ఏదో పుస్తకం సంగతి చెప్పారే నిన్న.. ..”

ఆమెలేచి గుమ్మందగ్గరకు వెళ్లింది. రాకుమారి చుట్టూ చూసింది, చూపులద్వారా, “చూడండి, ఎంత వింతగా ఉందో నాకు” అన్న భావాన్ని వ్యక్తపరుస్తూ తరువాత ఆర్కాడీ వేపు చూసింది. అతను గొంతుక పెద్దదిచేసి, తన ప్రక్కని కూర్చున్న కాట్యావేపు అప్పుడప్పుడూ చూస్తూ, చదువుతూనే కూర్చున్నాడు.

ఓడిన్ట్సోవ్ సతి గబగబ తన గదిలోకి వెళ్లింది. బజరోవ్ ఆమెను అనుసరించి వెళ్లాడు. అతను కళ్లు ఎత్తి ఆమెను చూడలేదు. మెత్తగా పొరలమీద పొరలుపడి జారుతున్న, అమె పట్టువలువ చప్పుడు, శ్రద్ధగా వింటూ నడిచాడు. క్రితం రాత్రి కూర్చున్న పడకకుర్చీలోనే ఓడిన్ట్సోవ్ సతి కూర్చుంది. బజరోవ్ కూడా అప్పుడు కూర్చున్న కుర్చీలోనే ఎదురుగా కూర్చున్నాడు.

“మీరన్న ఆపుస్తకం పేరేమిటి?” కొంచెం సేపయినతరవాత ఆమె అడిగింది.

“సామాన్య రసాయనిక సూత్రాలు,” అన్నాడు బజరోవ్. “ఇంకో పుస్తకంకూడా చూడవచ్చు మీరు. గానట్ వ్రాసిన ప్రాథమిక భౌతికశాస్త్ర ప్రయోగావళి.’ ఆపుస్తకంలో ఉదాహరణలు, మంచివిఇచ్చాడు. తరవాత అది పాఠ్యగ్రంథం కూడా.”

ఓడిన్ట్సోవ్ సతి చేతులు చాపుకుంది. ”యవ్‌గనీ వాసిలిచ్ క్షమించండి. పాఠ్యగ్రంథాలను గురించి చర్చించడానికి కాదు మిమ్మల్ని రమ్మన్నది. నిన్నరాత్రి మన సంభాషణ తిరిగి జరపాలని నాకోరిక. మీరు చటుకుని వెళ్లిపోయారు... . మీకు విసుగ్గా ఉండదు కదా ..”

“మీ ఇష్టం, ఆనాసర్గీవ్నా. అయితే నిన్న రాత్రి ఏమిటి మాట్లాడుకున్నది?”

ఓడిన్ట్సోవ్ సతి దీర్ఘంగా పక్కచూపు చూసింది బజరోవ్ వేపు.

“సౌఖ్యం అంటే ఏమిటనిగావును. నన్ను గురించి మీకు చెప్పాను. అయితే సౌఖ్యం అనే పదాన్ని నేనుపయోగిస్తున్నాను. ఒక సంగతి చెప్పండి. సంగీతం వింటున్నప్పుడు, చక్కని సాయంసమయంలో, లేక, సహృదయులతో మాట్లాడుతున్నప్పుడు, మనం పొందే సౌఖ్యం, ఏదో అతిలోకమయిన, అనంతమయిన సౌఖ్యంలో అంశగా అనిపిస్తుందేం? మామూలుగా వాస్తవికమయిన సౌఖ్యంలాగ ఉండదేం?— అంటే మన అందుబాటులో ఉన్న సౌఖ్యం లాగా? ఎందేత? ఒకవేళ మీకు అటువంటి అనుభవం ఎప్పుడూ కలగలేదేమో!”

“(సౌఖ్యం అనేది మనం లేని చోట తప్ప ఉండదు’ అన్న సూక్తి విన్నారా?” అన్నాడు బజరోవ్, “మీరు) అసంతృప్తి మిమ్మల్ని బాధిస్తోందని అన్నారు. అటువంటి భావాలని నాబుర్రలోనికి అసలు రానీయను.”

“అవన్నీ వెటకారంగా మీకు కనిపిస్తాయనుకుంటా.”

“లేదు; అవినా మెదడులోకి రావు అంతే.”

“నిజంగా? మీరు అసలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని ఉంది నాకు తెలుసా?”

“ఏమిటి? నాకర్థం కావటంలేదు ”

“వినండి. మీతో దాపరికం లేకుండా మాట్లాడాలని నాకు చాలా కాలంనించీ ఉంది. మీరు సామాన్యవ్యక్తులుకారని మీకే తెలుసు; వేరే నేను మీకు చెప్పనక్కరలేదు. మీ రింకా యువకులు. జీవితం అంతా మీకింకా ముందు ఉంది. మీరు దేనికోసం కృషి చేస్తున్నారు? ఏమవాలని వాంఛిస్తున్నారు? మీభావి ఏమిటి? మీరు ముందుకి ఎక్కడికి పోతున్నారు? మీహృదయంలో ఏముంది? మీరు అసలు ఎవరు, ఏమిటి?”

“మీప్రశ్న నాకు వింతగా ఉంది ఆనాసర్గీవ్నా. నేను ప్రకృతిశాస్త్రం చదువుతున్నానని మీకు తెలుసు. నేనెవరినో...”

“అదే మీరెవరు?”

“నేను ఒక పల్లెటూరి వైద్యుణ్ని కాబోతున్నానని ఇదివరకే చెప్పాను మీతో ”

ఆనాసర్గీవ్నా చిరాకుగా కదిలింది.

“మీ రెందుకు అలా అంటారు? అది వట్టిదని మీకే తెలుసు. ఆర్కాడీ అల్లా అంటే అనవచ్చు కాని, మీరు అనకూడదు.”

“ఏం? ఏ విషయంలో నాకంటె ఆర్కాడీ.. ...”

“చాలు! అల్లాంటి చిన్న ఉద్యోగంతో మీరు తృప్తిపడతారంటే అది సంభవమా? వైద్యంలో నమ్మకం లేదని మీరు అంటూంటారు కాదూ? మీకున్న ఆశయాలతో, మీరు పల్లెటూరి వైద్యవృత్తితో తృప్తిపడతారా? నాయందు మీకు విశ్వాసం లేదు గనక ఏదో ఒక సమాధానం నాకు చెప్పి ఊరుకోబెట్టడానికి చూస్తున్నారు. యవ్‌గనీ వాసిలిచ్ మీకు తెలియదేమోగాని, నేను మిమ్మల్ని పూర్తిగా అర్థంచేసుకోగలను. మీలాగే నేనూ ఒకప్పుడు నిరుపేద తనాన్ని చవిచూశాను, నాకూ పెద్ద ఆశలుండేవి. మీకు ఏర్పడే సమస్యలే బహుశా నేనూ ఎదురుకున్నాను “

“అదంతా బాగానే ఉందికాని, ఆనాసర్గీవ్నా, మీరు నన్ను మన్నించాలి. నన్ను గురించి నేను, బహిరంగంగా ఎప్పుడూ చెప్పుకోలేను. తరవాత మీకూ నాకూ మధ్య పెద్ద అఖాతం ఉంది.”

“ఎల్లాంటి అఖాతం? నేను భాగ్యవంతురాలినని అనేస్తారు మీరు. అది ఇంక మీరు అనక్కరలేదు యవ్‌గనీవాసిలిచ్. నావిషయం కొంతమీకు.. .. . ”

“అదికాకపోయినా,”—బజరోవ్ సగంలో అన్నాడు, “భావినిగురించి ఎవరైనా ఎందుకు ఆలోచించాలి? అది చాలావరకూ మనమీద ఆధారపడి ఉండదుకదా. ఏదన్నా అవకాశం దొరికితే మంచిదే. అది దొరక్కపోతే, అధమం ఆవిషయాన్నిగురించి ముందే తను ప్రచారం చెయ్యనందుకు సంతృప్తి పడవచ్చు.”

“స్నేహితులతో సంభాషణ అనవసర ప్రచారమంటారా? .. ...బహుశా నేను ఆడదాన్ని గనక నాలో విశ్వాసం ఉంచడానికి మీకు అభ్యంతరం ఉండవచ్చు. మేమంటే మీకు అసహ్య మనుకుంటాను.”

“మీ రంటే నాకు అసహ్యంలేదు. ఆ సంగతి మీకు తెలుసును?”

“నాకేమీ తెలియదు ... పోనీ అలాగే కానీయండి. మీ భావినిగురించి నాతో చర్చించడానికి మీకు ఇష్టంలేదు. పోనీ ఇప్పుడు మీలో జరుగుతున్నది .. . ”

“నాలో జరుగుతున్నది!” అన్నాడు బజరోవ్ “నే నొక ప్రభుత్వాన్నా, సమాజాన్నా! ఏమన్నా, అదంత తెలుసుకోవలసిన విశేషమేమీ కాదు. అదీగాక తనలో జరుగుతున్నదంతా ఏ మనిషయినా చెప్పుకోగలుగుతాడా?”

“మీ హృదయంలో ఉన్నదంతా ఎందుకు మీరు చెప్పుకోలేరో నాకు బోధపడటంలేదు.”

“మీరు చెప్పుకోగలరా?” అన్నాడుబజరోవ్.

“ఆ”, కొంచెం సంకోచింతో అంది ఆనాసర్గీవ్నా.

బజరోవ్ తలవంచాడు, “నాకంటె మీరు అదృష్టవంతులు ”

ఆనాసర్గీవ్నా ప్రశ్నార్థకంగా అతన్ని చూసింది. “మీ ఇష్టం,” ఆమెఅంది, “పోని అల్లాగేఅనండి. కాని మనకిద్దరకూ పరిచయం అవడం కేవలం యాదృచ్ఛికం కాదని నా నమ్మకం. మన స్నేహం బలపడుతుందని నా నమ్మకం. మీరు చూపిస్తున్న సంకోచం, సందేహం, చివరికి మాయమయిపోతాయి.”

“అయితే మీకు నాలో సంకోచం కనిపించిందా.. మీ రన్నది సందేహం?”

“అవును.”

బజరోవ్ లేచి కిటికీదగ్గరకు వెళ్లినిలబడ్డాడు. ఈ సంకోచానికి కారణం తెలుసుకోవాలని ఉందామీకు? నాలో జరుగుతున్నదంతా తెలుసుకోవాలని ఉందా?”

“నుక్కే,” అంది ఓడిన్ట్సోవ్ సతి. ఆ సమయంలో ఆమెకు పూర్తిగా అర్థంకాని భయం ఆమెకు ఆవరించింది.

“మీకు కోపంరాదు కదా?”

“రాదు“

“రాదా?” బజరోవ్ ముఖం ఆమెనించి రెండో వేపుకి తిప్పుకుని నిలబడ్డాడు. “అయితే వినండి. నేను మూర్ఖంగా, పిచ్చిగా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను ..... నాలోంచి ఆరహస్యాన్ని బయటికిలాగేశారు మీరు.”

ఓడిన్ట్సోవ్ సతి తనచేతులు ముందుకు జాపింది. కాని బజరోవ్ తన నుదుటిని కిటికీ కమ్మీకి ఆన్చి నిలబడి ఉన్నాడు. అతని ఊపిరి ఆడ్డింది; అతని శరీరమంతా వణుకుతోంది. యౌవనసహజమైన పిరికితనం లేదు ఆవణుకులో. ప్రథమ ప్రణయాన్ని వ్యక్తపరచేటప్పుడు కలిగే తీయని భయంకాదు అది. తీవ్రమయిన ఉద్రేకం ఆతనిలో చెలరేగింది—బాధగా, పెద్ద ఉప్పెనగా, దుర్నిరోధంలాంటి ఉద్రేకం. ఓడిన్ట్సోవ్ అతన్ని చూస్తే, భయం, జాలీకూడా కలిగాయి.

“యవ్‌గనీవాసిలిచ్!” అంది ఆమె. ఆమెకు తెలియకుండానే ఆమె గొంతుకలో మెత్తదనం ధ్వనించింది.

అతడు చటుకుని వెనక్కి తిరిగాడు. పరిశీలనగా ఒకచూపు ఆమెవేపు విసిరాడు. ఆమె రెండుచేతులనూ పట్టుకొని చటుకుని తనదగ్గరగా రొమ్ముమీదకి లాక్కున్నాడు.

అతని కౌగిలినుంచి ఆమె వెంటనే విడిపించుకోలేదు. ఒక క్షణం గడిచిన తరవాతమాత్రం ఆమె తొలగిపోయి ఒక మూలగా నిలబడింది. బజరోవ్‌ని చూస్తోంది. అతను ఆమెవేపుకి నడచాడు.......

“నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు,” ఆమె తొందరగా అంది, భయంతో. ఇంకొక్క అడుగు అతను ముందుకి వేస్తే ఆమె కేకవేసేటట్టు కనిపించింది. బజరోవ్ పెదవులు కొరుక్కున్నాడు. అవతలికి వెళ్లిపోయాడు.

ఒక అరగంట గడిచిన తరవాత బజరోవ్ దగ్గరనించి ఒక ఉత్తరాన్ని దాసి తీసుకునివచ్చి ఆనాసర్గీవ్నాకి ఇచ్చింది. అందులో ఒక్కటే వాక్యముంది, “నేనీవేళ వెళ్లిపోవాలా, రేపటి వరకు ఉండవచ్చునా?”

“ఎందుకు వెళ్లిపోవాలి? నేను మిమ్మల్ని అర్థంచేసుకోలేదు—మీరు నన్ను అర్థంచేసుకోలేదు ” అని జవాబు వ్రాసిపంపించింది. తనలో తను అనుకుంది.. “నన్నుమాత్రం నేను అర్థంచేసుకున్నానా?” అని.

మళ్లీ భోజనాలవేళవరకూ ఆమె బయటికి రాలేదు. తనగదిలోనే ఇటూ అటూ తిరుగుతూ గడిపింది—అప్పుడప్పుడు కిటికీ దగ్గర ఆగుతూ

(19 వ పేజీ చూడుడు)

ఆచారభేదాలు

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

పూర్వకాలంలో కఱవులు వచ్చాయంటే వాట్లకు కారణం వర్షాలు కురవకపోవడం అనుకొని వారుణ జపాలు చేయించడమూ, సహస్రఘటాభిషేకాలు చేయించడమూ యీ రీతిగా రాజులు ఆ రోజుల్లో దైవాన్ని నమ్మి దేవతారాధనలుచేసి ఆ వుపద్రవాన్ని తొలగించుకునేవారు.—విరాటపర్వం యేకదీక్షగా ఉదయస్నానం చేసుకుని పారాయణ చేయడం కూడా వర్షాన్ని కురిపించేది.

నా విద్యార్థిదశలో కిర్లంపూడిలో మా గురువుగారూ మేమూ ఆ సంస్థాన వార్షికానికి వెళ్లివున్నప్పుడు ఆ సమీప గ్రామం గెద్దనాపల్లి కాపురస్థులు ఆయీ పారాయణ నిమిత్తం మీ శిష్యులలో యెవరినేనా వొకరిని పంపవలసిందని కోరితే విద్యార్థులలో అల్లులలో ముల్లుగా వున్న నన్ను పంపించారు గురువుగారు. చెలువువొద్దున కూర్చుని పారాయణ చేసేటప్పటికి యెక్కువగా కాదుగాని వొక ఆఱు ముక్కచినుకులు వెంటనే (తిడితే గుద్దినట్టు) పడ్డాయి. తదనంతరన్యాయంచేత ఆ వర్షం నా పారాయణకు ఫలితంగా ఆ వూరిగృహస్థులు భావించి నన్ను సత్కరించారు.

నేను యేడెనిమిదేళ్ళ వయస్సులో వుండగా వొక కఱువువచ్చింది. దాన్నే దాత యీశ్వర కఱువుగా యిప్పుడు మనవాళ్లు చెప్పుకుంటారు. రు. 1 టికి పది మానికలు అంటే సేర్లుబియ్యం యిచ్చేవారు. ఆ కాలానికి అదే పెద్ద కఱువు. కాలం బాగుంటే రు. 1 కి అయిదూ ఆఱూ కుంచాలు బియ్యం యిచ్చే ధర్మకాలంగదా అది? పంట విస్తరించి పండేటట్టయితే యెక్కడి ధాన్యం అక్కడే ముక్కిపోయే రోజులు అవి. సుమారు పుట్టెడు నువ్వులు మా తాలూకు కొనేవాళ్లు లేక నుసికావడం నా చిన్నతనంలోనే నే యెఱుగుదును. నేను బందరులో స్కూలు పండితుడుగా వుండే రోజులలో వేసంగి సెలవులకు గుడివాడమీదుగా నూజివీడు రైలు స్టేషనుకు (అప్పటికింకా బందరు రైలు తయారుకాలేదు) ప్రయాణం చేస్తూ చోరభయం చేత యేవూరు దగ్గఱ పొద్దుగుంకితే ఆ వూళ్ళోనే మకాం చేయవలసివచ్చేది. కానుమోలు వగయిరా వూళ్లు కొన్ని ఆ రోడ్డున తగిలేవి. అక్కడ వంట చేసుకోవలసివచ్చేది మజ్జిగ కొనుక్కోవడానికి సంసారుల వీధికి వెడితే అమ్మకానికి దొరికేదే కాదు. కావలిస్తే వూరికే పోస్తామనేవారు ఆ సంసారుల ఆడవాళ్ళు ఆ వూళ్లన్నీ యీ కఱువురాకకు పూర్వమే మాఱిపోయాయి. యిప్పుడు చెప్పనే అక్కఱలేదు కొందఱు రైతు గృహస్థులు రైలు స్టేషనుల దగ్గఱికి తమ నవుకర్లద్వారా మంచి మజ్జిగ దాహానికి పుణ్యంకోసం సమీప స్టేషనులకు పంపడం వుండేది. యివన్నీ యీ యుద్ధపు కఱువుకు పూర్వమే అంతరించాయి. మనకి కఱువంటూ రావడం యీ యాభైయేళ్లకో లేకపోలేదుగాని దాని క్కారణం వర్షాభావమే.

పురాణాల్లో ద్వాదశవర్షక్షామాలు వినపడతాయి. గౌతమహర్షి ఆలాటి క్షామాన్ని గాయత్రీ మంత్ర జపం మూలంగా జయించి తన ఆశ్రమాన్ని తంజావూరు సత్రంగా మార్చినట్టు దేవీభాగవతంలో వుంది. నివారణ యేలా జరిగినా రావడాని క్కారణం వర్షాభావమే. వొకటి రెండేళ్లు పుష్కలంగా వర్షాలు లేక పంట బాగా పండకపోయినా మన మాతృదేశం తన బిడ్డల్ని పోషించుకోగలదుగానీ బ్రహ్మరాక్షసిలాగ మన పాలిటికి రైలు వచ్చి పట్టుకుంది. అయితే రైలువల్ల యెన్నో సదుపాయాలున్నాయిగదా? అది లేకపోతే బతకడం యెలాగ అంటారేమో? అది లేని రోజుల్లో బతికినవాళ్ళే మన తాత ముత్తాతలు, అదేకాదు—తునకు సిగరెట్లు లేదా; సబ్బులు లేదా! టీ, ఇంకా యెన్నోట్రాలు యేవీ లేకపోయినా మన బతుకు పుస్తకాపేక్షే. మన తండ్రులలో పలుమంది ఆ రైలు యెఱుగనివాళ్ళే. యెంత వర్షం కురిసినా యెంత పంట పండినా ఆ బ్రహ్మరాక్షసి యెక్కడికో పట్టుకు పోయి మాయం చేస్తుంది. అందుచేత "సాహేబుకు సవారాజ్యం అబ్బినా బీబీకి కుట్టుకాడలే" అనే సామెతకు మనం గుఱికావలసిందే.

పూర్వపు కఱువల్లా వొక్క బియ్యానికి మాత్రమే కట్టుకోవడానికి గుడ్డలు లేవని విన్నట్టులేదు. యింకా అపరాలు లేకపోవడమూ లేదు. పాశ్చాత్య నాగరికతబాగా వ్యాప్తిలోకి వచ్చి యాభైయేళ్ళకంటె యెక్కువ కాలేదు. క్రమంగా దేశం యే విధంగా తయారయిందంటే? సర్వతా—(1) కాళ్ళువున్న కుంటువాళ్ళూ, (2) కళ్లువున్న గుడ్డివాళ్లూ యీ విధంగా తయారయింది సావిట్లోనుంచి వంటయింట్లోకి తిండికి పోవలసి వస్తే సైకిలు వుండవలసిందేకదా? అయితే సైకిళ్ళు, మోటార్లు వగయిరా యంత్రాలవల్ల వున్న లాభాలు వదిలిపెట్టి యేదో స్వల్పదోషాన్ని బయటపెట్టడం న్యాయమా?—అంతే వినండి!

లాభాలు ప్రత్యక్షంగా కనపడుతూవుంటే నేను లేవనదలనా? లౌకికంగా సంచరించే టీచర్లు వగయిరాలకే కాదు—పల్లెటూళ్ళలో పైలకాపర్లు కూడా సైకిలుతోనే నడకసాగిస్తూ వున్నారు. ఆఖరుకర్మ చేయించే పురోహితులు పట్నాలలో దీనిద్వారాగా యెక్కువలాభం (తహసీల్దారి జీతం) పొందుతూన్నారు; యెఱుగుదును. కాని ఆయీ సాధనాలు వుపకారంకంటె అపకారాన్ని యెక్కువచేసినట్టు కనపడుతూ వుందంటాను. నేడో, రేపో—మన భారతదేశం క్షామదేవతకు గుఱికావలసి రావడం ఆయీ సాధనాలలో రైలుమూలాన్నే అని తోస్తుంది. దీని బారినుండి తప్పించుకోడానికి కొందఱు చెప్పే వుపాయం—ముఖ్యంగా సంతాన నిరోధం. ఆ వుపాయం చెప్పేవారు పాశ్చాత్యులే. ఆ వుపాయంవల్ల పుట్టబోయే సంఖ్య తగ్గుతుంది కాని యిప్పటికే పుట్టివున్నవాళ్ళ గతేల గ? రైతులకు నాల్గు డబ్బులు కళ్ళపడడమే కావలసింది. షావుకార్లకు వర్తకలాభమే కావలసింది. యింకో విశేషం. వీరికి రేపు కూడులేక చచ్చేవాళ్ళలో మనంకూడా భాగస్వాములం కావలసివస్తుందనే వివేచన వున్నట్టే లేదు. రైతు తన మట్టుకు నిలవచేసుకుంటాడే అందాం. తన చుట్టుపట్ల కొంపల్లో వాళ్ళకు డబ్బుకూడా పదార్థం దొరకనప్పుడు ఆ సంసారిని వీళ్లు మెక్కనిస్తారా? అందుచేత వెల హెచ్చుగా అమ్మేపద్ధతినేనా రైతులు షావుకార్లకు యివ్వక తమ వూళ్లోనే నిలవచేస్తే బాగుంటుంది గాని అట్టి వివేకం రైతులకు వున్నట్టు లేదు. అందుకే ప్రభుత్వం కలగజేసుకోవడంగాని, లేకపోతే యీ పరిశ్రమ ప్రభుత్వానికి తగినదికాదు. అయితే సాక్షాత్తుగా పెద్ద అధికార్లు అవాంతరంగా జరిగే మోసాలు కనిపెట్టడానికి అవకాశం వుండదు. యెన్నో మోసాలు జరుగుతాయనిమాత్రం వారికి తెలుసు. అక్కడికీ ఆ మోసగాళ్ళకోసం యేదో ఒక వల తయారుచేశారు. ఆ వలవల్ల ఆర్జించిన అర్జకులకు నష్టి కలిగినా సామాన్యప్రజ కేంలాభం? గతంలో వలెకాక యికముందు క్షామం రాబోతుంది అని కనిపెట్టి నివారణోపాయాలు వెదుకుతూ వున్నారు. వేఱుసెనగపిండిదగ్గిఱనుంచి ఆహారానికి వుపయోగించవలసిందన్నారు. యింటిదొడ్ల దగ్గిఱనుంచీ దున్ని పండించవలసిందన్నారు. తినగలిగితే గడ్డికూడా అభ్యనుజ్ఞ వుంటుందో వుండదో కనుక్కోవాలి. యేం జరుగుతుందో? తుదకు జనాభా పెరగడం కారణంగా భావించి సంతానం ఆపవలసిందనే వారి వూహ. ఆపాతరమణీయంగా కనపడినా నిన్నమొన్నటిదాకా సరిపడి హఠాత్తుగా తన బిడ్డలను పెంచుకొనే శక్తి భారతమాతకు తగ్గిపోవడం అనుభవవిరుద్ధం. కనక దీనికి కారణం రైలుద్వారా జరిగే యెగుమతులే కాని అన్యంకాదు. ప్రతీదీ ఒకదానికి లాభంగా వుండేది వేఱొకదానికి నష్టిని కలిగించడం సహజం. "బాబుకు పెళ్ళి అయిందని సంతోషిస్తే సవతితల్లి రావడానికి విచారించవలసే వస్తుంది."

లోకం యావత్తూ తియ్యనీటికి చేపలమాదిరిని పాశ్చాత్య నాగరకతకు అలవాటు పడింది కుంకుడుకాయలు వాడకం తగ్గింది. ఆ స్థానంలో చాలాభాగం సబ్బు ప్రవేశించింది. చద్దివణ్ణం నాగరిక కుటుంబాల్లోనే కాదు కూలీనాలీ చేసుకునే నిమ్నజాతుల కుటుంబాల్లోనూ నూటికి తొంభైపాళ్లు లోపించింది. ఆ స్థానానికి కాఫీ లేదా, టీ ఆదేశంగా ప్రవేశించింది. పైలకాపు కఱ్ఱదగ్గిరనుంచీ పొగాకు చుట్ట కాల్చడానికి బదులు సిగరెట్లు వ్యాపించాయి. 'ఆశ్చర్యం వేస్తుంది--సాలుకు పాతికో ముప్పయ్యో రూపాయలు వ్యయించి యే దినపత్రికనో తెప్పించుకుంటే దానిలో చెరిసగం, సిగరెట్ల అడ్వర్టైజిమెంట్లో, లేదా సబ్బు అడ్వర్టైజిమెంట్లో తప్ప యితరం కనపడదు. సబ్బు దానిలో తారలు కనపడతారు. చూచి యువకులు ఆనందిస్తారు. అందుకుగా వ్రాసిన మాటలకు అర్థం తెలుస్తుంది. కాని సిగరెట్ల దానిలో వుండే బొమ్మలకు, అర్థం మాబోట్లకు గోచరించదు రేషనింగు బియ్యానికి పెడుతున్నారుగాని సిగరెట్లకు పెడుతూ వున్నట్టులేదు. దారిద్ర్యకారణంచేతనూ కఱువుచేతనూ ఆరోజు కడుపుకు అన్నం లేకపోయినా సినీమా ఖర్చు తప్పదు. గాంధీగారు రాట్నం వొడుకోవడాన్ని బోధిస్తారుగాని సినిమాఖర్చు తగ్గించుకోండని గాని సిగరెట్లు మానండని కాని బోధించరు. అంతమాత్రం చేత మహాత్మునికి ఆయీ దుర్వ్యయాలిష్టమని కాదు. ఆయన బోధించే విషయాలన్నీ సంసారుల శ్రేయస్సుకు వుపకరించేవే కాని వినేదెవ్వరు? అందులోనల్లా వొక్క అస్పృశ్యతను గూర్చిన బోధ మాత్రమే అమల్లో పెడతారని తోస్తుంది. యెందుచేతంటే? దానికి చేతిడబ్బువదలదు కనక. భగవంతుడవతరించి బోధించినా యీ దేశానికి మంచిరోజు లున్నట్టు తోచదు.

మొన్నటి యుద్ధానంతరం ఫ్రాన్సు దేశములో జనాభా తగ్గిందనే కారణంచేత, దాన్ని పూర్తి చేయడానికి ఆడవాళ్ళందఱూ సంతానం (యేవిధంగానేనాసరే) కనితీరవలసిందే అని శాసనం చేశారు పాపం? అంతకుమున్ను మతవ్యాప్తిన్నీ ధర్మవైద్యమున్నూ చేసే బ్రహ్మచారిణులు (నన్సు) దేశం వదలిపోనేనాపోవాలి. లేదా సంతానమేనా కనాలి. అని చెప్పకున్నారు. కొందఱు స్త్రీలు కేవలం గొడ్డుతాళ్ళుగానే సృజింపబడతారు. అశేషులతో చుట్టఱికం వుండిన్నీ అబాపతు స్త్రీలు "పద్మపత్రమివాంభసా" అన్న గీతావాక్యానికి వుదాహరణంగా వుంటారు. యీలాటి కఱువులు కోటి వచ్చినా వాళ్ళ భర్తలకు చిక్కులేదు. యెప్పటికీ లింగీలింగడే గదా? ఆశాసనం ఆ స్త్రీల పట్ల యేలా అమలు జరిగిందో తెలుసుకోలేను.

మన భరతఖండంలో యే యే ఆచారాలు హేయంగా మనం భావిస్తామో, అవసరమయితే అవన్నీ యూరపుఖండం నిరాఘాటంగా ఆమోదిస్తుంది. ఆఖండవాసులతో యీ ఖండవాసులు దేనికీ పోటీచేసి నెగ్గలేరు. యీ ఖండం యెప్పటికేనా బాగుపడాలంటే వారి నాగరికతకు వొకదణ్ణంపెట్టి వర్తించడమే మార్గం. ఆయీమాటకు యితరలోకులమాటల్లా వుండగా యింట్లో పెళ్లాంబిడ్డలే చెవి వొగ్గరు. వారు మనకు—స్వరాజ్యం యిచ్చి యేలుకోండని దూరంగా కూర్చున్నవారి నాగరికతమనమీద అనుగ్రహించి దూరంగా తొలగితేనే తప్ప మనం బాగుపడం. వారికి నామకః మతమంటూ వున్నప్పటికీ క్షణంలో వారుదాన్ని త్యజిస్తారు. ఆచారవ్యవహారాల్లో ఉత్తరధ్రువానికీ దక్షిణధ్రువానికీ వున్నంతదూరంగా పైకి కనపడినా మనతోపాటు మతవిశ్వాసం కలవాళ్లు మహమ్మదీయులే. నిన్నమొన్నటి దాకా రష్యాలో దేవుడు లేడు; నేడు మళ్ళా వున్నాడని వినవస్తూ వుంది. యెల్లుండి మళ్ళా వుండడు; ఆవల్లెల్లుండి వుంటాడు. "మదధీనా తవస్థితిః" అని యెవరో ఆచార్య పురుషులు దేవుణ్ణిగుఱించి అన్నారంటారు గాని అది యూరపుఖండంలో చాలా కాలంనాడే అమలు జరగడానికి ఆరంభించింది. కొన్నాళ్ళు మసోలినీ దేవుడు, అంతకంటే కూడా పెద్దదేవుడు...హిట్లరు. గుఱ్ఱపు జట్కావాడు బాగా నడిచే తన గుఱ్ఱాన్ని హిట్లరు పదంతోటి వాడేవాడు. మీసాన్ని గుఱించి చెప్పేదేమిటి? హిట్లరు అంతరించినా ఆ మీసాలు కనపడుతూ వున్నంతకాలం అతడు వున్నట్టే నాజీజం నశించినా ఆ మీసం నశించదు. యే కాలంలోనూ నేటి భారతీయులవంటి ప్రజలు వున్నట్టు గ్రంథ దృష్టాంతం కనపడదు. ఆడవాళ్ల నాగరికత యెన్ని వెఱ్ఱితలలు వేసిందో! వేసింది. యిప్పటికి సుమారు యిరవైయేళ్ళనాడు 'యజ్ఞోపవీతం బుజ మెక్కు జందెం' దగ్గిఱికివచ్చి రవిక గౌరవం నిల్చింది. యిది యే దేశాన్నుంచి రవాణా అయిందోగాని పాశ్చాత్య నాగరికతబాపతు కాదు. వారిది చలిదేశం; వొంటినిండా బట్ట లేనిదే బతకలేరు. కఱువునుగూర్చి వ్రాస్తూ మాఱుపుంతలో పడ్డాం.

ధాన్యం పుష్కలంగా మనకు పండినా అన్నిఖండాలూ పండితే తప్ప మనకు కఱువు తగ్గదు. వర్షాభావంచేత ధాన్యం వగయిరాలు పండలేదు కనక వాటి వెల హెచ్చిందనుకుందాం. తోళ్ల వెల యెందుకు హెచ్చాలి? సినీమా టిక్కట్టువెల యెందుకు హెచ్చాలి? నల్లమందు వెల యెందుకు హెచ్చాలి, భోగంమేళాల వెలదగ్గిరనుంచీ హెచ్చడానికి ధాన్యంవెల హెచ్చడమేనా కారణం? యేమో దీనిలో కొంత 'వేలంవెఱ్ఱి' వుండితీరుతుంది. మంగలి బుఱ్ఱగొఱగడానికి చార్జీ హెచ్చించడంవంటిదేనా సినీమా టిక్కెట్టుకు వెల పెంచడం, వాడికి ఆ డబ్బుతో బియ్యం కొనుక్కుంటేనేకాని పాయి కిందకీ పాయి మీదకీ పదార్థం దొరకదు. సినీమావారికి యెక్కువ ధనం వుండడమేకదా యీ వ్యాపారం ఆరంభించడానికి కారణం. వారిని యీ ధాన్యపు కఱువేం బాధిస్తుంది? యీ కఱువు రోజుల్లో బియ్యానికి పెట్టిన రేషనింగు సినీమాలకు కూడా పెడితే కొంత బీదలపిల్లలకు కూడు అర్ధాకలిగానేనా దొరికేదేమో?

"కఱవు దరిద్ర మాద్రికముగలె నొకప్పుడు" అన్నట్టు యిప్పటి కఱువుకు సినీమాల పీడకూడా సంప్రాప్తించింది. వొకటేమిటి? గృహస్థుల జీవితం యెన్నివిధాల దుర్భరం కావాలో అన్నివిధాలా దుర్భరంగా తయారయింది. కఱువు తగ్గేదాకా సంతాననిరోధం అమల్లోపెట్టినా తరవాత మళ్లా కంటాడుగదా? ఆలా కనడంలో ఆడపిల్లల్ని కన్నట్టయితే పెళ్ళికొడుక్కి కట్నం పన్ను చెల్లించలేక చస్తాడు దానికి.

కంట్రోలు గవర్నమెంటు పెట్టకపోయినా గృహస్థే పెట్టుకోవాలి. యెవ్వడూ ఆచరణలో పెట్టడం లేదుగాని బుషులు చక్కని కట్టుబాటు యీ విషయంలో రేషనింగును మించిన దాన్ని చేసే వున్నారు. ఆరీతిగా దంపతులు ప్రవర్తిస్తే తప్పక ఆయీ బాధలో చాలావఱకు తగ్గుతుంది. యెన్నో నిషేధాలు ధర్మశాస్త్రాల్లో వున్నాయి. యేంలాభం? ఆచరించేవాళ్లు అగ్రవర్ణాలలోనే కనపడరు. నిమ్నజాతులే కొంతమెఱుగు. అంతకంటే కూడా చతుష్పాదజంతువులు మెఱుగు, వాట్లకంటె జ్ఞానానికి మనిషి యెక్కువ అనుకోవడమేకాని, సంతానం కనడంలో వాట్ల ఆచారయే అభినందనీయం. వొక్క రష్యాతప్ప యితర ఖండాలలో లేదా యితర దేశాలలో జనాభా హెచ్చి వొకళ్ళు వేఱొకళ్ళ దేశాన్ని ఆక్రమించడానికి యత్నించడమూ, తద్ద్వారా రక్తపాతమూ తన్మూలకంగా క్షామమూ వస్తూవున్నట్టు యీ కాలంలో స్పష్టమవుతూంది. కోట్లకొలది జనం చచ్చినప్పుడు, యుద్ధానికి పూర్వం సమృద్ధిగా సరిపోయే పంట యిటీవల మిగలవలసింది. ఆలాకాక తలకిందుగా పరిణమించింది. కొన్ని దేశాలు యుద్ధకారణంగా ఆనకట్టలు వగైరా చెడి నీటివసతులు పాడయి వ్యవసాయానికి లాయకు కాకపోవడం చేత దారిద్ర్యానికి గుఱికావడం వల్ల అక్కడికి మన పదార్థం యెగుమతి

(16 వ పేజీ చూడుడు)

హొసూరు - తెలుగు తాలూకా

శ్రీ కె. శివరామదాస్

హొసూరు తాలూకా రాష్ట్రేతరము లోనిది గాదు; రాష్ట్రమునందే యితర భాషా ప్రాంతములమధ్య చిక్కుకొన్నది. అంతకంటె కాదు. రాయలసీమ జిల్లాలలో నొకటియగు చిత్తూరు నంటియుండు తెలుగుప్రాంతము.

ఒక నియమముగాని, యొక పద్ధతిగాని లేక ఆంగ్లేయులచే గావింపబడిన అప్పటి రాష్ట్రవిభజన ఫలితముగా ఏకజాతి, ఏకభాషాప్రాంతముల నుండి విడదీయబడి యన్యభాషా ప్రాంతములతో నతుకబడియుండు పెక్కుప్రాంతములలో నిదియు నొకటి. ఇట్టి విభజనవలన తెలుగు ప్రాంతమగు హొసూరు శేలము జిల్లాయందును, కన్నడతాలూకాయగు కొళ్ళేగాలము కోయంబత్తూరు జిల్లాయందును నుండవలసివచ్చినది.

ఉనికి, చరిత్ర, భాష, ప్రజాబాహుళ్యము మొదలగు యే ప్రమాణమునుబట్టి చూచినను, హొసూరు తెలుగు తాలూకా యనుట కెట్టి సందేహమును లేదు.

ఉనికి: హొసూరునకు ఉత్తరమున కోలారు జిల్లాయును, పడమట బెంగళూరు జిల్లాయును గలవు. తూర్పున కొంతవరకు చిత్తూరు జిల్లాయును, తర్వాత శేలము జిల్లాకే చెందిన కృష్ణగిరి, ధర్మపురి తాలూకాలున్నవి. వీనిలో ప్రస్తుతము మైసూరు సంస్థానములో నున్న కోలారు, మరియు బెంగళూరు జిల్లాలు తెలుగు జిల్లాలనుట యెల్లరెరింగినదే. కోలారుజిల్లాలో తెనుగుజనాభా 503,081. బెంగుళూరు జిల్లాలో దాదాపు రెండులక్షలమంది ఆంధ్రులున్నారు. అందును యీ జిల్లాలకు జెంది, హొసూరు నంటియుండు ఆనెకల్లు, బౌరింగుపేట—మొదలగు తాలుకాలలో తెలుగువారి సంఖ్య అపారముగ నున్నది. (ఆనెకల్లులో 28,431; బౌరింగుపేటలో 32,958.)

ఇట్లు మైసూరు సంస్థానపు తూర్పుభాగమంతయు నిస్సందేహముగ తెలుగు ప్రాంతములే. ఈ విషయమును మైసూరు జనాభా రిపోర్టులం దిట్లు వివరింపబడినది.

"Telugu is only next in importance to Kanada· it is the principle language of Kolar Distryct, " which really forms part of the Teluge Country incorporated into the territoaries of Mysore State·· The largest number of people using Telugu script has been forced in order in Kolar District, C M states, Bangalore, Tumkur, Kolar Gold fields and Bangalore District."

ఇట్టి ప్రాంతములు తెలుగుభాగములుగ నుండుట వలననే డా॥ చిలుకూరి నారాయణరావు గారు యిటీవల తాము ఆంధ్ర పత్రికలో ప్రకటించియుండు వ్యాసములో ఆంధ్ర భాగములగు కోలారు, బెంగుళూరులను స్వీకరించుటకు ఆంధ్రులు సంసిద్ధులుగా నుంటారని వ్రాక్కుచ్చియున్నారు. ఇట్లు హొసూరు తెలుగుప్రదేశముల నంటియే యున్నది. కోలారు బెంగుళూరు, హొసూరు యివి యించుమించు సమానముగు భౌగోళిక లక్షణములు గలవి. ఈ ప్రాంతమునకు తెలుగు వారు మౌర్య, శాతవాహన, పల్లవ పరిపాలనాకాలములందే వచ్చి సుస్థిరముగ నెలకొనిరి. ఈ విషయము మైసూరు జనాభా రిపోర్టులందు స్పష్టముగ బొందు పరచబడి యున్నది

"Telugu"People in the East and North'—Settlers from the Telugu Country were attracted into Mysore even before 6 th Century A· Dounder the Mauryas and Pallavas."


మరియు నీ ప్రాంతము ఆంధ్రదేశభాగమైయుండిన ములికినాటికి చేరియుండిన భాగము అనియు దెలియుచున్నది —

"Theregion (Mulaka Nadu) embraced the Districts of Bellary, Ananthapoor, Cuddapp h and probably Chittoor in early times It extended even to Kolar District of Mysore on the Southwest There is in the country a Brahmana community known as Mula-ka Nadus" (J· A H· R S Vol IV).

నేడుకూడ యీ ప్రాంతమున ములికినాటి బ్రాహ్మలధిక సంఖ్య గల్గియున్నారు.

ఇక తూర్పున చిత్తూరునకు ఓదప కృష్ణగిరి ధర్మపురి తాలూకాలలోని తెలుగువారి స్థితిని గాంచుడు కృష్ణగిరి యుత్తరభాగ మందున్న వేపనపల్లి, మనవారనపల్లిప్రదేశములు తెలుగుమయముగ నున్నవి. ఇందెక్కువభాగము హొసూరు తాలూకాలోని బేరిక సంస్థానమునకు చెందిన గ్రామములే తర్వాత జగదేవి మిట్టా గలదు ఇది విజయనగర కాలమునాటి విఖ్యాత ఆంధ్రవీరుడగు జగదేవరాయలు స్థాపించి, పాలించిన చోటు. అతడు జగదేవి, రాయకోట, చెన్నపట్టణము మొదలగు స్థలముల ప్రధాన పట్టణములుగ జేసికొని యీ ప్రదేశముల పాలించెను. కృష్ణగిరి యుత్తరభాగమంతయు చిత్తూరుజిల్లాలోని రంగుంది జమీను నంటియున్నది. తక్కిన దక్షిణభాగమునందును, తర్వాతిదగు ధర్మపురి తాలూకా యందును ఆంధ్రులు అరవవారికి తర్వాత రెండవ స్థానము నాక్రమించియున్నారు. 1931 సం. జనాభా లెక్కల ననుసరించి కృష్ణగిరి, ధర్మపురి, పేట్టూరు తాలూకాలలో తెలుగువారి సంఖ్య 84,550. పిదప దక్షిణపు టెల్లనంటి కావేరీ తరంగిణియు, పిమ్మట కోయంబత్తూరు జిల్లాయును కలవు. ఇది కొంగుదేశము. ఇంతటితో తెలుగుదేశపు సహజమైన యెల్లముగియుచున్నది. (కోయంబత్తూరు జిల్లాలో $5\frac{1}{2}$ లక్షలును, సేలముజిల్లాలో $4\frac{1}{2}$ లక్షలను ఆంధ్రులున్నారు) ద్రావిడాంధ్రముల యెల్లలు ప్రకృతిసిద్ధముగ నిట గన్పట్టుచున్నవి. ఈ ప్రదేశమునకే తెంచి పరిశీలించి జూచిన యీ విషయము స్పష్టముగ దెలియును. అందువలనకే 1931 సం. జనాభారిపోర్టున తెలుగుదేశపు సరిహద్దుగీత ఈప్రదేశముగుండా పోవుచున్నదని వ్రాయబడియున్నది. హొసూరు తాలూకాయందు ఉత్తరదిక్కున కోలారు, చిత్తూరు ఎల్లలనుండి దక్షిణమున దాయపుముప్పాతిక భాగమునందంతట తెలుగువారే విస్తారముగ నున్నారు. ఆ తర్వాత దక్షిణమునకు పోనుపోను కన్నడులసంఖ్య కొంత యధికమగుచుండును. ఇట అత్యధికసంఖ్యాకులగు ఆంధ్రులకు పిదప కన్నడులు ద్వితీయస్థానము నాక్రమింతురు. తక్కినవారు అల్పసంఖ్యాకులు. "జనాభా అంకెలన పరిశీలించినచో హొసూరు కృష్ణగిరి మొదలగు తాలూకాలలో కన్నడము కన్న యితర భాషలే యెక్కువయని తెలియుచున్నది. హొసూరు తాలూకాలో తెలుగువారు, కృష్ణగిరి, ధర్మపురి, పేట్టూరుతాలూకాలలో అరవలు అధికసంఖ్యాకులు. కృష్ణగిరిలో ధర్మపురిలో కన్నడులకన్న తెలుగువారే అధికసంఖ్యాకులు. (ఆం. పత్రిక 7 డిశంబరు, 1938.)

1799 వ సంవత్సరమున హొసూరు ప్రాంతము ఆంగ్లేయుల వశమాయెను. ప్రస్తుతము చిత్తూరు జిల్లాలోని పుంగనూరు పెద్దనాయకుని దుర్గము మొదలగు ప్రదేశములు ఆ సమయమున హొసూరుతో చేరియుండెను. అపుడివి యన్నియు ఉత్తర ఆర్కాడుజిల్లా భాగములుగ నుండినవి. పిమ్మట 1808 వ సంవత్సరమున పుంగనూరునువదలి తక్కిన ప్రస్తుతము హొసూరు



తాలూకా యనబడు యీ ప్రదేశమును శేలమున జేర్చిరి ఇట్లు తెలుగు ప్రాంతములనుండి విడదీయబడిన తరువాత హొసూరు 1831 నుండి 1860 వరకు యీ జిల్లాలకు ముఖ్యపట్టణముగ నుండెను.

ఆంగ్లేయులకు వశమైనప్పటినుండి 1915 వరకు హొసూరునందు తెలుగే సర్కారుభాషగ నుండెను. (అనగా దాదాపు 115 ఏండ్ల కాలము)

అందువలననే ప్రజలు తమ మాతృభాష ద్వారా తమ వ్యవహారముల నడుపుకొనుచుండిరి. తెలుగు దెలిసిన యధికారులే యీ ప్రదేశమున నియమించబడుచుండిరి. ఆ కాలమున సర్కారు కచ్చేరీలనుండి యివ్వబడియుండు యుత్తరవులను జూచిన ఈవిషయము విశదమగుచున్నది. అట్టి యొక యుత్తరవుప్రతిని క్రింద బొందుపరచుచున్నాను

ఉత్తరవు

హొసూరు తుకడీ తహసీలుదారుగా. తి· రాజగోపాలాచార్యులవారు—

కుందుమారనపల్లి కరేదారు సారణ గౌడుకు తాండ కుందుమారనపల్లిలో వుండే రామేగవుడు అనేవాడు యెణ్ణెగెరె గ్రామంలో స్వంతంగా వొఖ చెరువుకట్టేటందుకు వుత్తరవు కావలనని మావద్ద విన్నం యిచ్చినదిగాక ఈవిషయమై హజూరికిన్ని వొఖ విన్నపం వ్రాసుకొన్నాడు. అందుపైన సదరీ చెరువు కట్టేవిషయంలో సబకలేకట్రుదొరవారివల్ల ముడివైన వుత్తరవు పంపించేవరలో విన్నపదారుడు చెరువు కట్టకూడ దని ఖండితముగా తెలియచేయుమని 124 నెంబరు యిందారసుత్తరవు వచ్చివున్నది గనుక యీ సంగతి విన్నపదారుడికి తెలియ చేసేది.

1868 సంవత్సరం ఫిబ్రవరినెల 28 తేది

(చేవ్రాలు)

ఇట్లుండ 1915 సంకి అరవము అధికారభాష యైనది. అందువలననే తమ సర్కారు సంబంధమగు వ్యవహారముల నడపుకొనుటయందు ప్రజలకు చాల యిక్కట్టు కలుగజొచ్చినది. భాషకు కళాకాంతులు తగ్గజొచ్చినవి.

సహజసంపదలతో విలసిల్లు యీ యాంధ్ర భూఖండమును కీవలలో శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు, మాగంటి బాపినీడుగారు, డాక్టరు పట్టాభిగారు, కె. లింగరాజుగారు, కల్లూరి సుబ్బారావుగారు మొదలగు ఆంధ్రనాయకు లేతెంచి యిచ్చటి నిజస్థితిని అరసియున్నారు. ఆంధ్రరాష్ట్రమున జేర ప్రజలు సిద్ధముగ నున్నారనుటను వారు గ్రహించియేయున్నారు. ఇందులకు నిదర్శనముగ పట్టాభిగారు ఆంధ్రరాష్ట్ర సంబంధమగు తమ ఉపన్యాసములందు హొసూరును గురించి చెప్పియున్నారు. "హొసూరు తాలూకాలో తెలుగు మాట్లాడువారున్నారు. ఇటు బళ్లారి, అటు చిత్తూరు ప్రాంతముల ఆంధ్ర ప్రాంతములేనో, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు వారు నిర్ధారణగా తేల్చుకొనియే యున్నారు" (ఆం· పత్రిక ఏప్రిల్ 13, 1947). "1938 ప్రాంతంలో నేను చెంగల్పట్టు వెళ్ళాను . . . . శేలం జిల్లాలోని హొసూరు తాలూకా వెళ్ళాను..... అంతా తెలుగు మాట్లాడుతారు. కృష్ణగిరి తాలూకాలో సగం తెలుగు ప్రజలకు వివేకం వుంటే ఎక్కడికి పోవాలో తేల్చుకోగల్గుతారు" (ఆం. పత్రిక. 1948 జనవరి 11).

ఇదివరలో వివరించిన యంశముల వలన హొసూరు తాలూకా, మరియు కృష్ణగిరి యుత్తరభాగము-యివి రెండును తెలుగుప్రదేశములని తెలియుచున్నది. భాషలను బట్టి రాష్ట్రములు విభజింపబడుటచే ఈ ప్రదేశములను ఆంధ్రరాష్ట్రమున జేర్చుకొనవలసి యుండుట సమంజసమై యున్నది. ఇదివరలోవలె ఇంగ్లీషున గాక యిక ప్రాంతీయ భాషల ద్వారా ప్రభుత్వ వ్యవహారములు జరుగనుండుటచే నట్లు గావింపబడవలెనని యుండుట మిక్కిలి యవసరమై యున్నది అపుడే ప్రజలు తెలుగులో కచ్చేరీలయందును, కోర్టులందును తమ వ్యవహారములను సులభముగ గావించుకొందురు. సర్కారు వ్యవహారములు తమ భాషలో జరిగిన ప్రజలకెంతో సౌకర్యముగనుండును. అనవసరపు వ్యయము తొందరలు తగ్గును. మరియు "ప్రతి మనుష్యుడును స్వభాషాసాహాయ్యముచేతనే గ్రహించును; యోచించును; నూతన విషయముల నావించును, కల్పించును స్వభాషయందు విద్యాపరిశ్రమము కలుగనిచో మనుష్యులకు సాధారణముగ ప్రతిభ యుదయింపదు. స్వభాషమూలముగ జ్ఞానసంపాదన చేయుట సులభము. ఇతర భాషల మూలముగా జ్ఞానసంపాదన చేయుట కష్టము. శ్రమ అధికము, నిరర్థకము, కాలహరణము అగును. ప్రజాబాహుళ్యమునకీ జ్ఞానము వ్యాపింపదు. దేశాభ్యుదయమునకును భాషాభ్యుదయమునకును పరస్పరసంబంధము గలదు. దేశభాషల నాశనము ప్రజల నాశనమని చరిత్రలుద్ఘోషించుచున్నవి. !

ఆంధ్రరాష్ట్రమున జేరినపుడే తెలుగు ప్రధాన భాషగను, ప్రభుత్వభాషగను మెలగి ప్రజలకు సౌకర్యాధాయక మగును. అందువలననే ప్రజలు తమ పురోభివృద్ధిని మనస్సునందిడి చక్కగ నాలోచించి తమ కర్తవ్యమును తేల్చుకొనవలయును. ఇప్పటివారి విషయమేగాక ఇకముందు ప్రజానీకముయొక్క బాగోగులు తరతరముల వరకు యిప్పుడు గావింపబడు నిశ్చయముపై నాధారపడియుండుననుటను మఱవరాదు. ఆంధ్ర నాయకులును, ఆంధ్రమహాసభవారును నీ సమయమున తమ కర్తవ్యమును నిర్వర్తింపవలసి యున్నది.

———

కళాపిపాసకుడు, మా గురూజీ

శ్రీ వేలూరి రాధాకృష్ణ

కాలమాన పరిస్థితులతో నిమిత్తం లేని నిరంతర ప్రయోగామి శిల్పి. అడే చిత్రకారుడు!

మనుష్యుడు కాలపరిమితితో బంధితుడే ఐనప్పటికీ, కళోపాసకుడైతే, నిరంతరమూ సౌందర్యాస్వాదనే, అతనిని అమరుణ్ణి చేస్తుంది.

ఇది అక్షరాలా మా గురూజీ ఐన శ్రీ దేవీప్రసాదరాయ చౌదరీ పట్ల నిజం!

ఈయనకు ఈ ప్రపంచం, మామూలుగా, మాధులనుకునే ఊహాలోకం కాదు. కేవలం చిత్రకారులూ శిల్పులూ కవులూ అనుకునేది, దైనందిన మానవ జీవిత కష్టసుఖాలతో సంబంధం లేదనీ, తమది కేవలం ఊహాగానమేననీ, వారిది కేవల కాల్పనిక ప్రపంచమేననీ. కాని మా గురూజీకి ఈ ప్రపంచం, ఈ సర్వజీవరాశి అల్లా కనిపించదు. రోడ్డుప్రక్క తిండిలేక మాలమలమాడే, అనాథుల కాపురాల దురవస్థను చూసి బాధపడతారు. కేవలం బాధపడి పిట్టి కన్నీటి చుక్కలను మాత్రం కార్చక, ఆవేదనలో మైమరచి తనశిల్పకళా కౌశలంతో ఒక శిల్పంలో గాని, ఒక చిత్రంలో గాని, ఆదారిద్ర్య బాధను మూర్తీభవింపజేసి, మానవ సేవకుల మనిపించుకొని తిరిగే, వారికి పాఠంనేర్పుతారు.

రిక్షావాడి జీవితంతోను, 'తప్పతాగి, తందనాలాడే తాగుబోతుతోనూ, ఐశ్వర్యంతో తులతూగుతూ, సోఫాలలోనే జీవించే శ్రీమంతులతోనూ, నిత్యమూ, పై అధికారిచే మొట్టికాయలు తినే గుమాస్తాతోనూ, వారి మనస్సు తిరుగాడుతుంది. అలాంటి జీవిత నిజ నగ్న స్వరూపంలో మగ్నమయే మా గురుజీ వంటి శిల్పితో తులతూగే మనిషి, మన దేశంలో లేడనిపిస్తుంది!

* * * *

వారితో నా పరిచయ ప్రారంభం 1943 లో. నా చిత్రకళాభ్యాసంకోసం, వారిని ఆశ్రయించాను. స్కూలు ఆఫ్ ఆర్ట్సులోకూడ, సీట్ల పరిమితి ఉందనీ, దానికి కూడా ఎంతో బాధపడి ఎంతమందినో ఆశ్రయించాలనీ, అనుభవం లేని నాకు తెలియకపోయింది. ఒక రోజు సాయంత్రం, వారి స్వగృహానికి వెళ్లాను. కొన్ని చిత్రాలను - నే గీచినవి - కూడా తీసికొని వెళ్లాను. వారు బైట వరండాలో సోఫాలో కూర్చుని సైక్ త్రాగుతూ, ఏదో ఆలోచనా నిమగ్నులై కూర్చొని ఉన్నారు. నేను భయభ్రాంతులతో ఒకప్రక్క నిలబడ్డాను. నన్ను చూచి వెంటనే సాదరంగా కూర్చోమని సంజ్ఞ చేసి, ఏమి పనిమీద వచ్చారని సహజ గాంభీర్య స్వరంతోనే అడిగారు. నేను కొంత తడబడుతూ జంకుతూ వచ్చినకారణం చెప్పాను. "ఓ, అల్లాగా. 'ఏవో బొమ్మలు తెచ్చినట్టున్నావ్. ఏవి ఇలా చూపించు' అని అడిగారు. నా కేమంటే భయం, తాగుతాడు; ఎవరైనా పడితే చిర్రుబుర్రులాడుతాడు! అనే వినికిడితో, ఎక్కడ ఏ దురదృష్టసమయంలో పడతానో, ఎక్కడ కేకలేస్తాడో అని. ఇలా సానునయంగా పలకరించేటప్పటికే, నాకు పరమానందం వేసింది. వెంటనే తీసి, నా బొమ్మలన్నీ ఒక్కొక్కటే చూపించాను.

"ఊఁ. బాగుంది. బాగుంది. నీ బొమ్మల్లో మంచి ప్రామిస్ కనిపిస్తోంది. నీకు సీటు ఇవ్వటాని కేమీ అభ్యంతరంలేదు ....." అని వచ్చినపనికి అనువైన, పరమానంద కరమైన సమాధానం ఇచ్చి, ఏవో ఏవో చాలా చాలా మాట్లాడి, చివరికి—


"ఏమోయ్, నీవుచాలా చిన్నకుఱ్ఱవాడివి. నేనే అప్పుడే పెద్దవాణ్ణి అయిపోయాను. నీవు కళా రాజ్యంలో, సేవచేయవలసిన కాలం చాలా ఉంది. నేనుకూడా ఒక్కసారిగా చిన్నవాణ్ణయితే ఎంతబాగుండేది' అని వాపోయారు!

నాకు చిత్రం అనిపించింది. ఈ సంభాషణ ఆయన పేరుకూ, దశదిశలా తెలుసు, ఆయన అసమానశిల్పి అని. ధనానికా లోపంలేదు. మరి దేనికి ఆయన 'చిన్నవాణ్ణి కాను, అప్పుడే పెద్దవాణ్ణయిపోయాను' అనే వాపోత! కొంతకాలానికి నాకే అర్థమయింది. తను చేసిన కళాసేవతో సంతృప్తి లేని, నిజమైన కళాసేవకుని తీరని నిరంతర తృష్ణ ఎవరైన గౌరవంకొద్దీ, ఆయన కౌశల్యాన్ని "మీరు కళాధిపతులని" ప్రశంసిస్తే, ఆయన తీరని ఆవేదనతో, "అబ్బే, నా కల్లా పిలిపించుకునే అర్హత లేదు. నేను నా జీవితాంతం వరకూ కళాసేవకుడుగా నుందామనే కాని, కళాధిపతిగా ఉందామని కాదు. ఐనా కళాధిపతిగా ఉండటానికి నే నెవణ్ణి! కళ అమరమైంది. నేను పట్టి మానవమాత్రుణ్ణి" అని అంటూరు.

ఆయన విద్యార్థిదశలో, పెద్దపెద్ద కళాధిపతులవద్ద, కళాభ్యాసాన్ని చేశారు. అప్పుడే

వారికి వర్ణచిత్రాలని చిత్రించాలనే కుతూహలంకన్న, మంచి జీవంతో ఉన్న శిల్పాలని ప్రతిష్ఠాపించాలనే కుతూహలం మెండు.

ఆయన నిర్మించిన శిల్పాలన్నీ, ప్రఖ్యాతమైనవి. ఆయనను ప్రపంచమంతా అసమాన శిల్పి అనే ఎరుగును గాని చిత్రకారుడని మాత్రం కాదు. ఆయన మట్టితో చేసిన శిల్పాల్లో, 'అపరబ్రహ్మ?' అని మనం భ్రమ చెందేటట్లు, జీవం పోస్తారు. వారు నిర్మించిన, వారితండ్రిగారి రూపశిల్పం, వారి స్టుడియోకి వెళ్ళంగానే ఆకర్షించేది. ఆనీ బెసెంటు శిల్పం ఇటీవల నిర్మించిన, కరుణాకరమీనన్, మళయాళ దేశ కవియైన కుమారఆశాన్, శిల్పాలు. ఈ వారం ఆంధ్రవారపత్రికను అలంకరించిన, అమరజీవి, మహాత్మాగాంధీజీ రూపశిల్పం వారి యొక్క వర్ణనాతీతమైన శిల్పకళాకౌశలాన్ని తెలుపుతయ్.



మద్రాసు చిత్రకళాశాలా ప్రధానాచార్యులు సుప్రసిద్ధ శిల్పి, శ్రీ దేవీప్రసాదరాయ చౌదరిగారు తయారుచేసిన మహాత్ముని విగ్రహం, విగ్రహం ప్రక్కనే శిల్పి చౌదరీగారు నిల్చుని ఉన్నారు.

ఆయన విశిష్టత కళాధిపతుల మనివించుకునే ఆ ఉపాధ్యాయుల కర్థమయింది. వారు ఇది నేర్చుకోమని చెప్పింది ప్రతిదీ ఆయన నేర్చుకోలేదు. వినయంతోనే నిరాకరించి, ఆయన అనుకున్న పంథా ఏదో, దాని వెంటే పడిచారు. వారు ఇల్లా అభ్యసిస్తేనే సరియైన కళా కుశలత కలుగుతుందని చెబితే, ఇలాఇంకో కొత్త పంథా తొక్కితే, ఈ విధమైన కళవిశిష్టమైంది కాదూ? అని బోకరించారు! ఈవిధంగా, తన ఉపాధ్యాయులందరిచే, తిరస్కృతుడై, 'నిద్రాహారాలు లేక, తను నిజము, సహజమూ అనుకున్న మార్గాన్నే అనుసరిస్తూ వెళ్లారు.

విద్యార్థి తప్పు చేస్తే, ఉపాధ్యాయుడు మందలించి మంచి మార్గాన నడిపించేవిధంగా, తనేమైనా తప్పుచేస్తే, తనకు తానే శిక్షించుకొని, దాని కెంతో బాధపడి, నిజ కళాన్వేషణకు బయలుదేరతారు. తను చిత్రించిన చిత్రాన్నే, తనకు బాగుండలేదని తోస్తే వెంటనే రూపం లేకుండా చేసేస్తారు. చింపేశేస్తారు. 'అయ్యో' తను వేసిందే కదా, ఏవిధమైన ఆలోచనా లేకుండా నాశనంచేస్తాడేమిటి, అని విద్యార్థులమైన మేమంతా ఆశ్చర్యకరమైన విచారంతో అనుకుంటూ ఉండేవాళ్లం. అందువల్ల ఆయన కాయనే విద్యార్థి. ఆయన కాయనే అధ్యాపకుడు! ఒక చిత్రంలో తను అనుకొని, నిశ్చయించుకొని చేసిన నిర్మాణం రాకపోతే ఆ సంపూర్ణనిర్మాణం కోసం, ఎంతధన, కర్మ వ్యయాన్నైనా చేస్తారు. అదే ఆయనలోని ప్రశంసనీయమైన, శ్రమ నెరుగని నిరంతర నూతనపథాన్వేషణ.

చిత్రాలని చిత్రించే ప్రతివ్యక్తీ చిత్రకారుడే ఐనప్పటికీ, తన చిత్రాలలో, మానవ సహజసుఖదుఃఖాలని మూర్తీభవింతజేసే, కళాకౌశలం (Technique) లేకపోతే, ఆ వ్యక్తి సంపూర్ణచిత్రకారు డనిపించుకోడు. అలాటి సుఖదుఖాఃలని మూర్తీభవింపజేసే "అద్భుత కళాకౌశలం," ఈ మనదేశంలో మా గురూజీకి తప్ప, ఇంకెవరికీ లేదని నేను ఘంటాపథంగా చెప్పగలను. వారి చిత్రాలు నిజంగా మనం రోజూ రక్తమాంసాలతో చూసే జీవుల ప్రతిబింబాలు. ఆవిధంగా చిత్రించని వ్యక్తి అసలు చిత్రకారుడు కాదనే అంటారు ఆయన.

పౌరాణిక విషయాలని గూర్చి చిత్రాలని చిత్రించే వారిని ఆయన ఏవగించుకుంటారు. పురాణాలలో చిత్రకారుని విశిష్టత్వం ఏమీ కనిపించ దంటారు. ఎవరో అనాదికాలంలో కొన్ని గీట్లు గీచి పెట్టిన వాట్లల్లోనే, మగ్గి ఉండటం ఆయన కసహ్యం, కాలంతోపాటు నడిచే సకలజీవరాశియొక్క, చిత్రనిరూపణే ఆయన ఆశయం గమ్యం కూడా. ఆయన మాకు నేర్పింది కూడ అదే.

"మీరంతా, కళారాజ్యంలో గమ్యాలని మీరే నిశ్చయించుకోవాలి. మీ రిదే అవలంబించాలని నేను మిమ్మల్ని నిరుమించను. మీరు జీవితం విషయంలో ఎలాటి అభిప్రాయాలని కలిగియుంటారో, ఆలాటి అభిప్రాయాలనే మీ చిత్రాలలో నిరూపించాలి. మీ అభిప్రాయంలో నే ననుగమిస్తున్న మార్గం తప్పని తోస్తే, దానినే అనుసరించవద్దని గట్టిగా చెబుతాను. కాని ఒక విషయంమాత్రం మీతో హెచ్చరిస్తాను అదేమంటే జీవితం జీవి:— ఈ రెంటి సంబంధ బాంధవ్యాల నైజాన్ని తెలుసుకొని కళాభ్యాసాన్ని చెయ్యండి" అని. అని ఆయన, చివరిరోజున మేము బడివిడిచి వెళ్లిపోతుంటే పిలిచి చెప్పింది.

మరొక్క విషయం:

చిత్రకారునికి అభ్యుదయానికి రెండే సోపానాలు: ఒకటి తన ఆత్మ రెండు తన తోడి మానవానీకము యొక్క ఉత్కర్ష. ఈ రెండు ఏ కర్మకారునికైన కావాలనుకోండి. కాని చిత్రకారునికి ముఖ్యంగా కావలసిన వివి రెండు గాన సభలో గాయకునికి, ప్రోత్సాహంగా వింటున్న ప్రేక్షకజనంయొక్క హర్షధ్వను లెలాగో, చిత్రకారునికి, తన తోడిమానవానీకం యొక్క హర్ష, ప్రశంసనీయ వాక్కులలాగ ఆ సందర్భంలో మాననీయ శ్రీ దేవీప్రసాదరాయ చౌదరీగారు, మన మద్రాసు చిత్రకళా శాలాధిపతులుగా ఉంటున్నప్పటికీ, వారు చేస్తున్న కళాసేవయొక్క నైజాన్ని మనం గ్రహించలేకపోవటం శోచనీయం. ఆయన దేశమంతటా, ప్రతిభుడైనప్పటికీ, మన రాజధానిలో ఇంకా ప్రతిభుడు కాలేదు. దానికి కారణం, ఆయననిజకౌశల్యాన్ని గ్రహించలేకపోవటమే.

ఆయనకి మనం చేయవలసిన ప్రోత్సాహం మన ఆంధ్రమహనీయుల శిల్పాలు, వారిచేనిర్మింపజేయటం, ఆ శిల్పనిర్మాణాలని మన ఆంధ్ర ముఖ్య నగరాల్లో అధిష్ఠాపించటం, అవిధంగా మన రాజధానిలో నున్న ప్రజానీకానికి ఆయన అసమానశిల్పకళాకౌశలాన్ని తెల్పటం.

విద్యావిధానము; విజ్ఞానవ్యాపనము

శ్రీ దిగవల్లి వేంకటశివరావు

మన విద్యావిధానమును సంస్కరించుటను గూర్చిన చర్చలు కొన్ని ఇటీవల కొంత కాలమునుండి జరుగుచున్నవి. కేవలము పిల్లలకు అక్షరజ్ఞానము కలిగించుటయేగాక వారికి ప్రపంచ జ్ఞానము కలిగించి శాస్త్రవిజ్ఞానమును నేర్పి వారిని తమ తమ వృత్తులలో ప్రవీణులుగా జేసి, దేశముయొక్క అర్థోత్పత్తిని అభివృద్ధిచేయుట కును వారికి పౌరధర్మములను బోధించి వారు దేశపరిపాలనమును చక్కగా నిర్వహించు కొనుటకు వీలు కలిగించుటకును తోడ్పడగల సాంకేతిక వృత్తివిద్యను పౌరవిజ్ఞానమును కలిగింపవలెనను సంగతిని మన విద్యామంత్రిగారు గ్రహించి అందుకొరకు విద్యావిధానములో కొన్ని మార్పులు చేయుచున్నారు. హెచ్చు సొమ్ము వ్యయము చేసి మరికొన్ని క్రొత్తపాఠశాలలను స్థాపించుచున్నారు. వానిలో ఉదయము మధ్యాహ్నము రెండు జట్టులుగా హెచ్చుమంది విద్యార్థులకు చదువు చెప్పుట కేర్పాటుచేయుచున్నారు. ఉపాధ్యాయులలో కొందరికి విధ్యాధికార పదవు లిచ్చుటకు నిశ్చయించినారు. ప్రజలలో పెద్దవారిలో వయోజనలలో విద్యను వ్యాపింపజేయుటకు కొందరుపాధ్యాయులను తయారు చేయుచున్నారు. ఇదియంతయు బాగుగనే యున్నది. కాని యీ సంస్కరణములవలన దేశప్రజలలో నెంతకాలములో విజ్ఞానవికాసము కలుగును, ఎంతకాలములో దేశము దారిద్ర్యమునుండి విముక్తియై పాడిపంటలు వృద్ధిగాంచును. ప్రజ లెంతకాలములో తమ యభిమతానుసారముగా ప్రభుత్వమును నిర్వహించుట నేర్చుకొనగలుగుదురు ? అను విషయములు ఆలోచింపతగినవి.

పాఠశాలలందు విద్యార్థులకీ క్రొత్తభావములు బోధించినపిదప వారు కన్నులు తెరచి అర్థికాభివృద్ధిని కలిగించి ప్రజాప్రభుత్వమును చక్కగా నిర్వహించునప్పటి కొక తరమైన గడచును. ఈలోపుగా దేశము పూర్వమువలెనే అధోగతిలో నుండును.

ఇది చాల విశాలమైన పెద్ద దేశము. ఇందు కోటానుకోట్ల జనులున్నారు. వీరిలో చాల మంది నాగరిక జీవనమునకు దూరముగా మారుమూల కుగ్రామములలో జీవించుచున్నారు. మనదేశ జనులలో బహుసంఖ్యాకులు విద్యాగంధము లేక అజ్ఞానమున బడియున్నారు. ప్రపంచమునందలి నాగరిక దేశములందువలె మన ప్రజలు తమ కాయకష్టమునకు తగిన అర్థోత్పత్తిని చేసి సుఖపడజాలకున్నారు. దీనికి కారణము శాస్త్రవిజ్ఞానము లేక ఆధునికయంత్రపరికరముల యుపయోగము తెలియకుండుటయే. మన ప్రజలు మొన్న మొన్నటివరకును విజాతీయ ప్రభుత్వమునకు లోబడి అస్వతంత్రులైయుండి ఇప్పుడే స్వతంత్రులైనందువలన పౌరస్వత్వపు బాధ్యతలుగాని, ప్రభుత్వనిర్వహణ పద్ధతులుగాని ఎఱుగక ప్రజాప్రభుత్వమువలన లాభములను పొందజాలకున్నారు.

మనదేశమున బాలబాలికలకు పాఠశాలలందు విద్య నేర్పుటకు స్థాపించబడు నూతన విద్యావిధానమునందు పైన చెప్పిన విజ్ఞానమును బోధించుటకు తగిన ఏర్పాటుచేయుట అవసరమే. అయితే దేశము అభివృద్ధిగాంచి బాగుపడుటకిది మాత్రమే చాలదు.

దేశము అర్థికముగను, రాజకీయముగను అభివృద్ధి చెందవలెనన్నచో కేవలము పాఠశాలల సంఖ్య అభివృద్ధిచేసిన చాలదు. విద్యాబోధనమునందు కొన్ని మార్పులు చేసినను చాలదు. వయోజనవిద్య నిమిత్తము కొన్ని ఏర్పాటులు చేసినను చాలదు. దేశప్రజలకు త్వరలో విజ్ఞానమును కలిగించి అర్థోత్పత్తియందు, దేశపరిపాలనమునందు వారుత్సాహముతో పాల్గొనునట్లు చేయగల సర్వతోముఖమైన విజ్ఞానవ్యాపకవిధాన మొకటి తక్షణమే స్థాపించవలెను. మెల్లిగా పాఠములు చెప్పి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పు పాఠశాల లెన్ని స్థాపించినను దేశప్రజలలో విజ్ఞానవికాసము కలుగదు. కొంతమంది యుపన్యాసకులచేత ఉపన్యాసము లిప్పించినంతమాత్రమున వయోజనవిద్య వ్యాపింపదు. అక్షరవిజ్ఞానము కలిగించుటకన్నను ముందుగా శ్రవ్యదృశ్యమార్గములద్వారమున విజ్ఞానమును వ్యాపింప జేయవలెను అనగా సినిమాటాకీ రేడియోల ద్వారమునను ఉపన్యాసముల ద్వారమునను పిన్నలకు పెద్దలకును నాగరక ప్రజాజీవన విధానములను పౌరధర్మములను శౌచవిధులను ఆరోగ్యసూత్రములను బోధించవలెను. వ్యవసాయ పరిశ్రమల నభివృద్ధిచేయగల శాస్త్ర విజ్ఞానమును క్రొత్త పరికరముల యుపయోగములను నూతనయంత్రము నడుపు పద్ధతులను ప్రత్యక్షముగా ప్రజలకందరికిని కన్నులకు గట్టినట్లు ప్రదర్శించవలెను. ఈ కార్యమొక మహాయజ్ఞముగ జరుపవలెను. దేశములోని చదువుకొన్న వారందరిని, విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఇందు కొరకుపయోగింపవలెను. ప్రభుత్వ శాఖలలో పనిచేయు ఉద్యోగులందరును తమ సామాన్య కర్తవ్యములతోపాటు ముందుగా విజ్ఞాన వ్యాపన కార్యమున పాల్గొనునట్లు ప్రభుత్వము కట్టుబాటు చేయవలెను ఇట్లు చేసినచో కొద్ది కాలములోనే ఈ విజ్ఞాన వ్యాపక మహోద్యమము వలన దేశప్రజలలో గొప్ప కదలిక కలుగును. వారి నిత్యజీవనమునందు, వృత్తులందుకూడ ఈ క్రొత్త సిద్ధాంతముల నుపయోగింప గలుగుదురు. ఆరోగ్యము అర్థోత్పత్తియు అభివృద్ధి గాంచును. ప్రజాభిమతానుసారముగా పరిపాలన జరిపించి బాగుపడు పద్ధతులలవడి ప్రజా ప్రభుత్వము సార్థకమగును. ప్రజలలో నిట్టి విజ్ఞాన వికాసమును కలిగించినచో అక్షరజ్ఞానము సంపాదించి పుస్తకములు చదువవలెనని, శాస్త్రవిజ్ఞానమును అభ్యసింపవలెనని, జనసామాన్యము నందును వారి పిల్లలందును వాంఛకలిగి విద్యదానంతట నదియభివృద్ధి గాంచును. ఇది కేవలము ఊహాజనితమైన ప్రణాళిక కాదు. చాలకాలము అజ్ఞానమున దారిద్ర్యమున బడియుండిన సోవియట్ రష్యా దేశప్రజలు స్వతంత్రులైన కొలది కాలములో నీపద్ధతులవలననే విజ్ఞాన వికాసమును పొంది దేశాభివృద్ధికి తోడ్పడియున్నారు.

విద్య నేర్చుకొనుట కొఱకు పాఠశాలలందు చేరి తీరవలెనని, పాఠశాలలందు నియమింపబడిన వేళలలో హాజరై చదువవలెనని, కొంత వయసు మీరినవారు పాఠశాలలందు చేర వీలులేదని, ఇంత జీత మిచ్చిన గాని ఉన్నతవిద్యశాస్త్ర విజ్ఞానము బోధింప వీలులేదని, ఇట్టి కఠిననియమము లనేకములు ప్రస్తుతపు విద్యావిధానమునందుండుటవలన మన దేశపు బీదజనులును వారిపిల్లలును జ్ఞానము పొందుట కాటంకములుగా నున్నవి.

ఎంతో నాగరికతను జెంది విద్యాభివృద్ధిని కలిగియున్న అమెరికా ఇంగ్లాండు మొదలైన దేశములందుకూడా యిటువంటి నిబంధనలుండుటవలన బీదలైన కర్షకకార్మికజనులకూ వారి పిల్లలకూ ఉన్నతవిద్య అందుబాటులో లేకుండుట జూచి అచ్చటి సంస్కర్తలీ నిర్బంధములను తొలగించి అచ్చటి పాఠశాలలను కళాశాలలను విశ్వవిద్యాలయములను జనసామాన్యమునకు విద్యను బోధించు కేంద్రములుగా చేసియున్నారు. ఇంగ్లాండులో "వర్కర్స్ ఎడ్యుకేషన్ అసోసియేషను" అను పనివారల విద్యాసంఘమువారీ విషయమై చాల కృషిచేసి సర్వతోముఖమైన విజ్ఞానవ్యాప్తికి తోడ్పడినారు. వారి యాందోళన ఫలితముగా పాఠశాలలందును, కాలేజీలందును వయస్సునుగూర్చిన కాల నియమములును తొలగింపబడినవి. పనివారల పిల్లలకు వీలైన సమయములందు తరగతుల నేర్పరచి విద్యావిషయకములైన యుపన్యాసము లిప్పించి వారికొరకు పరీక్షల నేర్పాటుచేయించి పాఠశాలలను కాలేజీలను జనసామాన్యమునకు నేర్పు విద్యాకేంద్రములుగా మార్పించినారు.

ఇంగ్లాండులోని కార్మికులు కర్షకులు, ఇతర వృత్తులవారు ప్రతివారము చివరను సెలవలుగానుండు శని ఆదివారములలో సముద్రతీరపు పట్టణములకు బోయి వినోదించుచుందురు. అట్టి విశ్రాంతిసమయములలో వారికి విజ్ఞానమును బోధించుటకొరకీ సంఘమువారు విద్యాకేంద్రముల నేర్పరచి ఒక దినముననే విద్యను బోధించు పాఠశాలలును వేసవి శలవులలోను ఇతర సెలవులలోను శాస్త్రవిజ్ఞానమును బోధించు పాఠశాలలును ఏర్పాటుచేసి మంచి ప్రావీణ్యముగల శాస్త్రజ్ఞులచేత యుపన్యాసముల నిప్పించుచున్నారు. శాస్త్ర పరిశోధన తరగతులనుకూడ ఏర్పాటుచేసి. అనేకులకు ఉన్నత విద్యా లాభమును కలిగించుచున్నారు. నాటకసమాజముల నేర్పరచి, విజ్ఞానమును వ్యాపింపచేయుచున్నారు. విద్యావిషయక మహాసభలను సమావేశపరచి ప్రజలలో విజ్ఞానమును వర్ధిల్లజేయుచున్నారు.

ఎంతో నాగరికతను జెందిన ప్రజానీకములుగల దేశీయులైన అమెరికా ఐరోపా దేశములలో సైతము ఉన్నత విద్యయు శాస్త్రవిజ్ఞానమును జనసామాన్యమునకు అందుబాటుచేయుటకొరకు ప్రయత్నములు జరుగుచుండగా ఎంతో వెనుకబడియున్న మన దేశములో నటువంటి ప్రయత్నములు జరుగుట ఎంత అవసరమో వేరుగా చెప్పవలెనా ?

ఇప్పుడు మనదేశములోని ప్రాథమిక ఉన్నత



చెన్నరాష్ట్రప్రభుత్వ ప్రావిన్షియల్ బ్రాడ్ కాస్టింగ్ స్పెషల్ ఆఫీసరు
కపిల కాశీపతిగారు
ప్రభుత్వ ప్రోత్సాహంపై ఇంగ్లండ్ యూరప్ దేశాల్లో బ్రాడ్ కాస్టింగ్ పరిశోధన జరపడానికి గత నెల 28వ తేదీ ఇంగ్లండ్ బయద్దేరి వెళ్లారు.

పాఠశాలలును విశ్వవిద్యాలయములును కేవలము కొంత జీతము పుచ్చుకొని ఏ కొలదిమందికో చదువు చెప్పు సంస్థలుగా నున్నవి. వీనిని జనసామాన్యమునకు అక్షరజ్ఞానమును శాస్త్రజ్ఞానమును వ్యాపింపజేయు విజ్ఞానకేంద్రముగా మార్చుట యవసరము.

ఉపన్యాసకుల నూరూరబంపుట మూలముగను సినీమా టాకీ రేడియోల ద్వారాను జనసామాన్యమునకు విజ్ఞానము నందజేయువలయును. శౌచవిదులు ఆరోగ్యసూత్రములు పౌరధర్మములు పరిపాలనా విధానములను ప్రజలకు చెప్పవలెను. వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధి మార్గములను బోధింపవలెను. ఆధునిక పరికరముల నుపయోగించు పద్ధతియు ప్రజలకు చెప్పవలెను. దేశములోని యంత్రాగారములందును కర్మాగారములందును మిాలపోలికలను ఉమ్మెదువారి "అప్రెంటిసు"లుగా జేర్చుకొని వారికి తర్ఫీదు నిచ్చునట్లు ప్రభుత్వము కట్టుబాటు చేయవలెను. ఈ తర్ఫీదుకాలమున యువకులకు కొంత జీవనభృతి నివ్వవలెను.

ఆస్ట్రేలియా మన దేశమునకన్న పెద్దది. అక్కడకూడ మన దేశమువలెనే జనులు మారుమూలప్రాంతముల పొలములలోను, పల్లెటూళ్ళలోను జీవించుచున్నారు. అటువంటి రైతుజనముయొక్క పిల్లలకు విద్య నేర్పుట కచ్చటి ప్రభుత్వమువారనేక నూతన విధానముల నవలంబించిరి. ఎక్కడనైనను ఆరుగురు పిల్లలున్నచో ప్రభుత్వమువారక్కడనొక తాత్కాలిక పాఠశాలలను స్థాపించెదరు. అందుకు గావలసిన పూరిపాకనో ఇంటినో ఆ ప్రదేశమువారేర్పాటు చేయవలెను. ఉపాధ్యాయుని ప్రభుత్వమువారు పంపుదురు. అడవి ప్రదేశములందును మన్యములందును గల మారుమూల కుగ్రామములలోని పిల్లలకు పెద్దవారికీకూడ విజ్ఞానమును బోధించుటకొరకు అక్కడి ప్రభుత్వమువారు కొంతమంది యుపాధ్యాయులను ఉపాధ్యాయినులను తర్ఫీదు చేసి ఊరూర పంపి యుపన్యాసము లిప్పించుచుందురు.

సినీమా, టాకీ, రేడియోలద్వారా వైజ్ఞానిక విషయములను ప్రజలకు బోధించుచుందురు మన దేశమునందుకూడ ఇట్లే చేయవలెను.

మన దేశములో ఇప్పుడు చదువుకొన్న వారిలో నిరుద్యోగుల నందరిని ఈ పనికి నియోగింపవచ్చును. ఇకముందు స్కూలుఫైనలు ఇంటర్మీడియటు బి. ఏ. లను చదువు విద్యార్థులందరు కనీసము రెండేండ్లయినను ప్రజలలో విద్యావ్యాప్తి గావించు ఉద్యోగమున తప్పక పని చేయునట్లు ప్రభుత్వమువారు శాసింపవలయును



విజయవాడ పత్రికావిలేఖరుల సమావేశంలో డా. లంకసుందరంగారు

కథానిక:

అధ్వాన్నపు బ్రతుకు

"వనమాలి"

ప్రాకలు జిమ్ముకొంటూ బండి ప్లాట్‌ఫారం దాటింది "మహారాజులు, ధర్మదాతలు, బాబూ! దిక్కులేని దాన్ని. కానీ డబ్బు యిప్పించండి," అంటూ ఆమె చెయ్యి చాస్తూ కంపార్టుమెంటు అంతా, ప్రతివారి దగ్గరకూ వెళ్తూ కలయ తిరుగుతుంది. నేనూ, పార్వతి ఒక మూలగావున్న బెంచీమీద కూర్చున్నాం. మాదగ్గరకు కూడ వచ్చి ఆమె చెయ్యి చాచింది.

మాలిన్యముఖంతో, జీర్ణవస్త్రాలతో, వాస్తవంగా లేమిని ప్రకటిస్తూ ఉన్న ముఖంతో, కడుపు లోతుకు పీక్కుపోయి, డొక్కలు కంటుకుపోయి వున్న ఆమె ముఖంలోకి చూచేటప్పటికి నాహృదయం జాలితో కదిలింది. అంత మలిన రూపయుతంగా వున్నా, ఆమె ముఖంలో ఒక విధమైన వర్చస్సు గంభీరంగా ప్రకాశిస్తూ వుంది. ఆమెను చూస్తూన్న కొద్దీ, ఎన్ని కష్టాలపాలైనా, ఈ అలముల నవల లో వుందా, వుంటుందిగదా అనిపించింది.

"అమ్మా; ఇలా నోటిమాటలతో చెయ్యి చాస్తే నీయందెవరికి దయకలుగుతుంది? నువ్వేదైనా చక్కని పాట పాడు. గానానికి మానవ హృదయాన్ని ఆకర్షించి వశంచేసుకొనే శక్తి వుంది. అందరిహృదయాలూ నీవైపుకే మరలుతాయి. నువ్వు అప్రయత్నంగా భుక్తి గడుపుకో వచ్చు." అన్నాను.

పాట, మాట వినేటప్పటికే ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఎందుకమ్మా! అలా కన్నీళ్ళు పెడతావ్? పాటలు రావా?" అంది పార్వతి భిక్షుకి ముఖంలోకి చూస్తూ.

"కాదమ్మా!......అతడు బ్రతికుండగా పాడే వాళ్ళం" అని హీనస్వరంలో అంది.

"అతడంటే ఎవరు? నీ భర్తా?......"

"కాదు. బాబు! లోకంలో కొందరు భార్యాభర్తలమనీ, కొందరు అన్నా చెల్లెళ్ళమనీ, అనుకొనేవారు. నిజం చెప్పాలంటే, ఆయనకు నేనాధారం. నాకు ఆయన ఆశ్రయదాత. ఒకరి కొకరం తోడునీడలం." అంది భిక్షుకి కలవర పడుతూను.

"పార్వతి ఆదరణ చూపిన కౌతూహలంతో భిక్షుకి తన కథ చెప్పటం మొదలుపెట్టింది.

* * *

"కునవరం అనే కుగ్రామం మాది. అది జమిందారీ యిలాకాలోనిది. నాతండ్రి భూమిన్ని మకతాకు తీసుకొని సేద్యంచేస్తూ, జీవనోపాధికి లోటులేకుండా కాలం గడ్పుతూ వుండేవాడు. నేను పుట్టిన ఏడవరోజునే, మా అమ్మ బాలింత జబ్బువల్ల మరణించింది. మానాన్న చిన్నవయస్సులో వాడే అయినా, మళ్ళీ నాకొరకు వివాహం చేసుకోలేదు. ఆయన తన సర్వస్వం నేనే ననుకొంటూ గారాబంగా పెంచి పెద్దదాన్ని చేశాడు. తల్లిలేని లోటేమిటో నా కెన్నడూ తెలిసేదిగాదు. అవార్నిశలు, నాకు ఎక్కడ, ఏలోటు వస్తుందోనని మానాన్న వెయ్యికళ్ళతో కాపాడుతూవుండేవాడు. నాకు పదహారోఏట, తాను చెమటోడ్చికష్టించి సంపాదించిన అయిదు వేలరూపాయిలూ కట్నంగా యిచ్చి వైభవంగా పెళ్ళి చేశాడు. నేను అత్తవారింటికి వెళ్ళేటప్పటికి వారి మంచి భూస్థితి, పన్నెండుంబాతిక మందు వాయిల్లూ వున్నాయి. కలిగిన యింటికి కోడలనైనందుకు నా అదృష్టానికి ఎంతగానో మురిసి పోయాను. ఆ ముచ్చట మూన్నాళ్ళుకూడ నిలవలేదు.

నా భర్త, సవతి అత్తగారు, నేను మాత్రమే యింట్లో వుంటుండేవాళ్ళం. నా భర్తకు మొదట్నుంచీ దురభ్యాసాలు వున్నాయి. ఒక్కొక్క రోజు ఏ అర్ధరాత్రో తిరిగి, తిరిగి యింటికి వస్తూవుండేవారు. ఒక్కతెనూ తలుపు తెరచుకొని ఎదురుచూస్తూ కూర్చునేదాన్ని. తనకు అవసరమనుకొన్న రోజున, వస్తూనే ఆదరంగా పలకరించేవారు. లేని రోజున ధుమ, ధుమలాడుతూ ఏదో వొకవంకతో పోట్లాడేవారు. సిగ్గూ,బిడియంలేకుండా చెబుతున్న నా మాటలు మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. చని బిక్షుకి మా ముఖంలోకి చూచింది.

"యథార్థాన్ని చెప్పటంలోనే మానవత్వపు గొప్పతనం ప్రతిబింబిస్తుంది. ఊ...కానియ్యి అమ్మా.." అన్నాను.

"మాది మొదట్నుంచీ పొత్తు కుదరని దాంపత్యమే. నా జీవితంలో ఏ ఒక్కనాడూ ఆయన దగ్గర తగిన ఆదరం, గౌరవం, ప్రేమ పొందలేకపోయాను. క్రమంగా దురభ్యాసాలవల్ల రాబడికీ, అదే్యభుక్తు రెట్టింపుకు పెరిగింది దాంతో యింటి చుట్టూ అప్పులవాళ్లు చేరి గోలచెయ్యటం ప్రారంభించారు. క్రమంగా సంసారంలో జరుగుబాటుకు కొరవ ఏర్పడ మొదలుపెట్టింది. వారికిగానీ, ఆమెకుగానీ, ఏ కొరవ ఏర్పడ్డా, యింట్లో ఏది తక్కువైనా కారణం నామీదే కల్పించి, నిందించేవారు. నేను ఆ యింట్లో కాలుపెటడమే వారి కుటుంబనాశనానికి హేతువైందనేవారు. ఎప్పుడైతే భర్తదృష్టిలో నీరసింపబడ్డానో ఆ యింట్లో నా బ్రతుకు మరింత హీనమయి పోయింది. అందరకూ సవతిఅత్తగారి అధికార జులుం మరీ ఎక్కువయింది. నేను ఎంతటి మర్మాంతక యాతనను అనుభవిస్తున్నా, నా తండ్రికిమాత్రం కొంచెంకూడ తెలియనిచ్చేదాన్ని కాదు. ఆయన నా కష్టాలు వింటే, ఎక్కడ బాధపడిపోతాడోనని ఎంతో జాగ్రతగా వుండేదాన్ని. కానీ చివరకు నా సంసారపు బెంగతోనే ఆయన మరణించక తప్పలేదు." అని బిక్షుకి కళ్ళవెంట నీరుపెట్టింది.

* * *

"ఆ రోజు అప్పుడే ఆయన బజారుకు వెళ్ళారు బజారున వెళ్తున్న బట్టలమూటవాణ్ణి పిలిచి దింపించాను. ప్రతి సంవత్సరం ఏ పండుగ వంకో పెట్టి మానాన్న తీసుకువెళ్ళి పెట్టే రెండు మూడు చీరలతోనే తృప్తిపడి కాలం గడిపే దాన్ని. కట్టు చీరలుకూడ సంవత్సరానికి ఒకటి రెండుకన్నా వారు తెచ్చేవారుకాదు. బొత్తిగా చీరెలు, చినిగిపోయివుండటంవల్ల, మూటలో ఒక చీర తీసుకుపోయి సవతి అత్తగారికి చూపించి, ఆరు రూపాయి లివ్వమని అడిగాను"

"ఆమె ముఖంచిట్లిస్తూ, రుస, రుసలాడుతూ "ఇక్కడ నీ అబ్బ దాచిపెట్టిన సొమ్మేమీ లేదు పో......సంపాయించి గుట్టలుపోసు న్నాడుగా! చచ్చేనాడు కట్టుకుపోతాడా? వెళ్ళి తెచ్చుకోరాదూ!" అని గిరుక్కున తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది. చీర తిరిగి యిచ్చేసి గుడ్డలమూటవాణ్ణి పంపించేశాను. నా తండ్రిని ఆమె అంత చులకనజేసి, మాట్లాడి నిందించినందుకు ఎంతగానో ఆ రోజుఅంతా ఏడ్చాను. నా హృదయం అవమానంతో చచ్చిపోయింది." అని భిక్షుకి కొంతసేపు తల వంచేసింది.

"ఆర్థికబలం లేకపోవటంవల్ల సంఘంలో స్త్రీ స్థానం మరీ బలహీనమైపోతుంది." అంది పార్వతి.

"నిజమే. మరి...తరువాత." అన్నాను భిక్షుకి ముఖంలోకి చూస్తూను.

"ఆ పై సంఘటన చెప్పలేనుబాబు! క్షమించండి" అంది, భిక్షుకి.

"ఏం?" అన్నాను.

"ఏం చెప్పను? బాబు! ఆ రోజు అర్ధరాత్రికి యిల్లుచేరుకొన్నవారికి, మేలుకొనివుండి సవతి అత్తగారు చీరవిషయం చెప్పింది ఆయన తాగిన మత్తులో తన్ను తాను తెలుసుకొనే స్థితిలో లేరు. మంచీ, చెడూ...వీటి ఆలోచనతో పనిలేకుండానే, నోటికొచ్చినట్లల్లా మాట్లాడి, చివరకు వారు, నామీద చెయ్యిచేసుకొన్నారు. జీవితంలో మొదటిసారి దెబ్బపడ్డది ఆ రోజే— నా హృదయం అవమానంతో పచ్చిపుండయింది. అటుతర్వాత రోజు, రోజుకూ, ఆకర్షణ లేని, హృదయం లేని ఆ మనిషిని చూస్తుంటే, నాకు విరక్తి, హేయం కలుగ మొదలెట్టాయి. కానీ యిష్టంలేకపోయినా, మనస్సు వ్యతిరేకిస్తున్నా, శరీరాన్ని మాత్రం అప్పుడప్పుడూ ఆయన పశుకాంక్ష, పరితృప్తి చెయ్యటానికి వశం చెయ్యక తప్పేదికాదు. తత్ఫలితంగా గర్భముకూడ కలిగింది. మూడవమాసం వచ్చిన దగ్గర్నుంచీ, నా తండ్రి తనకాళ్ళు అరిగిపోయేటట్లు, నన్ను పంపమని ఆయన చుట్టూ తిరిగాడు. నా భర్త సమాధానం చెప్పక, ముఖం తిప్పుకొని తిరుగుతుండేవారు. నా భర్తకూ, సవతిఅత్తగారికీ, నా తండ్రి ఏదో సంపాదించి గుట్టలు పోస్తున్నాడనీ, వారి ఖర్చులకూ, కోర్కెలకూ, విలాసాలకూ పంపటంలేదనీ అనుమానం వుండి, ఆయనపై కక్ష సాధించాలన్నట్లు ప్రవర్తించేవారు.

చివరకు పురుడు వచ్చినప్పుడు కూడ సరి అయిన మనిషి దక్షత లేక చాల బాధపడ్డాను. నాకు మగ కసుకలిగాడు 'మగపిల్లవాడు' అనేటప్పటికి పురిటి మంచంలో అంత బాధలో వుండీ కూడ ఎంతగానో సంతోషపడ్డాను. ఇంకా నాబిడ్డ పెరిగి, పెద్దవాడైతే, నాకష్టాలు గట్టెక్కుతాయి. నోట్లోమాటన్న చెప్పుకోటానికి భగవంతుడు ఆధారం చూపాడు అమ్మని మురిసిపోయాను. కానీ నాదురదృష్టం కొద్దీ పుట్టిన ఆ, నలుసుకూడ పదవనాడే గురకతో చనిపోయాడు." అని భిక్షుకి ఏడుస్తూవుంటే మాకళ్ళల్లోకూడ నీరు గిర్రున తిరిగాయి.

"కానీ, బాబూ! ఇప్పుడు అలా జరగటమే మంచి దనిపిస్తుంది" అంది భిక్షుకి.

"ఎందుకని?" అన్నాను.

"నా పొట్టతోపాటు, వాడికి రెక్కలు తెచ్చే బాధ్యతకూడ నాపై నేపడేదేమో!......"

"నిజంగా ఆడబ్రతుకంత అధ్వాన్నపు బ్రతుకు మరొకటి లేదండి." అంది పార్వతి

"భార్యా, భర్తలకు ఒకరి మనస్తత్వాన్ని, మరొకరు అర్థంచేసుకొని, సహకారంతో సమర్థించుకొని నడవటానికి తగ్గ విజ్ఞాన వివేకాలు కొరత అవటంవల్లే, సమాజంలో, అజ్ఞానం మూఢనమ్మకాలు, దమననీతి పెచ్చుపెరిగిపోయి, జీవితాలు విషాద, విపరీతపరిణామాలకు గురికావటానికి కారణమవుతున్నాయి. అమ్మా... తరువాత..." అన్నాను భిక్షుకిముఖంలోకి చూస్తూ.

"పుట్టినబిడ్డ పోయినసంగతి తెలిసి మానాన్న వచ్చి 'పురిటికి పంపలేదు. పుట్టిన బిడ్డ పోయాడు. నాలుగురోజులపాటు విశ్రాంతి తీసుకొంటుంది పంప'మని ప్రాధేయపడ్డాడు.

"ఇప్పుడు నీకూతురు తెచ్చిన ప్రమాదమేమీ లేదులే, వల్లకాదు..." అని నాభర్త అంటూ వుంటే నాహృదయం పగిలిపోయింది. పచ్చి మంచినీళ్ళు అన్నా తాగకుండా, 'కాలిచెప్పు అన్నా విడవకుండా బయట వసారాలో మనిషి బయటకంచే, మానాన్న మెట్లు దిగి వెళ్ళిపోతూవుంటే నా అసమర్థతకు, బానిస బ్రతుక్కూ ఎంతగానో కుళ్ళి, కుళ్ళి ఏడ్చాను."

"ఆ సంవత్సరం వరదలు వచ్చి పంటలన్నీ నాశనమయ్యాయి. శిస్తు బకాయీ క్రింద జమీందారుకు మానాన్న తాను సంపాదించిన కుంటపొలం, ఇల్లూకూడ అమ్మి చెల్లించాడు. పెద్దతనాన రెక్కలమీద, ఆధారపడి బ్రతకాల్సిన గతి పట్టింది ఆయనకు. ఈ సంగతి తెలిసివుండి కూడ, ఒక్కగా, వొక్కకూతుర్నినే బ్రతికుండీ ఆయనకే విధంగాను ఆధారం కాలేకపోయాను. ఆరురూపాయిల కట్టుడు చీరకు నోచుకోని ఆయింట్లో, నాతండ్రికి నేనెక్కడ ఆశ్రయమిచ్చి, స్థానం కల్పించేది?"

* * *

"ఆ రోజు మధ్యాహ్నం మానాన్న జబ్బుతో శిరసించి మంచంపట్టి వున్నాడనీ, నాకోసం కలవరిస్తున్నాడనీ కబురువచ్చింది. "మర్నాటి సాయంకాలాని కల్లా ఒకసారిచూచి తప్పక తిరిగొచ్చేస్తావనీ, ఈ దఫా అయినా పంపించమనీ," కాళ్లా, వేళ్ళా బడి నాభర్తను ఎంతగానో ప్రాధేయపడ్డాను."

"తిరిగి మళ్ళీ యీ యింట్లో కాలు పెట్ట దలచుకోకపోతే వెళ్ళు." అన్నారు ఆయన.

సవతి అత్తగార్ని, కొడుక్కు చెప్పి, సమాధానంచెప్ప... ...ఆ... ...ఎవరినీ వినిపించుకోక, పైగా "నా......దరిద్రం పోటుదాన! ఇంతటితో మాయింటి పీడ వదలిపోతుంది. లక్షణంగా రేపేపాటికి మరో బంగారంలాంటి పిల్లని తెచ్చుకొని, నాకొడుక్కి చేసుకుంటాను" అంది.

ఆ స్థితిలో నాకేం చెయ్యాలో తోచలేదు. కర్తవ్యనిర్ణయంకోసం మనస్సుతో పెనుగులాడాను. వెళ్తే భర్తకూ, సంసారానికీ దూరమై చెడిపోయిందానిలాగ వుండాలేమో! వెళ్ళక పోతే తన జీవిత సర్వస్వం నాకోసం ధార పోసిన తండ్రి అంతరాత్మకు ద్రోహం చేసిన దాన్ని అవుతానేమో!...ఆలోచించాను. దరీ దోవా కనబడలేదు నా జీవితంలో ఏ ఒక్క రోజూ యీ ఇంట్లో సుఖపడలేదు ఏమైనాసరే ధైర్యంచేసి వెళ్తే, నా తండ్రిఅయినా కొంత నన్ను చూచి తృప్తిపడి బ్రతుకుతాడేమోనని ఆశ కలిగింది. ఒంటరిగా అర్ధరాత్రివేళ, చడీ, చప్పుడూ కాకుండా యిల్లువిడచి, స్టేషను వేపుకు నడిచాను. నా జీవితంలో ఆ రోజే సాహసంతో ఒంటరిగా ఇల్లు విడచి బయటకు రావటం మొదలు. నాలో అంత మనోనిబ్బరం, శక్తి ఎక్కణ్ణుంచి వచ్చాయో నాకే తెలియదు.

టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారంపైకే వచ్చాను. ఎవరైనా ఎరిగినవాళ్ళు కంటబడితే ఏమనుకొంటారోనని భయం, బండి ఎప్పుడు వస్తుందా, ఏ క్షణానవెళ్లి నా తండ్రి పాదాల మీద వాలాదా అని తహ, తహ, మరోవేపున నా భర్త యిల్లు వదలిపెట్టిన జాడ పసికట్టి, వెతుక్కొంటూ వచ్చి ఎక్కడ పట్టుకొని అల్లరి చేస్తారోనని భయం వేధించ మొదలుపెట్టాయి. ఈ ఆదుర్దాకు తోడు ఆరోజు బండి రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ కాళరాత్రి ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్లాటుఫారంపై సిద్రగన్నేరు చెట్టుక్రింద, కన్నార్పకుండా, బండివచ్చే దెసకు చూస్తూ కూర్చొన్నాను. ఆ దృశ్యం తలచుకొంటే నాకిప్పటికీ కూడ ఎంతో భయం పుడుతుంది" అని భిక్షుకి కొంతసేపు మౌనం వహించింది.

"ఆ. ...పాపం?......అంది పార్వతి.

"ఒంటరిగా బ్రతకటానికైనా, సిద్ధపడి బయలుదేరిన నాకు భయాలు తీర్చేవా రెవరున్నారు? తూర్పు రేఖలు తెల్లవారుతూ వుండగా వెళ్ళి మా యింటి ముందరి గుడిసె వాకిట్లో నిలబడ్డాను. నా తండ్రి బ్రతికిన బ్రతుక్కూ, చివరకు అవసానకాలంలో ఆయనకు పట్టినగతికీ పోల్చి మాసుకొని ఏడ్చాను. ఎముకలగూడై కుక్కిమంచంలో మూలుగుతున్న తండ్రిని పరుగున వెళ్లి కౌగలించుకొన్నాను. ఆయన నన్ను కలవరిస్తున్నాడు

"నాన్నా...నేనే...వచ్చాను. నాన్నా...లే. కళ్ళు తెరచిచూడు" అన్నాను.

"ఆ...ఎవరు?...నా చిట్టితల్లా!...వొట్టిది. అబద్ధం. ఆ రాక్షసుడు నా తల్లిని పంపిస్తాడా? సర్వాబద్ధం. నా బంగారుతల్లిని ఆ కసాయివాడికి వప్పగించి, గొంతు కోశాను......"అని మా నాన్న నా జీవితానికై తాను పొందుతున్న వేదనను స్పష్టపరుస్తూ కన్నీరు కార్చాడు.

(16 వ పేజీ చూడుము)


ఆసియా దూరప్రాచ్య ఆ

ఉదకమం

[ద్వితీయ ప్రపంచసంగ్రామం ఒ
ప్రాచ్యఖండవాసులు ఇంక పాశ్చాత
దోపిడీ అయిపోయేందుకు అవకాశ
నిశ్చయానికి ఏకహృదయంతో రా
గలిగిన సువిశేషం.

యూరప్ పీడిత ప్రజాపునరుద్ధ
ప్రాచ్య ఆసియాఖండవాసులకు కూ
సమితి, ఈ మండలానికికూడా, అట్టి స
బీజరూపంగా, 1947 మార్చి 28న, (E
ఆర్థిక సంఘాన్నొకదాన్ని సృష్టించింది.

ఆసంఘము రూపందుకొని
మూడవసారి కలుసుకొని, సమావేశం
క్లుప్తంగా సూచిస్తూ సమావేశవివ
అవలోకించి, నివేదించిన ఒక విశేషి
స్తున్నాము.]



ద్వితీయ ప్రపంచసంగ్రామం, ఆసియా, దూరప్రాచ్యఖండాలకు, అనేకమైన దుర్భర దుస్థితులను, కష్టాలను తెచ్చిపెట్టింది. అయితే ఈ ప్రపంచయుద్ధఫలితంగా, పూర్వార్ధగోళవాసులకు, అధమం నూరుకోట్ల పై చిలుకు జనానికైనా, ఒక్క సుగుణాన్ని చేకూర్చిపెట్టింది. పశ్చిమఖండవాసులు ఇంక తమను దోచేందుకు అవకాశము ఇయ్యకూడదన్న వివేచనయూ, జాగ్రత్తాకూడా ప్రాచ్యఖండవాసుల్లో కలిగాయి.

సాన్‌ఫ్రాంసిస్కోలో ప్రపంచరాజ్యాలైన చిన్నపెద్ద దేశాలూ కలిసి, ప్రపంచనియమావళీపత్రాన్ని తయారుచేయటానికి, పరస్పరసంప్రదింపులతో సుహృద్భావంతో కలిసి తయారుచేసి, ఆ ప్రపంచపత్రంమీద సంతకాలుపెట్టారు. ఆ పత్రంలో, ఇక యుద్ధాలు రాకుండా చేసుకోవాలంటే, తమదృష్టిని, ప్రపంచప్రజల్లో అధికసంఖ్యాకులయొక్క ఆర్థికపరిస్థితిని బాగుచేయ్యవలసిన విషయాలమీద కేంద్రీకరింపచేయటం తత్క్షణావశ్యకతమని గుర్తించి ఆ విషయాన్ని ఆ ప్రపంచపత్రంలో చేర్చారు.


ఈ భావము బీజరూపంగా అక్కడ బయలుదేరి, ఆసియా దూరప్రాచ్యాలకు, ఒక ఆర్థిక సంఘాన్ని సృష్టిచేయవల్సివచ్చింది. యుద్ధంలో శిథిలమైపోయిన యూరప్‌ఖండదేశాల పునరుద్ధారణకై బయలుదేరిన ఆర్థికసంఘంలాగే, ఈ దూరప్రాచ్య ఆసియాఖండాల ఆర్థికసంఘము కూడా రూపందుకుంది.

ఐక్యరాజ్యసమితి ఉపసంఘము, ఒకటి 1947 మార్చి, 28న ఈ ఆసియా దూరప్రాచ్య ఆర్థికసంఘాన్ని సృష్టించింది.

ఐక్యరాజ్యసమితి నిబంధనావళి అవకాశాల పరిధిలోనే ఐక్యరాజ్యసమితి పని చేయవలసి ఉంటుంది. ఏ దేశం విషయంలోనూ, ఆ దేశ ప్రభుత్వపు ఒప్పందము లేకుండా, ఐక్యరాజ్యసమితి ప్రమేయం కల్పించుకోటానికి అనువులేదు.

ఈ ఆ. దూ. ప్రా. ఆ. సంఘపు, క్రియాకలాపాలేవని సూక్ష్మంగా చూసుకొంటే, ఆయా మండలికదేశాల్లో ఆర్థిక పునరుద్ధారణం కోసం, అవసరమైన చేసేపనులన్నిటికీ, విస్తృతావకాశం కలిగేటట్లు చూడటం. ఆర్థిక సమస్యలూ పారిశ్రామికమైన, యాంత్రిక యంత్రనైపుణ్య కార్మిక శక్త్యాది, క్లిష్ట సమస్యలూ, ప్రాదేశికంగా, ఆర్థికంగా పెంపొందేందుకున్న అవకాశాలూ, ఇత్యాది విషయాలను పరిశీలించి, ముఖ్యమైన టెక్నికల్ విజ్ఞానాన్ని సేకరించి అందుబాటు చేయటం.

ఈ సంఘానికి, సంపూర్ణ సభ్యులూ, సహాయసభ్యులు కూడా ఉన్నారు. ఆస్ట్రేలియా, బర్మా, చైనా, ఫ్రాంసు, ఇండియా, నెదర్లాండ్సు, న్యూజీలాండ్, ఫిలిప్పైన్ దీవులు, పాకిస్థాన్, సయాం, రష్యా, బ్రిటన్, అమెరికా— వీరంతా మొదటి తరహాకు చెందినవారు. కంబోడియా, సింహళం, హాంగ్ కాంగ్,



పండిట్ నెహ్రూ ప్రారంభోపన్యాసము

లావోస్, మలయా, బ్రిటిష్ బోర్నియోలు రెండవ తరహావి.

ఈ సంఘ ప్రథమ సమావేశం గత సంవత్సరం జూన్ 16-25 తేదీలలో షాంఘైలోనూ, ద్వితీయ సమావేశం, ఆ సంవత్సరమే నవంబరు 27-నుండి, డిసెంబరు 6 దాకా, ఫిలిప్పైన్సు దీవుల్లోని బాగూయియోలోనూ జరిగాయి.

ఇదీ క్లుప్తంగా ఆసియా దూరప్రాచ్య మాండలిక ఆర్థిక సమితి (ECAFE) చరిత్ర.

అయితే, సామాన్యప్రజానీకానికి ఈ సంఘం వల్ల అగేది ఏమిటీ అని చూసుకొంటే, ఐక్యరాజ్యసమితి ఏ ఆదర్శంవల్ల ప్రేరేపించబడిందో, ఆ ఆదర్శమే. ప్రతిపురుషునికీ స్త్రీకీ, కూడా, వసరాలను, చేకూర్చటమే—ఈ సమితి నిర్మాణ ప్రాథమికానానికి కూడా ప్రాతిపదికగా నిలిచింది. ప్రతివారి జీవన ప్రమాణాన్నీ వృద్ధిచేయుటమే ఈ సంఘంయొక్క ఆంతరంగిక ఉద్దేశము.

ఆరన్మోర్ భవనము

అయితే, భారతదేశ రమ్య విలాసక్షేత్రాలన్నిటికీ తలమానికమైన ఉదకమండల పర్వతాగ్రాల శీతల పరిసరంలలో అశేషవిభావ పూరితమైన వాతావరణంలో, ఈ ఆర్థికసమితి సమావేశం జరగటం చూస్తే ఎవరైనా విభ్రమ చకితులు కాక తప్పదు

జోధపురం మహారాజావారి ఆరమహల్, ఈ ఆరన్‌మూర్ భవనం. ఆయన ప్రపంచ ప్రసిద్ధికెక్కిన పోలో ఆటగాడు. ఆయన యీ మందిరంలో నూటికిపైగానైనా గదులు ఉన్నాయి అంటే పాకశాలలు, నర్తనశాలలూ, కచేరీ చావడలూ, విహరించి అలిసిపోయి విశ్రమించేవి !— ఏ అంతస్తు కా అంతస్తున, పూల మొక్కలు, తోటలు, కళ్ళుమిరిమిట్లు గొలిపే, లోపలి గదుల వైభవాలూ, చుట్టూ పూలమొక్కలతో, రంగులు చిలకరించుకొంటూన్న విశాలమైన సుందరోద్యానాలూ, త్రివర్ణచిత్రసుందరమైన ప్రదేశంగా కనబడుతుంది. భారతీయ వైభవం పాశ్చాత్యప్రతినిధులకు, (రష్యన్ ప్రతినిధితో సహా) మళ్ళీ ఒక్కసారి కన్నులు మిరుమిట్లు గొల్పి ఉంటుంది. ఇల్లా వర్ణిస్తే ఉత్ప్రేక్షలాగా అనిపించవచ్చును. కానీ యథార్థంగా ఈ పరిసరాలల్లాగే ఉన్నాయి. చివరికి చీనా ప్రతినిధికూడా, ఉండబట్టలేక యిన్ని ఆ విషయకంగా కొన్ని సూటి ప్రశ్నలే అడిగాడు.

రేపు సమావేశం ప్రారంభం అవుతుందనగా. చైనీయప్రతినిధివర్గం, డాక్టర్ లై నాయకత్వం క్రింద అక్కడికి అరుదెంచి, ఒక్క పత్రికాప్రతినిధి అభ్యర్థిస్తే, డాక్టరు అతనితో సంభాషణ కవకాశ మిచ్చాడు.


ఈ చైనీయ ఆగంతుకుడు ఇక్కడి పరిసరాలను చూచి ఆశ్చర్యం పట్టలేక పోయాడు. "ఇల్లాంటి సౌందర్యాన్ని నే నిదివరకెక్కడా చూడలేదు. మహాద్భుతంగా ఉంది."అన్నాడు. ఆరన్‌మూర్ భవనం, జోధ్‌పురం మహారాజా కూడా, ప్రపంచదృష్టిని ఆకర్షించారు.

అతిథిసత్కారాలకు, అతిథులు, స్వగృహాలలో ఉన్న ఆనందం పొందగలిగేట్లు టానికి, నిర్వాహకులు చాలా శ్రమదీసికొని కృతకృత్యులయ్యారు. నిర్వాహక కార్యదర్శి, డా. పి. యస్. లోకనాథంగారు, తన చైనీ అమెరికన్, ఉపకార్యదర్శులతో సహా, సమావేశ దినానికి చాలా ముందుగానే ఉదకమండలం చేరుకొని, సన్నాహాల విషయం శ్రద్ధ వహించాడు.

సభాసమావేశం జరిగిన హాలు, ఇంతటి అంతర్జాతీయ సమావేశం జరపటానికి కొంత చిన్నదై ఇరుకైనదే అయినప్పటికీ, ఆ మందిరంలో ఉన్న వాటన్నిటిలోకీ, చాలా పెద్దదీ, చక్కనిదీకూడా. హాలులో గోడలచుట్టూ, అడవిజంతువుల తలలు, సహజభీకరసౌందర్యాన్ని వెదజల్లుతూ, జీవకళను



మద్రాస్ గవర్నర్‌తో సం



న్యూజిలాండ్ ప్రతినిధివర్గసభ్యులు



సోవియట్‌రష్యాప్రతినిధులు



పౌరసన్మాన సమాధా

...ికసంఘ సమావేశము

...డలము

...— సుకృతంమాత్రం కూర్చిపెట్టింది.
...సామ్రాజ్య దాహానికి బలిఅయి,
...తమాత్రం ఈయగూడదని, గాథ
...గటం, ఈ సంగ్రామ ఫలితంగా

...ఘమూ, ప్రణాళికావంటివి, దూర
... ఉండాలని గుర్తించి, ఐక్యరాజ్య
...ఘాన్ని నియమించాలన్న భావంతో
...AFE), దూరప్రాచ్య ఆసియాఖండ,

...పై గతవారం ఉదకమండలంలో,
...జరుపుకొంది. ఈసంఘ ఉద్దేశాన్ని
...ాలను, సామాన్య పౌరునిదృష్టితో
...రి కథనాన్ని ఇక్కడ పొందుపరు

నిలుపుకొంటూ, గోడల నలంకరించాయి.


సభ్యులందరికీ స్థానాలు U రూపంలో ఉన్న ఒక పెద్ద మేజాబల్ల చుట్టూ అమర్చారు. శ్రేణికి అగ్రస్థానంలో, అధ్యక్షుడూ, అతనికి కుడి ప్రక్క ఐక్యరాజ్యసమితి సర్వకార్యదర్శి ట్రిగ్విలై, ఎడమప్రక్క, నిర్వాహకకార్యదర్శి డాక్టర్ లోకనాథం ఆసీను లయ్యారు. ఆయనకు ప్రక్కనే, అమెరికన్ ఉపకార్యదర్శి కూర్చున్నాడు.

నెహ్రూ రాక

నెహ్రూ అంటే అశేషభారత జనానికి ఉన్న ఆప్యాయతనే, ఆయన రాక సమయంలో ఉదకమండలం జనమంతా ప్రదర్శించారు. దోవ పొడుగునా, ఆయనకు బ్రహ్మాండమైన స్వాగత మియ్యటానికి చాలానాళ్ల ముందునుంచి సన్నాహాలు జరుగుతున్నాయి. మెట్టుపాలెంనుంచి, పైదాకా రహదార్లన్నిటా, రంగురంగుల పూలమాలికలతో తోరణాలు గట్టారు. తోరణ స్తంభాలుగా పాతిన వృక్షాల కొమ్మ లన్నిటికీ రంగురంగుల పువ్వుల తలను పొంకించారు.

నెహ్రూ సరిగ్గా నియమిత సమయానికి సభా ప్రాంగణం చేరుకొన్నాడు. మామూలుగానే ఫోటోలు తీస్తుంటే చిరాకు దాచుకోలేక పోయాడు. "పండిట్ నెహ్రూ ఇక్కడ హిందూస్థానీలో మాట్లాడితే వృథా అవుతుందని ఒక ఇంగ్లీషు విలేఖరి, సూచించాడు. హిందూస్థానీలో తొద్దిగా ప్రారంభించి నాల్గునిమిషాల్లో, నెహ్రూ ఇంగ్లీషు అందుకొన్నాడు.

నెహ్రూ ఎప్పుడూ చెపుతూండే ఆయన భావాన్నే అక్కడా వెలిబుచ్చాడు. ఏ ఒక్క సమస్యనైనాసరే, సర్వప్రపంచ దృష్టిలోనూ పరిశీలించటం అవసరమనీ, అసంతృప్తస్థితిలో, ఆసియా దూరప్రాచ్యాలు గనక ఎగ్గుతుంటే, ప్రపంచశాంతికి, సుస్థిరత్వానికి క్షేమకరం కాదనీ ఆయన పునరుద్ఘాటించాడు.



భారత ప్రతినిధివర్గం

ఈ సమావేశఉపన్యాసంలో నెహ్రూ రెండు కొత్త విషయాలు పేర్కొన్నాడు. బహుశా భారతదేశం, ఆసియా నాయకత్వం కోసం పాటుపడుతూందంటూ, అమెరికన్ విమర్శకులు చేసే విమర్శలకు సమాధానంగా ఆయన ఆమాటలు చెప్పి ఉంటాడు. భారత ప్రధాని అమెరికాచేసిన ప్రసంగాలను జ్ఞాపకం చేసికొంటే ఆసియాకు నాయకత్వం వహించి నడప వలసిన బాధ్యత భారతదేశంమీద పడిందని ఆయన చెప్పిన మాటలు జ్ఞాపకంవస్తాయి ఆమాటలు కొందరికి రుచించినట్టు లేదు, అయినా రష్యన్ రాయబారి నోవికోవ్, (ఈసమావేశానికి ముఖ్యప్రతినిధి) రిపబ్లికన్ ఇండోనీషియాను కూడ కలుపుకోవటం సందర్భంలో బుధవారం సమితి సమావేశంలో భారతదేశ సూచనను బలపరుస్తూ— పశ్చిమ రాజ్యాలకు అనుమానాలు పుట్టుకొచ్చాయి.

నెహ్రూ చెప్పిన రెండో విషయం: "భారతదేశం అధికజనసంకీర్ణమై పోవటంవల్ల భారతీయ సమస్యల పరిష్కారానికి చాలా ఆటంకం కల్గుతూం"దని నిత్యం పాటగా చెప్పుకొచ్చే వాదానికి నెహ్రూ సమాధానం ఇచ్చాడు. అమెరికన్ ఆర్థికవేత్తలకూ, ఈ సమితివారు సమర్పించిన ఒక నివేదికొంశానికి, ఏ కాలంలో జవాబుగా పండిట్ నెహ్రూ ఈ విషయాన్ని ఘాటించాడు. "నా అభిప్రాయంలో, భారతదేశం, ఏనాడూ, అధికజనాకీర్ణం కానేరదు. నిజానికి మా జన సంఖ్య తక్కువ. జనం సరిగ్గా చాలని ప్రదేశాలు అనేకం ఇంకా విస్తృత భారతదేశ మండలాల్లో ఉన్నాయి" అని జవాబిచ్చాడు.



"దూరప్రాచ్య దేశాల పునరుద్ధరణ బాధ్యత భారతదేశంమీదనే ఉంది. అందుచేత భారత దేశం, ఇండోనీషియా రిపబ్లికు కూడా సభ్య దేశంగా ఉండాలని కోరటం, చాలా ధర్మంగానే ఉంది" అని అన్నాడు.

రష్యా ఇంతగా ఒప్పుకొంటూంద నేటప్పటికీ,

"ఇండోనీసియన్ రిపబ్లిక్ ప్రతినిధులను కూడా ఇక్కడ నేను చూడగల్గిఉంటే చాలా బాగుండేది. అంటే ఇండోనీషియావిషయంలో ఎవరిది న్యాయం రాజ్యాంగధర్మ లెట్లున్నాయో? అన్న విషయాలు నేను స్పృశించటంలేదు. కాని, ఆసియాఖండంలో కెల్ల సుభిక్షభూభాగమైన ఇండోనీషియా రిపబ్లిక్ అంతటి విస్తృత దేశాన్ని విస్మరించి, ఆసియా పునరుద్ధరణకై ప్రణాళిక లేవీ పనిచేయలేవు" అని నెహ్రూ మొదలు పెట్టేటప్పటికే నెదర్లాండ్సు ప్రతినిధులకు పచ్చివెలక్కాయ గొంతుకు పడ్డట్టయింది. "ప్రతినిధివర్గంలో ఆరు స్థానాలలోనూ రెండు రిపబ్లిక్ మనుష్యులకోసం అట్టిపెట్టే ఉంచాం" అని నెదర్లాండ్సు ప్రతినిధి నాయకుడు సమాధానంచెప్పుకున్నాడు. తర్వాత మళ్ళీ అగ్రరాజ్యాలు, ఆఫ్రికన్ ప్రతినిధివర్గంతో సహా ఈ చర్చలో పాల్గొని, వాదాలు లేవతీస్తూంటే, అంతర్జాతీయ సంస్థలపై, అధికార ప్రాబల్యంకోసం పాకులాడే రాజకీయాలకు ఎంత ప్రభావం ఉందో, నిరూపిత మయింది.

ఇండోనీషియా రిపబ్లికును సభ్యదేశంగా చేర్చుకొనే సమస్యలోని, అంతరార్థాలను, వివిధ దృక్పథాలను వివరించే పని నవ్యన్ ప్రతినిధికి తగిలింది. నెదర్లాండు ప్రభుత్వంతో, పరస్పరం కౌన్సులర్ ప్రతినిధులను నియమించుకొనేందుకు ఏర్పాటుచేసుకొన్న రష్యా, తప్పకుండా ఇండోనీషియా రిపబ్లిక్ సభ్యత్వానికి అభ్యంతరం తెలుపుతుందనే అంతవరకూ అందరూ అనుకొన్నారు.

డచ్చివారితో యుద్ధంచేస్తున్న ఇండోనీషియన్ రిపబ్లిక్ పక్షం వహించినందుకు నెదర్లాండ్సు ప్రతినిధి అభ్యంతరం తెలపటం "టెక్నికల్ అడ్డంకులు" ఉన్నాయని ఫ్రాంసు వాదించటం, బ్రిటన్ ఫ్రాంసుకు చేయూత, ఒక్కటం—భౌగోళికంగా ఏకంగా ఉన్న దేశంలో ఆర్థికవిభాగతత్వం" —కలంబించటంలోని విషతత్వాన్ని అమెరికా త్రిచూప ప్రయత్నించటం—ఇత్యాది చర్చలన్నీ కూడా, సమావేశం కలకలానికి చాలా తోడ్పడి చాలా ఉత్సాహం కల్గించాయి.


(ఒక విలేఖరి)




భాషిస్తున్న పండిట్ నెహ్రూ




...నం చెప్తున్న నెహ్రూ



చైనాదేశ ప్రతినిధులు



సయాంనుండి వచ్చిన ప్రతినిధులు



ఆల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలిస్ ఇన్ ది వండర్లాండు' రచన
లూయీ కెరోల్

౮

అనుకరణం
"ఆప్లవాన్"

పాప కాస్సేపు అల్లాగే ఆగి చూసింది చివరికి ఒక చిన్న బండి వస్తూన్నట్టు గొణగొణ మని చక్రాల చప్పుడు విన బడింది. బండి చప్పుడుతో పాటు, చాలామంది చేసిన రణగొణ ధ్వనికూడా వినబడుతూంది

"ఇంకో నిచ్చెన ఏదిరా? నాదగ్గర లేదండి,—అదిగో భీముడుదగ్గిరుందండీ—ఓరేయ్ భీముడూ,—ఆ నిచ్చెనిల్లా పట్టుకురారా—ఇదిగో ఈ మూల నిలేయ్—కాదు కాదు ముందు రెండు నిచ్చెనలు కలిపి కట్టు - చాల్లేరా, పరవాలేదు - ఎత్తరా - పకీ సగం ఎత్తుకైనా వచ్చాయిరా? బీముడూ ఆ తాడక్కడికి కెగరేస్తున్నా—అందుకోరా - ఇంటి కప్పు ఆగుతుందా? ఒరేయ్ భీముడూ, జాగ్రత్త, అక్కడ పెంకులు జార్తాయి — అదిగదిగో పెంకు జార్తోంది—తల కాయలు జాగ్రత్తరోయ్ - (రాళ్ మని శబ్దము) ఎవడురా ఈ పని చేసింది? భీముడేనా? ఆరిసీ!—చిమ్నీ గొట్టం లోకి ఎవరు దిగుతార్రా? నేను దిగను—అయితే నేనూ దగను—భీముడినే పొమ్మనండి - ఓరేయ్ భీముడూ, అయ్యోరు నిన్నే దిగమంటున్నార్రా—"

అల్లా గొంతుకలన్నీ అడావుడిగా వినబడుతున్నాయి

పాప మళ్ళీ తనలో అనుకోటం మొదలు పెట్టింది

"అదా సంగతి! భీముడు గొట్టంలోంచి లోపలికి వస్తాడూ—ఊఁ!— పాపం ఈ భీముడెవడో? వీడినెత్తినే అన్ని పనులూ పెట్టి చంపుతున్నారే! ఆ, భీముడి పాటు నా కొద్దు బాబూ - అయినా గొట్టంలోంచి దిగుతూండగానే ఒక్క తన్ను తన్ని పైకి తన్నగలను' అనుకొంటూ పాప పొగగొట్టంలో, కాలు క్రిందికి దించుకొంది

భీముడు ఏం జంతువో పాపకు తెలియ లేదు కానీ కాసేపటికి చిన్ని జంతు వేదో పొగగొట్టం అంచుల్ని పట్టుకుంటూ దిగుతున్న శబ్దం దగ్గిర దగ్గిర కొస్తూ విన బడింది

"ఓరీ భీముడూ!" అంటూ పాప ఒక్క తన్ను పైకి తన్ని ఏం జరుగుతుందో అని వింటూ కూర్చుంది మళ్ళీ ఒక్కసారి కేకలు వినబడక ఆగిపోయాయి కుందేలు మాట ఒక్కటే మళ్ళీ వినిపించింది

"అడుగడుగో భీముడు ఆకాశంలోకెగిరాడు. ఒరేయ్ పట్టా, కంచెదగ్గిర ఉన్నవాళ్ళు, వాడికి దెబ్బ తగలకుండా పట్టుకోండ్రా!"

కాసేపు మళ్ళీ నిశ్శబ్దం మళ్ళీ గందరగోళంగా అరుపులు

"తల పైకెత్తి పట్టండిరా—మట్టా మూగకండి, వాడికి కాస్త గాలి ఆడనీయండి—కొద్దిగా బ్రాంది పొయ్యండిరా—అరే గుటక మింగనియ్యండి—అల్లా ఉక్కిరిబిక్కిరి చేయకండి—ఏరా భీమా! ఇప్పుడెల్లా ఉంది'—ఏమయిందిరా అంత ఎగిరిపడ్డావ్'—ఏం జరిగిందో చెప్పరా—"

చివరికి సన్నగా కీచుగా ఒక కీచుగొంతుక వినబడింది ("వాడే నను కుంటా భీముడు" అనుకొంది పాప)

"ఏమోనయ్యా, టూ కెంత తెలుసో నాకూ అంతే తెలుసండి, ఆ బ్రాందీ చాలు—ఇప్పుడు కొంచెం తేరుకున్నట్లే ఉంది—కాని ఇంకా ఏమిటో అయోమయంగానే ఉందండి—ఆ పొగగొట్టం క్రిందిదాకా దిగాననుకున్నాను—ఇంతలో ఏదో ఉండేలు బద్ద వచ్చినట్టు వచ్చి నామీదికి హఠాత్తుగా వచ్చేసింది—దెబ్బకు, తారాజువ్వ ఎగిరినట్లు ఆకాశంలోకి ఎగిరి పడ్డాను"

"అచ్చు తారాజువ్వలాగే వచ్చావురా" అని పక్కనవాళ్ళు అన్నారు.

కుందేలుమాట గట్టిగా వినబడింది.

"ఇక ఒక్కటే మార్గం—ఇల్లు తగల బెడ్దాం" అంది కుందేలు.



బాల

కథా గేయం



ఆణిముత్యం

'ప్రసాదరావు'

౭

స్మృతిని పోసత నున్న ఆణిని,
చేతుల్లో తెచ్చిన్న కొందరు,
మూగవడి, నెమ్మదిగ, ముత్యం
ముందరుంచారూ. 1

పిల్లలను ఆడిస్తు, కడుపులో
పిల్లడికినై కలలుగంటూ,
భావిసౌఖ్యాల్, ఆణితోటివి,
భావనలో చూస్తూ— 2

శాంతసుఖమున నున్న సతి, దు
ర్దాంతభీకరమైన దృశ్యము
చూచి, చేష్టలుదక్కి, అదటున
సోలిపొయ్యిందీ 3

ఆర్పశిశువుల నెవ్వరో, ఊ
ర్చి దగ్గిర దీసికొన్నా,
రెంతసాయం చేయగలవా
రంత, చేశారూ. 4

ఒక్కక్షణమట్లుండి, అంతలో
గుక్కదిప్పక, దిటవుకూర్చుక,
మగని కుపచర్యలను చేయగ
మగువ కదిలిందీ. 5

దిక్కరీ యున్నట్లె ఆణికి
ఎక్కడా అనిపించనీనటు,
మూర్ఛదేరినపతిని బాధల
తేర్చబూనిందీ. 6

చిరునవ్వు మొగమున్న దోపగ
చెంగటనె ఉపచర్య చేస్తూ
పతికి దేహం కుదుటబడునటు
పాటుపడ్తుందీ. 7

ప్రాణమిచ్చిన పత్ని సేవలో,
ఆణి చాలా తేరుకున్నా,
కూలినాలికి బోవనింకా
కాలురాబోదూ. 8

"ఆ పని చేస్తే, దీనను సీమీదకు పంపిస్తా" అని పాప లోపల్నుంచే అరిచింది

బైటవాళ్లెవళ్లూ కిమ్మనలేదు.

"ఇంకేం చేస్తారో——తెలివి తక్కువ మొహాలు? ఇంటికప్పు ఊడ బీక రాదూ?" కాసేపటికి మళ్ళీ బైట కదలికా, కలకలమూ వినిపించాయి "ముందు ఓ డబ్బాడు అయితే చాల్ననుకొంటాను" అంటోంది కుందేలు.

"డబ్బాడూ ఏమిటి?" అని తన్ను తను ప్రశ్నించుకొంది. ప్రశ్నకు జవాబు వెంటనే వచ్చింది డబ్బాడు రాళ్లు దడదడా ఇంటిమీద కురిసి, కిటికీలోంచి వచ్చి పాపమొహానికి తగిలాయి

"ఇది వెంటనే ఆపెయ్యాలి" అనుకొంటూ పాప - "ఏయ్, మళ్ళీ విసరకండి, జాగ్రత్త!" అని పాప కేకవేసింది మళ్ళీ గప్‌చిప్ మని నిశ్శబ్దం.

పాప చూస్తూండగానే ఆ పడ్డ రాళ్ళన్నీ చిన్నిచిన్ని రొట్టెముక్కలవుతున్నాయి. పాపకు మళ్ళీ ఓ తెలివైన ఊహ తోచింది "ఈ రొట్టె ముక్కలు తింటేమళ్ళీ తప్పకుండా మారితీరుతాను ఇంతకంటే పెద్దదాన్నయేందుకు వీలులేదుకదా? అంచేత తప్పకుండా చిన్నదాన్నే అవుతాను-"

అంటూ పాప రొట్టెలుతిని చూసుకొంటే చిన్నది అవటం మొదలుపెట్టేటప్పటికి, పాపకు బలే సంతోషం వేసింది తలుపులో పట్టే అంత చిన్నదయేదాకా అల్లాగే ఆ ముక్కలు తిని,



తలుపుకు సరిపడగానే, ఇంట్లోనుంచి బైటికి పరుగెత్తుకొచ్చింది. బైటకు వచ్చి చూసేటప్పటికి, పిట్టలూ, పిల్ల జంతువులూ అన్నీ మూగి ఉన్నాయి ఇందాకటి ధిము డోక తొండ. ఇంకా దెబ్బనుంచి తేరుకోనేలేదు తక్కిన వాళ్లు ఇంకా ఏదో మందు తొండకు, పోస్తూనే ఉన్నారు.

పాపను చూసేటప్పటికి జంతువులూ, పక్షులూ - అన్నీ పాపను తరుముకొంటూ పరుగెత్తుకొచ్చాయి. పాప వాళ్ళను తప్పించుకొని, పక్కనున్న చిట్టడవిలోకి పరుగెత్తుకు పోయింది

"ముందు నేను నా మామూలు పొడుగుకు ఎదగాలి. తర్వాత ఇందాకటి అందమైన తోటలోకి దోవేదో చూడాలి. ముందే రెండుపనులూ ముఖ్యంగా చూడాలి - ఇదే మంచి పద్ధతి".

పద్ధతి మంచిదే సందేహం లేదు అనుకోటము తేలికగానే అయిందిగాని పద్ధతి అమల్లోపెట్టడం ఎల్లాగోమాత్రం పాప కేమీ తోచలేదు అల్లాగే చెట్ల మానుల్లోంచి ఇటూఅటూ జాగ్రత్తగా చూసుకొంటూ బయలుదేరింది.

ఇంతలో "భౌ భౌ" మన్న కుక్కపిల్ల అరుపు పాపనెత్తిమీద వినబడింది

ఓ పెద్దకుక్కపిల్ల పెద్ద మిడిగ్రుడ్లేసుకొని పాపకేసి చూస్తూ, పాపని పట్టుకొందామని పాదం సాచి చెట్లు అడ్డొస్తే చూస్తూ నిలుచుంది

"పిచ్చికుక్కపిల్ల - పాపం" అంటూ పాప కుక్కపిల్లను మంచిమాట చేసుకొనే మాదిరిగా అంది. ఈలవేయబోయింది. కాని లోపల గుండెల్లో మాత్రం, కుక్కపిల్లకు ఆకలిగా ఉందేమో, గుటుక్కున తన్ను మింగేస్తుందేమో ననే కంగారు ఎక్కువగానే ఉంది.

ఒక చిన్న కఱ్ఱముక్క పుచ్చుకొని ఆడిస్తూన్నట్లుగా కుక్కపిల్ల పైకి జూపింది కుక్కపిల్ల ఒక్క అదటున నాలుగుకాళ్లూ ఎగరేస్తూ ఒక్కగెంతు గెంతి, కఱ్ఱముక్కను నోట్లో కరచుకొని ఆడుకోటం మొదలు పెట్టింది. ఆ ఎగురుడు తొందరలో కుక్కపిల్ల ముద్దగా తల్లక్రిందులుగా పడి ఆసుకొంటూంది.

కుక్కపిల్ల తన మీద పడదేమోనని పాప పొదల పక్కకి తప్పుకుంది కుక్కపిల్ల కఱ్ఱముక్కతో ఆడుకొని, ఆయాసంతో నాలు కార్చుకొంటూ కళ్లు మూసుకొని దూరంగా కూర్చుంది పారిపోడానికి ఇదే మంచి అదననుకొంటూ, పాప అక్కడనుంచి పరుగెత్తింది పరుగెత్తి పరుగెత్తి, ఆయాసం అలసటా రావటం మొదలు పెట్టాయి. కుక్కపిల్ల అరుపుకూడా, ఎక్కడో దూరాన్నే ఆగిపోయింది.

పాప అలసిపోయి, ఒక మెట్ట తామరకాడ నానుకొని నుల్చుంది.

"అయినా ఆ కుక్కపిల్ల ఎంత చక్కగా ఉందో! సరిఅయిన అమ్మాయిగా ఉంటే బాగుండేదికదా. చక్కగా ఆ కుక్కపిల్ల కెన్నెన్ని గమ్మత్తు ఆటలు నేర్పేదును. అయ్యో! మళ్ళీ ఎదగాలన్నమాటే మర్చిపోయానేమిటి చూద్దాం ఆగు ఏంచెయ్యాలో ఏం చెయ్యాలి?"

నిజమే! ఏం చెయ్యాలనేదే ప్రశ్న. పాప ఏవన్నా తినేవిగాని తాగేవికాని కనబడుతాయేమో నని చుట్టూ పువ్వులకేసీ, గడ్డికేసీ చూసింది. దగ్గిరలో, తనంతఎత్తే ఉన్న ఒక కుక్కగొడుగు కనబడింది. ఆ కుక్కగొడుగు అంతా పాప కలయచూసింది. పైన ఏముంటుందో నని,కాళ్లు ఎత్తి నుల్చుని రెండు చేతులూ గొడుగుఅంచులు పట్టుకొని మెడ సారించి కుక్కగొడుగుపైకి చూసింది

అక్కడ గొడుగుమీద, ఒక నీలి రంగు పట్టుపురుగు,తీరుబడిగా ముడుచుకొనికూర్చుని, సన్నగొట్టంతో హుక్కా పీలుస్తూ పాపకేసి చూడనట్టుగానే,పొగ వదుల్తూ కూర్చుంది.

నందనం

ఆలోచనలన్నిటినీ ఆట్టేబైట పెట్టరాదు

పిల్లల కథలు — **జోస్యుల సూర్యముఖి**

ఒక రాజుకి గుర్రాల్ని పెంచడమన్నా స్వారి చేయడమన్నా ఎంతో యిష్టం ఒకసారి మంచి లక్షణాలు కల గుర్రం అమ్మకానికి రాగా,దాన్ని ఎంతో ఖరీదిచ్చి కొని దానికి 'హేయ్' అనగానే పరుగెత్తే అలవాటు చేసేడు. అసలే మంచి గుర్రం అందులో అలవాటయిన 'హేయ్' అని వినబడగానే మేఘాల్లో పరుగెత్తేస్తుందా అన్నంత వేగంగా పోతుంది. ఒకరోజున రాజు వేటకు పోయాడు లేళ్లు, దుప్పులు, సీమ కుందేళ్లు అతన్ని అడివంతా తిప్పేసేయి. కడకు అలిసిపోయాడు. దాహం వేసింది. వెతుకుతూన్న తీగ కాలికి తగిలినట్లు ఒక పండ్లచెట్టు కనిపించింది. ఆకుకి ఒకపండు వుందా అన్నంత కాపు కాసింది. కాని దాని క్రింద ముళ్ళడొంకలు. చెట్టు ఎక్కడం, ఎవరితరమూకాదు. రాజు గుర్రాన్ని నిలబెట్టి, దాని నడుము మీదనే నిలబడి ఒక్కొక్క పండే ఆరగిస్తున్నాడు కొంచెం దాహం, ఆకలీకూడా తగ్గేయి యింక ఆలోచన ప్రారంభమైంది అతనిలో "ఆహా! ఈగుర్రం ఎంతసుగుణములు కలది. ఎంత శాంతంగా నిలబడింది నేను ఒక బల్లమీద నిలబడినట్లే వుంది గాని, ప్రాణమున్న జంతువుపైన నిలబడినట్లు లేదు 'హేయ్' అన్నంతమాత్రాన ఎంత చురుకుగా పరుగుతీస్తుంది అన్న ఆలోచన అంతా మాటల ద్వారానే గట్టిగా వ్యక్తపర్చుకుంటూ పరధ్యానంగా ఉన్నాడు గుర్రానికి 'హేయ్' అన్నశబ్దం వినబడగానే బాణంలా దూసుకుపోయింది. సిద్ధంగా లేని రాజు ముళ్ళడొంకలో పడ్డాడు. శరీరం అంతా ముళ్ళు గ్రుచ్చుకుపోయాయి. 'అయ్యో!' నాఆలోచన లన్నిటికి వాగ్రూపం యిచ్చినందువల్ల యింత ప్రమాదం వచ్చింది కదా!' అని విచారించాడు కాబట్టి మన ఆలోచన లన్నీ మాటల ద్వారా వ్యక్తపరిస్తే ఒక్కొక్కప్పుడు చిక్కు రావచ్చు.

ఆధ్వాన్నపు బ్రతుకు

(11వ పేజీ తరువాయి)

"లేదు. నాన్నా! నిజంగా... నేనే... వారు పంపించారు. వచ్చాను" అని మా నాన్నను తృప్తి పరచాలని అబద్ధంకూడ చెప్పాను. మా నాన్నకు కొంత స్పృహ వచ్చింది.

"ఆ... అతడుకూడ వచ్చాడా? అమ్మా!" అని ఎంతో ఆప్యాయంగా మూలుగుతూనే అడిగారు మా నాన్న.

"నా హృదయం నిలువునా నీరైపోయింది. మళ్లీ ధైర్యం తెచ్చుకొని "తొందరపనులవల్ల రాలేకపోయారు. నన్ను స్టేషనుదాకవచ్చి బండెక్కించి వెళ్ళారు. వారుకూడ యీ రాత్రికి తప్పక వస్తారు" అని ఆయన ఆదుర్దా తగ్గించటానికి నిజాన్ని కప్పిపుచ్చుతూ చెప్పాను.

"నేను ఆయన తలగడదగ్గర కూర్చొని ఉపచారం చేస్తున్నంతసేపు, మాటిమాటికి నా ముఖంలోకి చూస్తూ, లేని ఓపికతో నా కన్నీళ్లు తుడుస్తూ, "ఊరుకో... పిచ్చితల్లీ! నాకేం ఫరవాలేదు" అని తలమీద చెయ్యివేసి నిమురుతూవుంటే, నా మనోవీధిలో బాల్యంనుంచీ తల్లి లేకపోయినా ఏ లోటూ జరగనివ్వకుండా ఆయన నన్ను పెంచి పెద్దదాన్నిచేసిన ఘట్టాలు ఆ పితృహృదయంలో, నే సంపాదించుకోగలిగిన ప్రేమస్థానం, నా సంసారాన్నిగురించి ఆయన పొందుతున్న మనోవ్యథ నాకు కళ్ళకు కట్టినట్లుగ కనుపించాయి.

"అమ్మా! అతడు వచ్చాడా? వస్తాడంటివే?......" అని చీకటిపడినదగ్గర్నుంచీ అల్లుడికోసరం ఆయన తహ, తహలాడారు.

"వస్తారు, నాన్నా. తప్పక వస్తారు..." అని అబద్ధం చెప్తూనే ఆయన్ని తృప్తిపరచాలని ప్రయత్నం చేశాను.

"పిచ్చితల్లీ! అతడు మనింటి కెందు కొస్తాడమ్మా? నీ భ్రమేకాని. వొచ్చేవాడైతే నీతో పాటే వచ్చేవాడు......" అని మళ్ళీ మూలుగుతూ మా నాన్న నా వొడిలోనే తలకాయ వుంచారు.

కొంతసేపుండి "నాకు తెలుసు... అత డెందు కొస్తాడు. రాడు. ముమ్మాటికీ రాడు. నేచేసిన నేర మేమిటో?..."

మానాన్న అల్లుడికోసరం కలవరిస్తూనే గురక పెట్టడం మొదలెట్టారు. ఆయన అమాయిక హృదయాన్ని అబద్ధం చెప్పి అంతవరకూ అల్లుడు వస్తారని ఆశచూపించిన, నామనస్తత్వానికి నన్ను నేనే నిందించుకొన్నాను. కట్టతెగిన కన్నీటి ప్రవాహాన్ని ఆపుకోలేకపోయాను. నాహృదయంలో బరువు తగ్గిందాకా ఏడ్చాను. ఆ వేడి కన్నీటికే నా తండ్రిహృదయం కాలి బూడిదయి పోయింది.

మధ్యాహ్నానికి తన వాయువుల్ని నాతండ్రి అనంతవాయువుల్లో కలిపివేసి నా వొడిలోనే శాశ్వతనిద్ర చెందాడు."అని,భిక్షుకి ఆపైన చెప్పలేకపోయింది. ఆమెచరిత్ర వింటున్న నాకు, పార్వతికేగాక ఇంకా ఇద్దరు, ముగ్గురు ప్రయాణికులకు గూడ కళ్లు చెమ్మగిలినై.

"ఆట... తరువాత..."అన్నాను.

"నాభర్తకు కబురంపాను. వారు రాలేదు. మా పాలేరు రామన్నసహాయంతో యింకా యితర వూరిపెద్దల ఆధారంతో ఏలాగో నా తండ్రి శవాన్ని అగ్నిసంస్కారం చేయించాను. ఆరాత్రినుంచీ మళ్లీ నాహృదయంలో ఆలోచన బయలుదేరింది. ఏం చెయ్యాలి? ఇంటికి ఎలా వెళ్లను? ఆయనగుమ్మంలో కాలుపెట్ట నివ్వనని పట్టుపడతారేమో! అర్ధరాత్రి అలా యిల్లువదలి పెట్టి ఎందుకు వచ్చేసానా? అని వ్యథ ఒకవేపు, నాకాపురానికి నీళ్లు వొదులుకొన్నా, ఆఖరి క్షణాల్లోనైనా సరే నాచేతులమీదుగానే, నా తండ్రిని సాగనంపుకో గలిగినందుకు కొంత తృప్తి మరోవేపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేయ మొదలుపెట్టాయి.

కొట్టినాసరే, చంపినాసరే, వెళ్లి ఆయన కాళ్లమీదే పడదామని నిశ్చయించుకొని మరునాడుదయం బండికి ప్రయాణమై వెళ్లాను. కను చీకటి పడుతూఉండగా మెట్లెక్కి వసారాలోకి వెళ్లాను. ఎక్కడా అలికిడి లేదు. తలుపు త్రోసి తూర్పింట్లో కాలుపెట్టబోయేటప్పటికల్లా అత్తగారు ఎదురై "ఆ... ఎవరు?... నువ్వా... పద. ముందువరండా మెట్లు దిగుతావా? దిగవా!.. అర్ధరాత్రివేళ లేచిపోయిన ముండవు పోక... మళ్లీ ఎందుకు దాపురించావ్?" అని గద్దించింది.

గత్యంతరం లేక, ఎదురు మాట్లాడే శక్తిలేక బయటమెట్లలోకి వచ్చి గుబురుగా వున్న ఎర్ర గన్నేరుచెట్టు దగ్గర క్రీనీడలో నుంచున్నాను. రెండు నిముషాల్లో ఏదో ఆదుర్దైన శబ్దం నా వెనుక కలిగింది. వెంటనే అదరిపడి వెనక్కి తిరిగిచూచాను. నా పై ప్రాణాలు పైనే పోయాయనిపించింది... బాబూ! క్షమించండి. ఇహ ఆపై సంఘటన చెప్పమని నన్ను బలవంతపెట్టవద్దు"అని భిక్షుకి నాముఖంలోకి చూచింది.

"ఎందుకమ్మా? అలా యథార్థాన్ని చెప్పటానికి భయపడతావు! అన్నాను.

"పోనీలెండి. అభిమానంవల్ల-చెప్పలేకపోతుందేమో!..." అంది పార్వతి.

"అమ్మా! నాకు యింకా అభిమానం కూడానా? అడుక్కుతినేదానికి అభిమానమెందు కమ్మా! చెప్పలేక... ఈ... అధ్వాన్నపు బ్రతుకుఅంతా వింటే, మీ రెంతగా అసహ్యించుకుంటారోనని... బాధ..."

"లేదమ్మా! నీ బ్రతుకులో నీ అవినీతిప్రవర్తన ఏముంది గనుక మేం నిన్ను అసహ్యించుకోవాలి? నీచరిత్ర వింటున్న కొద్దీ నీపై మాహృదయాల్లో ఏర్పడ్డ సానుభూతి మరీ బలీయమౌతుంది." అన్నాడు.

"అయితే, బాబూ! మీలో ఓర్పుంటే వినండి. చెబుతాను. నాభర్త సిగపట్టుకొని వెనకాల పళ్లు నూరుతూ నుంచున్నారు. ఆయన నోట్లోనుంచి మద్యపానపు కంపు నాముక్కుల్ని బద్దలుచేస్తుంది. కళ్లు బాగా చింతనిప్పుల్లా ఎర్రబారి వున్నాయి. ముఖం చాలా భీకరాకారంతో వుంది.

జుట్టుపట్టుకొని వూపుతూ "రండు.. పోయినదానవు పోక మళ్లీ ఏముఖంపెట్టుకొని నాయిల్లులోకి వచ్చావ్?..... దొంగవేషాలు. అయ్య చచ్చాడని కబుర్లు.. నువ్వుకూడ చస్తే పీడావదిలేది." అని యింకా నోటికొచ్చినట్లల్లా నానా మాటలూ మాట్లాడి, అసలే నీరసంగా వున్న శరీరాన్ని, హూనంచేసి రోడ్డుమీదకు లాగారు.

"అడుగు యివతలకు పెట్టావా నరుకుతాను. జాగ్రత్త. ఛీ..."అని గద్దరిమి, గేటు వేసుకొని ఆయన లోపలికి వెళ్లా.

నా కెటుపోవాలో, ఏం చెయ్యాలో తోచక చాలాసేపు రోడ్డుమీద నిలబడ్డాను. ఎలాగైనా యీ గుక్కెడు ప్రాణాలను కడతేల్చా లనుకొని వూరివెలుపలి చెఱువుగట్టుకేసి బయలుదేరాను. నాలుగైదు ఇళ్ళు దాటంగానే, నాకు పరిచితమైన స్వరంలోనుంచే యిలా మాటలు వినపడ్డాయి:

"ఎప్పుడొచ్చిందీ చెడుభాగ్యపుది మళ్లీ వూళ్లోకి? పోకదలమారి... మళ్లీ ఎక్కడికో బయలుదేరిందే? ఆ మొగుడు దీన్ని కట్టుకున్నందుకు ఎంత అల్లరిపా లవుతున్నాడంటేను! ఇది ఏ ముహూర్తాన ఆ యింట్లో కాలుపెట్టిందోగాని, ఎప్పుడూ ఏదో ఒక గొడవే. ఇటువంటి ......వల్ల వూరిపేరు కూడ నాశనమవుతుంది."

"మళ్లీ నాలు గిళ్లు దాటాను. మరో కంఠస్వరంలోనుంచీ యిలా మాటలు వెలువడ్డాయి."

"అర్ధం రేత్రికాడ ఎవడితోనో లేచిపోయిందటగ! మళ్లీ కాలుపెట్టడానికి ముఖం ఎట్లా చెల్లింది? ఇడిసేసి తిరిగే... లజ్జా! భయమా! ఏం? ఆ బ్రతుకు ముదనష్టపు బ్రతుకు, బ్రతక్కపోతే, ముక్కుమూసుకొంటే, మూడు ఘుళ్లు పట్టదు."

"ఇది, బాబు! లోకం తీరు. ఆ మాటలు వింటూంటే నా హృదయం బల్లెపుపోట్లు తింటున్నట్లుగా వుంది. తూట్లుపడ్డ హృదయంతో, తడబడుతున్న కాళ్లతో లేని ఓపికతో ఆయాసపడుతూ చెఱువుగట్టుపైకి చేరాను. గట్టు ఎక్కేటప్పటికి కళ్లు గిర్రున తిరిగాయి. అడుగు తీసి అడుగు వెయ్యలేక పోయాను. అక్కడే కూలపడ్డాను. స్మృతితప్పిపోయింది. తెలివి కలిగి చూచేటప్పటికి నా తల ఎవరి వొళ్లోనో వున్నట్లు, ఎవరో ఉపచారం చేస్తున్నట్లు గోచరించింది. ఉలిక్కిపడి లేచాను. ఎదురుగా మానవాకారం స్పష్టంగా గోచరించింది."

"ఎవరు? బాబు! మీరు." అని అడిగాను.

"నేనా? దిక్కులేని అంధభిక్షువుని. నీ వెవరవమ్మా? ఈ సమయంలో ఇక్కడ పడిపోయివున్నావేం?" అని అతడు జాలిగా అడిగాడు.

"ఆ చీకటిలో అతడు చెప్పేవరకూ అతడు అంధుడని నే గుర్తించలేకపోయాను. 'బ్రతుకు భారమై యీ గుక్కెడు ప్రాణాల్ని వొదులుదామని వచ్చాను బాబు మీ రీ సమయంలో ఇక్కడి కెందు కొచ్చారు?"

"మాధాకవళాలతో పొట్టనింపుకొని, రోజూ యిన్ని నీళ్లు త్రాగి ఈ చెఱువుగట్టుమీదే ఒక ప్రక్కన పడుకుంటాను ఇవ్వాళకూడ మామూలు వేళకే పని పూర్తిచేసుకొని పడుకొందామని వెళ్తూంటే దారిలోపడివున్న నీ శరీరం నా కాలికి తగిలిందమ్మా. ఒక నిముషం ఏమిటోనని అంజాయించాను. ధైర్యం చేసి తాకిచూచాను. శ్వాస చాల బలీయంగా వస్తున్నట్టు గుర్తించి, అయినా ప్రయత్నంచేసి చూద్దామని నాయీ జోలెగుడ్డ తడిపి తెచ్చి ఇన్ని నీళ్లు ముఖానపిండి, తుడిచి, ఏం చెయ్యటానికీ తోచక అలా తల వొళ్లో పెట్టుకు కూర్చున్నాను. కొంతసేపటికి ఇటూ, అటూ పొర్లావు. నా కెంతో ఆనందం కలిగింది." అని అంధభిక్షువు చెబుతూంటే, ఆశ్చర్యమూ, దుఃఖమూకూడ ఒక్కసారిగ వొచ్చాయి. మానవుడి హృదయానికి అంధత్వం లేకపోతే, బాహ్యేంద్రియంగా అంధత్వముంటే మాత్ర మేం? హృదయంలేని మానవుడికి కళ్ళు ఉండీ మాత్రం ప్రయోజన మేముంది?..." అనిపించింది.

ఆ అంధభిక్షువు ముఖంలోకి చూస్తూ "బాబూ! అంత శ్రమపడి ఉపచారంచేసి నన్నెందుకు బ్రతికించావు? చావనివ్వక పోయావా?..." అన్నాను.

"పిచ్చితల్లీ! ఎంతమాట! ఏ జీవికైనా ప్రాణంకంటే తీపిఅయిన వస్తు వేముంటుంది? నీ హస్తాన్ని స్పృశిస్తేనే ఎక్కడిదా? యీ అమృతహస్త మనిపిస్తుంది. అల్లాంటి నీ కీ విరక్తి, జీవితంపై హేయం ఎందుకు కలిగిందమ్మా" అని అంధభిక్షువు కరుణతో అడిగాడు."

అతనికి నా జీవిత సంఘర్షణ, నా ధృఢ నిశ్చయాన్ని దాయకుండా చెప్పాను. "చచ్చి ఎవర్ని సాధిస్తావమ్మా? లోకంపైనా నీ కక్ష! బ్రతుకునే నేరంగా చేసుకుంటే, క్షణమైనా బ్రతగ్గలమా? ప్రతిప్రాణికీ జీవితాశకన్నా గొప్పఆశ ఏముంటుంది? పైకి యీ లోకం ఎంత అమృతతుల్యంగా కనబడుతుందో, లోపల అంత హాలాహలంతో చల, చల మరుగుతూ, వుంటుంది. నీబోటి అభాగినులు, ఎంతమంది నిత్యనైవేద్యం క్రింద సంఘానికి బలి అవుతున్నారో గదా!...... "అని అంటూండగానే అతడి కళ్ల వెంబడి నీళ్ళు కారాయి.

"అమ్మా! నామాట విను. నువ్వు సందేహించకు. నాకెవ్వరూ దిక్కులేరు. ఇదిగో యీ దరియాతీసుకొని తీగలు మీటుతూవుండు. నేపాట పాడగలను. మన జీవనోపాధిగడుస్తూవుంటుంది." అన్నాడు.

భిక్షాటన మనేటప్పటికి మనస్సు అభిమానంతో పీకింది. చాలాసేపు ఆలోచించాను. కానీ అతడి ప్రేమపూరితవాక్కులు, లాలన నా ధృఢనిశ్చయాన్ని భగ్నంచేసి, జీవితాశను కలిగించాయి. చూస్తూ, చూస్తూ నిండుప్రాణాల్ని చెఱువుకు అర్పించాలని లేకపోయింది. ఏమి చెప్పటానికీ తోచక "అలాగే, బాబు!" అనేశాను. కొంతసేపుండి "బాబు! ఒకవిషయం మీరు వొప్పుకోవాలి." అన్నాను.

"ఏమిటమ్మా అది!" అని అడిగాడు

"మన వృత్తి నిరాటంకంగా సాగిపోవాలంటే, మనం చాలా దూరప్రాంతాలకు పోవాలి. అది మీ కిష్టమేనా?" అన్నాను.

"అట్లాగేలే, తల్లీ! ఎక్కడైతే యేం?" అన్నాడు.

ఆ తెల్లవారు ఝామునే లేచి నే దరియా తీసుకొని ముందు నడువ మొదలెట్టాను. అతడు నావెంటనే కర్ర వూతంతో బయలుదేరి నడువ నారంభించాడు. ఊరి పొలిమేర దాటుతుంటే ఆపుకుందామన్నా ఆగకుండా కళ్ల వెంబడి నీరు పొర్లుకొచ్చాయి." అని భిక్షుకి కొంతసేపు ఆపింది.

అంతవరకూ నిశ్చేష్టులమై ఆమె జీవితం వింటున్న పార్వతీ, నేనూకూడ ఒకసారిగ నిట్టూర్చాం.

కొంతసేపుండి "మరి అత డెప్పుడు మరణించాడు?" అన్నాను.

"ఈమధ్యనే, ఆరుమాసాలయింది బాబు!"

"జబ్బు చేసిందా?"

"కలరా తగిలింది......నే పోయినా బాగుండేది, బాబు!"

"పిచ్చిదాన, మన చావు, పుట్టుకలు మన చేతుల్లో వున్నాయా?" అంది పార్వతి.

"లేవు. నిజమేనమ్మా! అధ్వాన్నపు బ్రతుకు బ్రతకలేకనే అలా అనుకోవటం."

కొంతసేపు ఆలోచించి "ఏ, అమ్మా! మరి మాతో వచ్చేస్తావా? తీసుకుపోతాం." అన్నాన.

"ఎక్కడికి, బాబు! ఏంపని చెయ్యాల్సి వుంటుంది? మీబోటి గౌరవంగా బ్రతికేవాళ్ళల్లోకి, మాబోటి అధ్వాన్నపుబ్రతుకు బ్రతికేవార్ని రానిస్తారా? మీ గౌరవప్రతిష్ఠలకు భంగంకాదా?" అంది నిరాశగా చూస్తూ.

"లేదు. అమ్మా! మే మొక శరణాలయం నడుపుతున్నాం. అందులో చాలామందిఅనాథ, బాలబాలిక లున్నారు. వృత్తివిద్య, చేతిపనులు నేర్చుకొంటూ వుంటూరు. నువ్వుకూడ అక్కడవాళ్ళను కనిపెట్టుకొని వుంటూ, చేతనైన పనిచేస్తూ వుండవచ్చు. నీ పోషణభారం మేం వహిస్తాం సరేనా?" అన్నాను.

"మీదయ.. బాబు!"

ఆచారభేదాలు

(7వ పేజీ తరువాయి)

కావడం చేత మనదేశానికి యీ క్షామబాధ సిద్ధించింది. దీని క్కారణం రైతే.

"కుంభకోణే కృతం పాపం
కుంభకోణే వినశ్యతి".

అన్నట్లు రైలువల్ల వచ్చిన చిక్కు రైలువల్లనూ, స్టీమరువల్ల వచ్చినచిక్కు స్టీమర్లవల్లనూ తీరాలిగాని అన్యథా తీరే వుపాయం కనపడదు. యెండలు యెన్ని చోట్లకు రాయబారాలుగా వెళ్లినా పదార్థమంటూ వుంటే తప్ప ప్రయోజనం వుండదుగదా! యిప్పుడు సమృద్ధిగా వర్షాలు కురిసినా కటువు వెంటనే పోదు. వచ్చేవత్సరం పోవాహలి. వొక్క వర్షంతో తేలేదు. యింకా యెన్నో యోగాలు అనుకూలించాలి. యితరదేశాలుకూడా బాగా ఫలించాలి. లేకపోతే మన నోటికి మన పంట అందదు. మన షావుకార్లు మన దేశానికి అరిష్టగ్రహాలుగా పరిణమిస్తారు. యెన్నివిధాల అవయోగాలు వుండాలో అన్నీ సమకూడివున్నాయి.

"స్వరాజ్యం" వస్తేమాత్రం వీట్లని తట్టుకోగలదా? పాపం, యేమో, "తినబోతూ రుచులెందుకు?" హరిజనులు వ్యవసాయదారుల్ని యిప్పుడే పీల్చుకుతింటూన్నారు. బస్తా 1 కి రు 20-0-0 లేనా వెల వుంటేనే కాని రైతుకు విత్తనాలు కూడా మిగలనిచ్చేటట్టులేదు కూలీ ధోరణి. అంతా కూలీలకింద మాటితే బాగుంటుందనిపిస్తూవుంది. కాని ఆ పద్ధతిని వ్యవసాయం చేసి గవర్నమెంటుకు పన్నెవరు చెల్లిస్తారు? మాట్లాడేటప్పటికల్లా సమ్మె. అక్కడినుంచి కాల్పులు, పేల్పులు. యీ దేశానికి మంచికాలమంటూ భవిష్యత్తులో వుందా? అనిపిస్తుంది. యెందు కన్నాడో నన్నయ్య భట్టారకుడు—"గతకాలము మేలు వచ్చు కాలముకన్నన్" అన్నాడు—మహానుభావుడు, నిత్యసత్యవచనుడు, మత్యమరాచార్యుడు. "సత్కవి వాక్యము రిత్తవోవునే".

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

ఆశియా, దూరప్రాచ్య ఆర్థికసంఘ ద్వితీయ వార్షిక సమావేశం

ప్రపంచమున శాంతి భగ్నమైపోయి అప్పుడప్పుడు సంక్షోభము సంభవించుచుండుటకు వివిధదేశముల మధ్యగల ఆర్థికఅసమానత్వమే కారణమని ద్వితీయప్రపంచ సంగ్రామకాలము నాటికి ప్రపంచరాజకీయవేత్తలందరు గ్రహించిరి. ప్రపంచ శాంతిరక్షణకు మిత్రరాజ్యములు ఐక్యరాజ్యసమితిని స్థాపించినప్పుడు ఈవిషయమును జ్ఞాపకముంచుకొనియే వారు ఆర్థిక సామాజికసంఘమను నొక ఉపాంగమును కూడ దానికి కల్పించినారు. ప్రపంచమందన్ని ప్రాంతములును ఆర్థికముగ వృద్ధి పొంది, ప్రజలందరికి అన్నవస్త్రములు లోటులేకుండ లభించునట్లు చేయుటయే ఈ సంఘఆశయము. ఈ ఆశయ సాధనకొరకు ఈ సంఘము కొన్ని ప్రాంతీయ ఉపసంఘములను ఏర్పాటుచేసినది. అట్టివానిలో ముఖ్యమైనది ఇప్పుడు ఉదకమండలంలో సమావేశమగుచున్న దూరప్రాచ్య ఆర్థికసంఘము.

దూరప్రాచ్య ఆర్థిక సంఘము 1947 వ సం మార్చి నెలలో ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక సంఘముచే ఏర్పాటుచేయబడినది. యుద్ధము వలన నాశనమైపోయిన ఆసియా, దూరప్రాచ్య రాజ్యాల ఆర్థికవ్యవస్థను తిరిగి నెలకొల్పుట, ఆ రాజ్యముల మధ్య పరస్పరముగను, ఆ రాజ్యములకు ఇతర రాజ్యములతోను ఆర్థిక సంబంధములను ఏర్పరచి, దృఢతరమొనర్చుట ఈ సంఘ కర్తవ్యము. ఈ సంఘము శాశ్వత సంఘముగాక, తాత్కాలికముగ 1951వ సం. వరకు పనిచేయుటకు మాత్రమే నియమింపబడినది. ఆనాటికి ఈ సంఘము నిర్వర్తించిన కార్యములను సమీక్షించి, అవుసరము, లాభదాయకమునని తోచినచో దీనిని మరికొంతకాలముపాటు సాగనిచ్చెదరు.

దూరప్రాచ్య ఆర్థికసంఘ ప్రథమ సమావేశము 1947 వ సం. జూన్ నెలలో షాంగ్ హైలో జరిగెను. ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక సంఘ యాజమాన్యమున దూరప్రాచ్య దేశముల ఆర్థికాభివృద్ధిని గురించి అప్పటివరకు జరిగిన పరిశోధనను క్రోడీకరించి, భవిష్యత్ కార్యక్రమము, కార్యాచరణ విధానము ఈ సమావేశములో నిర్ణయింపబడెను. ఈ సంఘ పర్యవేక్షణలో నున్న దూరప్రాచ్య రాజ్యములలో యుద్ధకాలములో నాశనమైపోయిన ఆర్థిక సంపదను తిరిగి నెలకొల్పుటకు, స్వల్పకాలములో, అవుసరమగు సాధనసంపత్తి విషయమై ఈ సమావేశములో ఆలోచింపబడెను. క్రొత్త పరిశ్రమలను స్థాపించిన, వానిని నడుపుటకు అవుసరమగు నిపుణులకు శిక్షణ యిచ్చుటనుగూర్చి ప్రత్యేకముగా ఆలోచింపబడెను.

షాంగ్ హై సమావేశము తరువాత మరొక సమావేశము 1947 వ సం॥ జులై నెలలో లేక్ సక్ సెస్ లో జరిగెను. పూర్తిగా స్వతంత్రములుగాని రాజ్యములను సహాయ-సభ్యులుగా జేర్చుకొని, ఈ సంఘ కార్యకలాపముల వలని లాభములు వానికి కూడ లభించునట్లు చేయుటకు ఈ సమావేశములో నిర్ణయింపబడెను. మిత్రరాజ్యముల ఆక్రమణలోనున్న జపాన్, కొరియా రాజ్యములనుకూడ సంఘ పర్యవేక్షణ క్రిందకు తెచ్చుటకు నిర్ణయింపబడెను.

1947 వ సం. నవంబరు నెలలో ఈ సంఘ ద్వితీయ సమావేశము ఫిలిప్పైన్ ద్వీపులలోని బాగ్వీలీ పట్టణంలో జరిగింది. ఈ సమావేశమును ఫిలిప్పైన్ అధ్యక్షుడు కి. శే. రోక్సాస్ ఉపక్రమించెను. ఆసియారాజ్యముల అవుసరములను గురించి విచారించి, నివేదించుటకు షాంగ్ హైలో ఏర్పాటు చేయబడిన వివిధ ఉపసంఘములు చేసిన పనిని ఈ సమావేశములో సమీక్షించి, పూర్తి నివేదికలను తయారుచేయవలసిందని ఆదేశించిరి. ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల ఆర్థిక అభివృద్ధికి అవుసరమగు నిపుణులకు శిక్షణ ఏర్పాట్లు చేయుటకు ఒక 'అడ్ హాక్ కమిటీ' ఈ సమావేశములో నియమింపబడెను.

దూరప్రాచ్య ఆర్థికసంఘ తృతీయసమావేశము అనగా, ద్వితీయవార్షిక సమావేశము ఇప్పుడు ఉదకమండలములో జరుగుచున్నది. భారత ప్రధానామాత్యుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ సమావేశమును ఉపక్రమించెను. భారత ప్రభుత్వ రవాణాశాఖమంత్రి డా. జాన్ మత్తాయ్ ఈ సమావేశమునకు అధ్యక్షుడుగా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడెను.

ఐక్యరాజ్యసమితి దూరప్రాచ్య ఆర్థికసంఘములో 18 రాజ్యములకు సభ్యత్వమున్నది: ఆస్ట్రేలియా, బర్మా, చైనా, ఫ్రాన్సు, కంబోడియా, లావోస్, ఇండియా, న్యూజిలాండ్, ఫిలిప్పైన్సు, బ్రిటన్, అమెరికా, రష్యా, సికమాశం, హాంకాంగ్, మలయా, నెదర్లండ్సు, పాకిస్థాన్, సయాంలు—ఈ 18 రాజ్యములు.

దక్షిణ భారతదేశములో అతి సుందరమైనదగు ఉదకమండలం పట్టణములో ఈ సమావేశము జరుగుచున్నది. ఈ సంఘప్రధానకార్యదర్శి దక్షిణాత్యుడగు డా. లోకనాథన్. ఈ సంఘము సల్పుచున్న నిర్విరామకృషికి చాలవరకు ఈయనయే బాధ్యుడు. ఆశియా, దూరప్రాచ్యరాజ్యములలో భారతదేశము పెద్దదగుటయేగాక, అభివృద్ధికి ఎక్కువ అవకాశము గల దేశము కూడాను. ఆసియా, దూరప్రాచ్య దేశాలలోని మొత్తం 100 కోట్ల జనాభాలో భారతదేశంలోనే 20 కోట్లమంది వున్నారు. చైనాదేశము భారతదేశముకన్న విస్తీర్ణములోను, జన సంఖ్యలోను పెద్దదైనను, ఒక దశాబ్దమునుండి యుద్ధజ్వాలలలో మ్రగ్గియుండుటవలన ఆశియారాజ్యములలో తన స్థానము నాక్రమింపలేకున్నది. అందువలన ఈనాడు భారతదేశమే ఆసియారాజ్యములకు నాయకత్వము వహించి రాజకీయముగను, ఆర్థికముగను వానిని పాశ్చాత్యరాజ్యములతో సమాన హోదాలోనికి తేవలసిన కార్యభారమును వహించవలసియున్నది. అందువలన దూర ప్రాచ్య ఆర్థిక సంఘము భారతదేశములో సమావేశమగుట సమంజసముగనున్నది. అసలు, ఈ సంఘప్రధాన కార్యాలయమునే ఇక్కడ స్థాపించుకొనవలసినదని పండిట్ నెహ్రూ చేసిన సూచన ఈ సంఘము అతి జాగ్రత్తగా పరిశీలించి, అంగీకరించగలదని ఆశించవచ్చును.

ఒక నెలరోజులనండి ఐక్యరాజ్యసమితి ఉద్యోగులు ఉదకమండలంలో ఈ సమావేశమునకు ఏర్పాట్లు చేయుచుండిరి. ఉదకమండలంలోని భవనములలో గొప్పదగు జోధపూర్ మహారాజా భవనములో ఈ సమావేశము జరుగుచున్నది. వివిధదేశములనుండి ఏతెంచు ప్రతినిధులకు చక్కని వసతి సౌకర్యములు ఏర్పాట్లుచేయబడినవి. ఐక్యరాజ్యసమితి సమావేశములో సాధారణముగా అమర్చబడు U ఆకారపుబల్ల ఈ సమావేశములోనూ అమర్చబడినది. 18 రాజ్యముల ప్రధానప్రతినిధులకు, వారి వెనుక ప్రత్యామ్నాయప్రతినిధులు, ఇతర సిబ్బందికి అకారాదిక్రమమున ఆసనములు అమర్చబడినవి. U ఆకారపువంకరలో ఐక్యరాజ్య సమితి ఉద్యోగులకు ఆసనము అమర్చబడినది ఈ యేర్పాట్ల నన్నిటిని ఐక్యరాజ్యసమితి ఉద్యోగి వాంగ్ స్యయముగ్వ ఉదకమండలములో నుండి జరిపించెను.


భారతప్రభుత్వ ప్రధాన ప్రతినిధిగా డా. జాన్ మత్తయ్ సమావేశమునకు పంపబడెను. కాని ఈయన అధ్యక్షుడుగా ఎన్నుకొనబడుట వలన డా. శ్యాంప్రసాద ముఖర్జీ భారత ప్రభుత్వము తరఫున ప్రధాన ప్రతినిధిగా పంపబడెను. మద్రాసు రాష్ట్ర పారిశ్రామికమంత్రి శ్రీ సీతారామిరెడ్డిగారు ప్రత్యామ్నాయ ప్రతినిధి. రాజ్యాంగ పరిషత్తు సభ్యులు శ్రీ అనంతశయనం అయ్యంగారు, శ్రీ బి. శివరావు గారలు భారత ప్రతినిధి వర్గములోని ఇతర సభ్యులు. వీరికి సలహాదారులుగా కేంద్రప్రభుత్వ ఉద్యోగులు కొంతమంది పంపబడిరి. 18 రాజ్యముల నుండికూడ ఇట్లే ప్రతినిధి వర్గములు, తమ సలహాదారులతోను, ఇతర సిబ్బందితోను విచ్చేసెను.

ఈ సమావేశములో చర్చకు వచ్చు ముఖ్య విషయము ఆహారసమస్య ఆసియా, దూరప్రాచ్య రాజ్యములన్నియు వ్యవసాయము ముఖ్యపరిశ్రమగాగల దేశములే అయినను చైనా, భారతదేశములలో ఆహారపు కొరత ఒక పెద్ద సమస్యగా నున్నది. వ్యావసాయిక ఉత్పత్తిని వృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఈ ప్రాంతములోని అన్ని ప్రభుత్వములు గుర్తించినవి. ఈ సంఘము ఈ విషయము ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించి, నిర్మాణాత్మకములు, ఆచరణ యోగ్యములగు సూచనలుచేసి ఈ ప్రాంతమునకు తోడ్పడవలసి యున్నది.

ఐక్యరాజ్యసమితి చేయు కొన్ని నిర్ణయముల వలెనే ఈ సంఘనిర్ణయములుకూడ సభ్యరాజ్యములకు కేవల సూచనలవలెనే ఉండును. తన సూచనలను అంగీకరింపవలసిన దని సభ్యరాజ్యములను నిర్బంధించు హక్కు ఈ సంఘమునకు లేదు. అయినను ఈ సంఘము ఆయా దేశముల ఆర్థిక అభివృద్ధికొరకు సూచనలుచేయును కాబట్టి వానిని ఆమోదించుట ఆ రాజ్యములకే శ్రేయోదాయకము.

ఉదకమండలములో జరుగుచున్న సభను ప్రారంభించుచు భారతప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఒక మహోపన్యాసము చేసెను. ఆశియారాజ్యముల ఆర్థికాభివృద్ధి అత్యంతావశ్యకమని గుర్తించినను అందుకొరకు పాశ్చాత్యరాజ్యముల సహాయము ఆవశ్యకమని గుర్తించినను, పాశ్చాత్యరాజ్యముల ప్రాజాపత్యమునకు దారి తీయగల ఎట్టి షరతులకు లోబడి ఆ సహాయమును అపేక్షింపమనీ, కొంత ఆలస్యమైనను సరే, స్వతంత్ర ప్రతిపత్తికి భంగము వాటిల్లకుండనే ఆర్థికాభివృద్ధి జరుపుకొనెదమనీ ఆశియావాణిని ఆయన ఎలుగెత్తి చాటెను.

ఇండోనీషియన్ రిపబ్లిక్‌ను ఎసోసియేటెడ్ సభ్య రాజ్యముగా జేర్చుకొను విషయమై రెండవ రోజు సమావేశములోనే కొంత తర్జన భర్జనలు జరిగెను. ఈ సంఘ పర్యవేక్షణ క్రిందకు వచ్చు ప్రాంతపురాజ్యమగు ఇండోనీషియన్ రిపబ్లిక్‌ను ఈ సంఘములో ఎసోసియేటెడ్ సభ్యత్వమిచ్చుటకు ఎట్టి ఆక్షేపణము ఉండవలసినది కాదు. కాని రిపబ్లిక్‌కు అంతర్జాతీయ ప్రాధాన్యత లభించినచో, ఇండోనీసియాలో తమ ప్రాజాపత్యమునకు భంగము వాటిల్లునను భయముతో డచ్ సామ్రాజ్యవాదులు, ఇతర సామ్రాజ్య వాదుల సహాయముతో రిపబ్లికనులకు సభ్యత్వము లభింపకుండ చేయవలెనని ప్రయత్నించుచున్నారు. కాని సభలో అధికసంఖ్యాకులు రిపబ్లిక్ సభ్యత్వముపట్ల సుముఖులుగా నున్నారనట నిస్సందేహము. ఈ విషయమై త్వరలోనే నిర్ణయము జరుగనున్నది. అప్పుడైనను రిపబ్లిక్‌కు న్యాయం జరిపి, అన్ని ప్రాంతముల ప్రజల సంపూర్ణ సహకారముతో దూరప్రాచ్య ఆర్థిక సంఘము తన వార్షిక సమావేశమును జయప్రదముగా సాగింపవలసియున్నది.



శ్రీ కొత్త రఘురామయ్యగారు

మద్రాసు, లా డిపార్టుమెంటు, స: కార్యదర్శిగా నియమితులయ్యారు.



వధూవరులు

మే 19న శ్రీ మాగంటి బాపినీడుగారి కుమార్తె చి॥ సౌ॥ ఝాన్సీ లక్ష్మి వివాహము జరిగినది. వరుడు, శ్రీ జాస్తి కృష్ణారావుగారు, కృష్ణాజిల్లా.

క్రీ॥ శ॥ 17, 18, 19 శతాబ్దములలో తేజరిల్లిన "కాకర్ల" వంశరత్నములు

శ్రీ కోన వేంకటరాయశర్మ

తంజావూరు రాజ్యమును "ఏకోజీ" మహారాజు సుస్థిరతర మొనర్చి స్వర్లోక ప్రస్థానము సేసిన తర్వాత నతని జ్యేష్ఠపుత్త్రుడు 'శాహజీ' యనువాడు రాజ్యమునకు వచ్చి సారస్వతోపాసన మొనర్చుటకుం దగిన యవకాశము, విశ్రాంతి, గల్గి సంస్కృతాంధ్ర భాషల రెండిటిని గూలంకషముగా నభ్యసించి, యనుపమాన సాహితీవల్లభు డయ్యెను కావుననే కాబోలు ఇతని యాస్థానకవియగు 'విచిత్రరాయావతంసు' డనువా డీతని "సరససాహితీ లక్షణ విభుండు శాహజీ మహారాజు" అని పొగడియున్నాడు "కవిత సంగీత తానవృత్తి స్వరస్థాన రాగాంగ గాన క్రియాస్థాయి గమక ప్రబంధధాతుగాయన గణిత తానదర్ధాహకుండ" నని "విష్ణుపల్లకి సేవా ప్రబంధము" నను నాటకమున "శాహజీ" యుల్లేఖించియుండుటచే మనోజ్ఞకళ (Fine Arts) లనదగు కవితా గానకళలం దపారపాండిత్య మీతనికి గలదని యవగతమగుచున్నది

ఇమ్మహారాజు క్రీ. శ. 1684 వ సంవత్సరము మొదలు క్రీ. శ. 1710 వ సంవత్సరము వఱకు బరిపాలనము సేసియుండుటచే నీతని యాస్థానమున గాయకులకు బండితులకు గవిశేఖరులకు,- బోషణము గల్పించి యాశ్రయ మొసంగెను. "సదాశ్రయేణ శోభంతే పండితా వనితా లతా" యన్న యార్యోక్తి యిట సార్థకత జెందినదన వచ్చును. ఇనవంశప్రభూత్తంసుడగు నిమ్మహీపాలు నాస్థానమున 'ములికినాటి సీమ' నుండి యనగా నిప్పటి కడప, నెల్లూరు మండలములు గలసిన భూభాగము నుండి తరలివచ్చిన కాకర్ల గిరిరాజకవి, కాకర్ల వేంగన, లనగువారలు విలసిల్లుచుండిరి వీరు

"మార్తాండకుల మహామహీపాలు సభను
గీర్తికెక్కినవాడు గిరిరాజ సుకవి
సంగీత కళ రహస్యము గన్నవాడు వేంగనా
ర్యుండు వివేకధనుడు."

(Telugu manuscripts Catalogue, Saraswati Mahal, P 124)

"వేంగన" గాయక శిరోమణి గిరిరాజకవి కవితాపాటవము గల్గి రచయితలలో ననుపమానుండనియు, నప్రతిమప్రతిభావంతుండనియు - బ్రఖ్యాతి వహించినవాడు. గిరిరాజకవి "వాద విజయము, సర్వాంగ సుందర విలాసము" అను నాటకముల రచించి 'శాహజీ' మహారాజున కంకిత మొసంగెను. అంతియకాక 'శాహేంద్ర చరిత' మను యక్షగానమును రచించినాడు ఇయ్యక్షగాన గద్యమున

"కండచక్కెరలీలఁ గల్పించి రుచుల
గండు మీఱినయక్షగానంబు మిగుల

గరిమను గిరిరాజకవి రచియించె" నని గిరిరాజకవియే చెప్పికొని యున్నాడు ఇతని కవిత్వము సహజమాధుర్యముతో హృదయంగమమై యొప్పెడిని నాటకములలో స్వాభావిక వర్ణనలు, ప్రబంధపు బోకడలు,— విరివిగ గలవు నాయిక విరహము, ఎఱుకది సోది చెప్పుట, తర్వాత నాయికా నాయకుల వివాహము—లక్షణముగాఁ గల కవితాభాగమునే "కొరవంజి" యని యందురు. ఇబ్భాగము ననుసరించి వ్రాసిన కవిశేఖరులలో నితడు ప్రథముడు. "రాజమోహన కొరవంజి" యను గ్రంథమును రచించి 'గిరిరాజకవి' సాహితీవల్లభుండగు 'శాహజీ' మహారాజునకు గృతి యొసంగెను.

ఇదిగాక 'రాజకన్యాపరిణయము' నను నింకొక కొరవంజిని వ్రాసి మహారాజు మెప్పందెను. ఇందలి కథావస్తువు 'శాహమహారాజు' వాహ్యాళి వెడలుచుండగా జూచి రాజకన్నియ యొకర్తుక మహారాజును బ్రేమించె నను విషయమును ఆమెతలిదండ్రులు దెలిసికొని యామెను ఆ విద్యావల్లభున కొసంగి యుద్వాహ మొనర్తు రనునది. ఇక్కవితల్లజుడు రచించిన నాటకము లనేకము లున్నను నేడు మూఁడో నాలుగో అగపడుచుండుట దురదృష్ట మనక తప్పదు ఆంధ్రభాషాదౌర్భాగ్య మనక తీఱదు

శాహజీ మహారాజు సనిపోయిన తర్వాత నాతని తమ్ముడు 'శరభోజి' ప్రథమ రాజ్యవర్షములలో 'గిరిరాజకవి' యున్నట్లు లోకగద్యమున "గిరిరాజనుత లీల శరభోజిభూపాల" యని యుండుటవలన దెలియనగుచున్నది అంతియకాక అమ్మహారాజు పేర గృతిగా "లీలావతీ కళ్యాణము" అను నాటకము రచించెను. 'శాహజీ' యాస్థానమున 'గిరిరాజకవి'తో బాటు తేజరిల్లినవాడు 'విజయరాయావతంసకవి' యొకడు ఇతడును 'కాకర్లవంశ' రత్నమే! ఇతడు తెనుగున 'అభినయ దర్పణము' నను నాట్యశాస్త్రము రచించి యందలి గద్యలో "సలోహిత గోత్రాహోబళార్యపుత్త్రి కుల పావన గిరిరాజ కవి వరానుజ"—అని వ్రాసికొనియుండుటవలన ని వ్విజయరాయావతంస కవి లోహితసగోత్రుం డనియుఁ గిరిరాజకవి సోదరుండనియు, నహోబళుని పుత్త్రుండనియు, గులపావనుండనియుఁ దెలియనగుచున్నది.

ఈ నాట్యశాస్త్రమును 'ఖండోజీ' యను మహారాష్ట్ర సేనానికి గృతి యొసంగెను క్రీ శ 1711 వ సంవత్సరము మొదలు క్రీ శ. 1728 దవ సంవత్సరమువఱకు ననగా బదునేడేడులు 'శరభోజీ' మహారాజు రాజ్యభారము బూని, పరిపాలన మొనర్చి, పండిత ప్రకాండుల, గవితల్లజుల బెక్కుర బోషించి, విఖ్యాతి నందెను. ఇతడు రాజ్యారూఢుడైన తర్వాత గొలది సంవత్సరములు గిరిరాజకవి యీతని యాస్థానమున దేజరిల్లెను

ఇమ్మహారాజు కాలముననే త్యాగరాజు తన గాన సుధను వెదజల్లినాడు త్యాగరాజు జిహ్వాగ్రమున వెలయించిన కృతులుగాక 'నౌకా చరిత్రము, ప్రహ్లాదచరిత్రము' లను యక్షగానముల రెండిటిని విరచించినాడు ఇతని తండ్రి రామబ్రహ్మము. తల్లి శాంతాదేవి. ఇప్పుణ్య దంపతుల గర్భశుక్తి ముక్తాఫలమే యితడు. 'నౌకాచరిత్రము'లో

"కాకర్లాంబుధి చంద్రుడు శ్రీకరు
డగు త్యాగరాజ చిత్తనివేశా"
అని యుట్టంకించుటవలనను అందే
"మ్రొక్కెద దేశిక వరునకు
మ్రొక్కెద ధర్మార్థకామ మోక్షుదునకు నే
మ్రొక్కెద పదముల ననిశము
మ్రొక్కెద శ్రీరామకృష్ణ మోదాఖ్యునకున్"

—అని ప్రార్థించి యుండుటచేతను, ఇతడు కాకర్లవంశాంబుధి చంద్రుడనియు, శ్రీరామకృష్ణానందము శిష్యు డనియు, విదితమగుచున్నది సంస్కృతాంధ్రములలో గూలంకషమైన ప్రజ్ఞాప్రాభవములు, శక్తియుక్తులు, త్యాగరాజునకు గలవు. పండితకవి వంశమున జన్మించిన యమ్మహామహునకివి యొక లెక్కయా? ప్రహ్లాదభక్తవిజయమున నైదవ యంకము ముగిసిన తర్వాత మంగళము నొక కృతి రూపమున జెప్పి పిదప ఫలశ్రుతిని—

"శ్రీరామబ్రహ్మతనయ
త్యాగరాజేన నిర్మితం
ప్రహ్లాదభక్తవిజయ
ప్రబంధం భుక్తిముక్తిదం,
యే గాయంతి సదా భక్త్యా
యే శృణ్వంతి చ శ్రద్ధయా
యే పఠంతి సదా ప్రీత్యా
తేషాం సర్వాఘనాశనం"

—అని చెప్పినాడు ఈ విధముగ 'నౌకా చరిత్రము' వ్రాయబడలేదు. కాని యందు మంగళము నొక కీర్తన రూపమున జెప్పి యావల ఫలశ్రుతిని—

"త్యాగరాజకృతాం పుణ్యాం
కథాం సాధు మనోహరాం,
యే శృణ్వంతి నరా లోకే
తేషాం కృష్ణః ప్రసీదతి"

—అని చెప్పినాడు ఈ రెండు కృతుల లోను సంగీత సంప్రదాయమును మాత్రము వీడక రాగతాళాది రసభావ బంధురతచే గృతి భర్తయగు నప్పరమాత్మున అలరింపగల శక్తశాలియగును నిరంతర మా మహనీయుని లీలా విలాసముల నెన్నికొనుచు, వానిం గృతుల రూపమున, నిట్టి రూపకముల రూపమున వెలువరించినాడని విదిత మగుచున్నది

ఇతివృత్తమును గృత్యాగని గృతిపతికి నొసంగించి యనిశంబు నిది పుష్పహారముగా "దనివార ధరియించు ధరసుతారమణ" యని యర్పించినాడు ఇతడు తోచిన విధముగా షాడకయు రాగతాళగతులను షాడవతో నను మసందేశ మొసంగినాడు రసపోషణమున నీతని దందెవేసిన చేయి అందునను భక్తిరసమున నితని శక్తి యనల్పము స్వాభావికపదములనయి సందర్భముల బ్రయోగించుటలో నితడు కడు దిట్ట శృంగార రసప్రధానమైన నాటకమును రచించి భావమునకు శబ్దములకు నొసంగిన ప్రాధాన్యము, నల నట చందస్సును గూడ నిర్లక్ష్య మొనర్చిన విషయమును గమనించినచో నీత డనిర్వాచ్యమగు నోంకార మను నాదబ్రహ్మోపాసకుడై సంగీత సుధను అడ్డమాకలు లేకుండ లోకముపై నొలికించి బ్రహ్మానంద రసాస్వాదనమును నొడలెఱుగకుండ దన్మయత గలిగించిన ప్రౌడయని తెలియందగును.

పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల ప్రాణికోటి కెయ్యది యానందదాయకమో యక్షరత్రయాత్మకము, పరబ్రహ్మస్వరూపము, శ్రుతి స్మృతులకు మూలకందము నగు నోంకార ప్రతిపాదితమై సామవేదరూపమ్మున నెయ్యది చతుర్ముఖునుండి యభివ్యక్తమయ్యెనో తుంబుర నారదాది మహాభాగులెద్దానిచే మోక్షసామ్రాజ్య భద్రాసనాసీనులయి వెలింగిరో,—అట్టి సంగీత ప్రావిత్ర్యము నుగ్గడింప నేరి తరము?

గీతి గానముచే యోగము సిద్ధించు ననియు, శివైక్యము యోగమునగాని కలుగదనియు, సంగీత కళారహస్యనిధి యోగముతో నుండిన యెడల బరమేశ్వరుని జేరగల డనియు, యజ్ఞదాన జపాదులన్నియు ధర్మార్థకామములను మాత్రమే యొనగూర్పగలవు గాని సంగీతము మోక్షమును గూడ జేకూర్పగలదనియు,—నూత సంహిత లోనగునవి యుద్ఘోషించుచున్నవి శ్రీకృష్ణ పరమాత్మ "మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద"—అని చెప్పినట్టు త్యాగరాజాది సంగీత సమ్రాట్టు లప్పరమాత్మను గానరూపమున గీర్తించి సంగీత జ్ఞానము లేనివారలకు మోక్షము లేదని చాటి నిరస్తాఖిలకర్మబంధులై చిరస్థ బ్రహ్మానందము ననుభవించుచు—

"సంగీత శాస్త్రజ్ఞానము సారూప్య
సౌఖ్యదమే మనసా"

యని వాక్రుచ్చినారలు గీత, వాద్య, నృత్య, శ్రుతి, సమ్మేళనమే సంగీత మనియు, నాదము వలన శ్రుతియు, నందువలన షడ్జాది స్వరములును, వానిమూలమున రాగమును, నందువలన గీతమును, గలుగుచున్న వగుటచే గీతము నాదాత్మక మనియు, దెలియుచున్నది

జగత్తు వాగ్వ్యవహారమైన దౌట నాదాధీనమై యొప్పెడిని నాదస్వరూపులయిన త్రిమూర్తులు నాదోపాస్తిచే నుపాసితు లగుచున్నారు. పవిత్రమైన యీ నాదము బ్రహ్మానందసంధాయకమై స్థైర్య మొడగూర్చుచుండును మంత్రోచ్చారణమున సపస్వర మెట్టు లనర్థదాయకమో సంగీతము నందును అపస్వర మట్టి యనర్థదాయకమే యగును పింగళి సూరనామత్యుడు దన 'కళాపూర్ణోదయము' లో—


"నీ సంగీత విశేషా
భ్యాసము సఫలముగ విష్ణుబరమేశ్వరు న
త్యాసక్తితోడఁ బాడుచు
వేసరక భజింపు మెల్ల వేళలయందున్"
"విద్యలం దెల్ల సంగీతవిద్య మిగుల
నత్తమముగాదె యిదే పురుషోత్తమునకు
నర్పితం బుసేని నేమని నుతింతు
"

— అని యుల్లేఖించుటవలన నప్పరమేశ్వరుడీ సంగీతమును భక్తిరసము నింపొంగించుటకే యనుగ్రహించెనని యవగతమగుచున్నది ఇప్పరమార్థము గ్రహియించియే లోకోత్తర పురుషుండగు త్యాగరాజు తన సంగీతమును బురుషోత్తమునకే యంకిత మొనర్చి చరితార్థుడైనాడు. ఆంధ్రభాషలో నున్న యీతని కృతులు ద్రమిళ కర్ణాట, దేశీయుల సంగీతవిద్వాంసులనుగా దిద్ది యహరహ మారాధ్యము లగుచున్నవి. భక్తి, జ్ఞాన, వైరాగ్య, నైతిక సంపత్తిని వెలార్చు నిమ్మహాత్ముని కృతు లసంఖ్యాకములు రత్నాకరమున రత్నముల నేరినట్టులే యగు.

గిరిరాజకవి వంశీయుడే యగు కాకర్ల కలిగిరి కవిని బోషించి యాదరించినవాడు 'ఖండోజి' యను మహారాష్ట్ర సేనాని. ఈ 'ఖండోజి' సేనాని కాకర్ల విజయరాయావతంసకవి రచించిన 'అభినయ దర్పణము' నను గ్రంథమును గృతినందినవాడు 'సప్తసంతానములోన ధాత్రి గృతియె కాన' యనినాడు పెద్దనార్యుని జూచి రాయలు

కలిగిరి కవి "రుక్మాంగద చరిత్రము" ననునేకాదశీమాహాత్మ్యమును 'ఖండోజి' సేనాని ప్రోత్సాహ సాహాయ్యములవలన దెనుగున ద్విపద కావ్యముగా రచించి విశ్రుతకీర్తిశాలి యయ్యెను తెనుగుభాష తేనె తెరలవంటి దనియు, దానికి గల శ్రవణపేయమ్మగు శబ్దమాధుర్య మే యితరభాషలకు లేదనియు గాకర్ల కలిగిరి కవి చాటినాడు అంతియకాక ఇష్టదైవతమును వాగ్దేవతారూపమున ధ్యానించిన ఫలము కలుగునను శ్రీ శంకరభగవత్పూజ్యపాదుల యుపదేశము నాదేశముగా బరిగణించినాడు తేజోరూపము భగవంతుని దని "జ్యోతిః పరం ధ్యాయతామ్" అని ధ్యానించుచుండువాడని యాతని గ్రంథ మవగత మొనర్చుచున్నది.

ఇట్టి కవి, పండితు లా దినములలో 'ములికినాటి సీమ' నుండి వెడలుటచే దంజావూరు ప్రాంతముల నివ్వంశ్యులను ములికినాటి బ్రాహ్మణులని పిలువసాగిరి. కాని వీ రందఱు వేలనియోగి బ్రాహ్మణులే! నెల్లూరు, కడప మండలములు ములికినాటి సీమకు జెందినవి ఇప్పటికిని నెల్లూరు మండలమున నీ గృహనామము గలవారు నియోగిబ్రాహ్మణులు గలరు. ఇమ్మహాత్ములకు నా నమోవాకములు



బెజవాడ లక్ష్మీటాకీసులో 'రత్నమాల' చిత్రం శతప్రదర్శనోత్సవం జరుపుకొన్నప్పుడు తీసినచిత్రం.

మానసిక శాస్త్ర విశేషాలు :

జ్ఞానవ్యాపారము

— శ్రీ పారనంది జగన్నాథస్వామి

త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వా ఘ్రాణములు జ్ఞానేంద్రియములు. స్పర్శరూప శబ్ద రస గంధములు ఆ జ్ఞానేంద్రియ వ్యాపార ఫలితములు. సాక్షాత్తుగ పదార్థ-ఇంద్రియ-సంబంధమువలన స్పర్శరసగంధవ్యాపారాలు సంభవిస్తవి. తేజస్సు వాయువుల సాహాయ్యమున రూపశబ్దముల బోధ కలుగుతుంది.

అన్నిటిలోనూకూడా ఇంద్రియముపై సంస్కారము కలగగానే, ఆ సంస్కారము ఆ ఇంద్రియమందున్న నరముద్వారా మెదడుకు పోయి, అక్కడ భావనగ మారుతుంది. ఈ మార్పు ఎట్లు జరుగుతుందో మనకు సరిగా తెలియదు. అనగా శరీరగతమైన ఇంద్రియసంస్కారము మనోగతమైన భావనగ పరిణమిస్తున్నది. ఇక్కడే మన శరీరముల సంబంధము. ఇంద్రియ సంస్కారములకున్నూ వాటికి కారణము లైన వస్తువులకున్నూ గల సంబంధముచేత సంస్కారము కలగగానే, దానిని కలుగజేసిన వస్తువున్నదనే బోధ కలుగును; అనగా ఆ వస్తువును నిరూపించు ప్రతిమలను (image) మనస్సు కల్పిస్తుంది; ఆ ప్రతిమలనే భావములు (concept, idea) అందుము. ఈ ప్రతిమాభావనలు ఎంతవరకు వస్తువుతో సరిపోవుచుండునో అంతవరకు వాటి తథ్యము నిర్ణయింపబడుచుండును.

ఇదివరకు మనకు తెలిసిన వస్తువులతో ప్రతీ క్రొత్త వస్తువును సరిజూస్తూ, వాటికి గల సామ్యభేదములను అనుసరించి వర్గకరణము చేస్తూ, వస్తువులను తెలుసుకొంటూ ఉందుము. వస్తువును జూచి ఇది కుర్చీ, బల్లా, మేజా, అని పూర్వపరిచయము ఉపయోగించి ఆ క్రొత్తవస్తువు యొక్క వర్గమును నిర్ణయిస్తాము. ఒక క్రొత్త వస్తువు మొట్టమొదటిసారి మన అనుభవములోనికి వచ్చినపుడు ఇట్టి సాదృశ్యగ్రహణముద్వారా మన పూర్వానుభవములో అన్న ఏ భావనకు (concept) అది సరియగునో కనిపెట్ట యత్నింతుము. అన్ని విధముల పూర్ణముగా సరిపడు భావన దొరకనపుడు, ఇంచుమించుగా సరిపడిన వర్గములో చేర్చి, ఆ వర్గములో దీనికొరకు ఒక అంతర్భాగము చేసి, దీనికిని మిగిలిన అంతర్భాగాలకును గల ముఖ్యవిషయాలలో సామ్యాన్ని అప్రధానాలలో భేదాన్ని చూచి, జ్ఞానప్రవృత్తిని నడుపుచుందుము. ఒక ఉదాహరణ. ఒక క్రొత్తదేశానికి వెళ్లినప్పుడు, అక్కడొక క్రొత్త వస్తువు కనబడినది అనుకోండి. అప్పుడు మనకు ఇదివరకు తెలిసియున్న వస్తువర్గములలో దేనివలె అది ఉన్నదో తెలుసుకొన ప్రయత్నిస్తాము. అది కదులుచుండుట చూచి దానిని జంతువని నిశ్చయింతుము. దాని కాళ్లు దాని చర్మముపై నున్న వెంట్రుకలు చూచి దానిని మృగము అందుము. తిన్నగా నిలబడియుండుట చేతులో ఆయుధము గిండుటచూచి, మనుష్యజాతిలక్షణాలు అతియున్నట్లు భావింతుము. ఈ వ్యక్తియొక్క శరీరవర్ణము మనము ఇదివరకు తెలిసియున్న మనుష్యజాతుల శరీరవర్ణముకంటె భిన్నముగా అన్నందున, ఈ వస్తువు మనిషేనా అని శంకించి, తర్కించి; ఇది మనుష్యజాతిలో ఒక అంతర్భాగానికి చెందినట్లు నిశ్చయించి, అట్టి అసాధారణ స్థానమును తెలియబరచే పేరు పెట్టి, జ్ఞానవ్యాపారాన్ని నడుపుతాము. ఆతరువాత మరొకప్పుడు అనగా ఇట్టి వస్తువు తిరిగి కనబడ్డప్పుడు, దానికొరకు ఒక క్రొత్త అంతర్భాగము చేయకుండా ఇంతకుముందు సిద్ధమైయున్న అంతర్భాగమునకే ఈ వస్తువునుకూడా చేర్చుదుము. ఇది వరకే దీని గురించి నాకు తెలుసును అని భావింతుము.

అందుచేత జ్ఞానవ్యాపారము వస్తువర్గీకరణమే అని చెప్పవచ్చును. ఎప్పుడైతే మన కున్న భావనలలో ఒక భావనకు ఒక వస్తువును చెందచేయుదుమో, అప్పుడు ఆ వస్తువుగురించి మనకు తెలిసినది, దానిగురించి జ్ఞానము కలిగినది, అన్న అనుభవము మనకు కలుగును.

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

అప్పుడప్పుడు అద్దంలో చూసుకొంటూ, మెడమీద రుమాలుతో రాసుకుంటూ. మెడమీద ఇంకా అస్పర్శవేడిగా ఆమెకు తగులుతోంది. ఆమెను ఆమె ప్రశ్నించుకుంది — ఎందుకు బజరోవ్ చేత ఆమాటలు బలవంతంగా ఇవతలికి లాగిందా? ఆమె! తను అవిషయమయి అనుమానించలేదా?......"నాదేతప్పు," పైకే తన నిశ్చయాన్ని వ్యక్తపరచింది. "కాని ఇల్లా జరుగుతుందని ఎల్లా ఊహించడం?" ఆమె ఊహల్లో మునిగిపోయింది, బజరోవ్ ఆమెవేపు వచ్చినప్పుడు అతని ముఖంలో మూర్తీభవించిన పశుశక్తిని తలుచుకుంటే ఆమెచెక్కిలు ఎర్రబారాయి.

"ఆ" అంది ఆమె పెకిగట్టిగా. తన ముంగురులు వెనక్కి తీసుకుంది. అద్దంలో తనముఖం చూసుకుంది. తల వెనక్కి విసిరింది. సగం తెరచుకుని, సగం ముడుచుకున్న కళ్లమీద, పెదవులమీద వింత చిరునవ్వు పాకింది. ఆ చిరునవ్వులో ఆమెను అందోళన పరుస్తున్న ఏదో తళుక్కుమని మెరిసింది.

"వీల్లేదు," ఆమె చివరికి నిశ్చయించుకుంది, "దీని పర్యవసానం ఏమవుతుందో ఎవరికి తెలుసును! అతనితో చెలగాట ప్రమాదకరం. ఏమయినా ప్రశాంతంగా బ్రతకడమే ఉత్తమం."

ఆమె హృదయ శాంతి చెడిరిపోలేదు, కాని ఆమెను విషాదం ఆవరించింది. కొద్దిగా ఆమెకళ్లు చెమ్మగిల్లాయికూడా, ఎందుకోమాత్రం ఆమెకు తెలియదు — ఆమెకు జరిగిన అత్యాచారానికి మాత్రం కాదు. ఆమె యెడల అత్యాచారం జరిగిందని ఆమె అనుకోడంలేదు; పైగా తనేదో తప్పుచేసినట్లు అనిపించింది ఆమెకు. అస్పష్టమయినఅనేక ఉద్రేకాలు ఆమెను ఆవహించాయి; జీవితం జారిపోతూన్నట్టు, కొత్త అనుభవాలకోసం తహతహ పడుతున్నట్టు. కొంతవరకు ఆమె తన్ను తాను మరిచిపోయి ఒక దారిని పట్టింది; తన వెనకటి జీవితంవేపు బలవంతంగా మనస్సును తిప్పింది. ఆవెనక ఉన్నది పెద్ద అఖాతమయినా కాదు, వట్టిశూన్యం ... వెగటు గొలిపే శూన్యం.

౧౯

ఓడిన్ట్సోవ్ సతికి ఎంత మనోనిగ్రహ మున్నా ఎటువంటి దుర్భ్రమలనీ ఆమె మనస్సులో చేరనీయకపోయినా, భోజన సమయంలో ఆమె నలుగురితోటీ కూర్చున్నప్పుడు కొంత అస్థిమితం ఆమెలో వ్యక్తమయింది. అయినా భోజనం సవ్యంగానే నడిచిపోయింది. ప్రోఫిరీప్లాటొనొవిచ్ ఏవో రకరకాల కథలు చెప్పాడు; అతడు అప్పుడే పట్టణంనించి తిరిగి వచ్చాడు. అనేక విషయాలను గురించి చెపుతూ, రాష్ట్రాధికారి తన రహస్య కార్యదర్శులను గుర్రపుస్వారికి తయారుగా ఉండమని శాసించాడని చెప్పాడు. ఆర్కాడీ మెల్లగా కాట్యాతో సంభాషిస్తున్నాడు; అప్పుడప్పుడు ముసలి రాకుమారికి కావలసినది అందిస్తున్నాడు ఆమె మంచి అభిప్రాయాన్ని సంపాదించడానికి. బజరోవ్ గంభీరమయిన మౌన ముద్రవహించి కూర్చున్నాడు. ఓడిన్ట్సోవ్ సతి రెండుసార్లు అతనివేపుచూసింది; చాటుగా కాదు. అతని ముఖంలోకి తిన్నగా. ఆమె వెగటుగా, నిషేధిస్తూ, అసహ్యంతో బిగిసిపోయి క్రిందకు చూస్తోంది. ప్రతిరేఖలోనూ, "వద్దు...వద్దు"అనేభావం వ్యక్తపరుస్తోంది. భోజనమయిన తరువాత అందరూ తోటలోకి వెళ్ళారు. బజరోవ్ ఏదో తనతో చెప్పాలనుకుంటున్నాడని గ్రహించి ఆమెపక్కకి నాలుగు అడుగులువేసి నిలబడింది. అతడు ఆమెదగ్గరకు వెళ్ళాడు. అప్పుడుకూడా అతడు ముఖం ఎత్తలేదు. బొంగురుగా అన్నాడు.

"అనాసర్గీవ్నా, మిమ్మల్ని క్షమార్పణ వేడుకోవాలి. నామీద చాలా కోపంగా ఉండాలి మీకు."

"లేదు. నాకు కోపంలేదు. యవ్‌గనీ వాసిలిచ్," ఓడిన్ట్సోవ్ సతి జవాబుచెప్పింది; "నాకు విచారంగాఉందిఅంతే."

"అది మరీ అర్థాన్నం. ఏమయినా నాకు చాలా శాస్తిజరిగింది. నా పరిస్థితి చాలా అసందర్భంగా ఉందన్న సంగతి మీరూ ఒప్పుకుంటారు. ఎందుకు వెళ్ళిపోవడం?'—అని మీరు వ్రాశారు. కాని నేను ఉండలేను. ఉండాలని లేదుకూడా. రేపు నేను వెళ్ళిపోతాను."

"యవ్‌గనీ వాచిలిచ్, ఎందుకు మీరు...."

"ఎందుకు వెళ్ళిపోతున్నాననా?"

"అబ్బే, అదికాదు నేను అంటున్నది."

"గతాన్నిగురించి తిరిగి ఆలోచించిలాభంలేదు అనాసర్గీవ్నా...ఎప్పుడో ఒకప్పుడు ఇల్లాజరగక తప్పదు. అంచేత నేను వెళ్లిపోవాలి. నే నిక్కడుండాలంటే ఒకటే జరగాలి—కాని అది ఎన్నడూ జరగదు. నా మొరటుతనాన్ని మన్నించండి, మీకు నామీద ప్రేమలేదు. ఎన్నడూ నన్ను ప్రేమించలేరేమో కూడా?"

బజరోవ్ కళ్ళు, ఒక క్షణంపాటు, నల్లటి కనుబొమల క్రింద మెరిశాయి.

అనాసర్గీవ్నా అతనికి జవాబు చెప్పలేదు. "ఈ మనిషిని చూస్తే నాకు భయంగా ఉంది," అన్న ఊహ ఆమె మనస్సులో మెరుపులా వచ్చిపోయింది.

"అయితే శలవు," అన్నాడు బజరోవ్, ఆమె ఊహను అర్థంచేసుకొన్నట్టు. ఇంట్లోకి తిరిగి వెళ్లిపోయాడు.

అనా సర్గీవ్నా అతను వెళ్లినదారినే నెమ్మదిగా నడిచింది. కాట్యాన్ని పిలిచి ఆమె చెయ్యి పట్టుకుంది. సాయంకాలందాకా ఆమెను వదలిపెట్టలేదు. ఆవేళ ఆమె పేక ఆడలేదు. అస్తమానం పెద్దగా నవ్వుతూ కూర్చుంది. ఆ నవ్వు కరిగిపోయి పాలిపోయి ఆమె ముఖవర్చస్సుతో ఎక్కడా సరిపడలేదు. ఆర్కాడీ ఆందోళనలో పడిపోయాడు. అతని వయస్సులో ఉన్న యువకులంతా ఎల్లా చూస్తారో, అల్లాగే తెల్లబోయి ఆమెవేపు చూస్తూకూర్చున్నాడు — అంటే ఈ ప్రశ్న అతని మనస్సులో నిత్యమూ ప్రత్యక్షమవుతోంది, "ఏమిటి దీనికంతకి అర్థం?"—బజరోవ్ తనగదిలో తలుపులు మూసుకుని కూర్చున్నాడు. కాని టీవేళకు క్రిందకు దిగివచ్చాడు. అనా సర్గీవ్నాకు అతనితో ఎల్లాగయినా స్నేహపూర్వకంగా మాట్లాడాలని ఉంది, కాని అతనితో ఎల్లా మాట్లాడ్డమో ఆమెకు తెలియలేదు.

అనుకోని ఒకసంఘటన ఆమె ఆందోళనను తొలగించింది; సిట్నికోవ్ వచ్చాడని ఒక సేవకుడు చెప్పిపోయాడు.

లోపలికి వచ్చిన సందర్భంలో ఆ యువక అభ్యుదయ మత ప్రవక్త ఎంత వింతగా అగుపించాడో సరిగ్గా మాటల్లో వర్ణించడం చాలా కష్టం. తన ముఖ్య స్నేహితులిద్దరు అక్కడ ఉన్నారనే మిషమీద, ఆహ్వానం లేకపోయినా సరే, తనకు అట్టే పరిచయంలేని ఒకస్త్రీ ఇంటికి, ఇంతదూరం ప్రయాణంచేసి రావడానికి అతనికి ఎంతో నిర్లజ్జ ఉండాలి. కాని లోపలికి అడుగుపెట్టేక్షణంలో అతని శరీరంలో ప్రతి అణువూ వణికిపోతోంది. తను వ్యక్తపరచాలనుకుని కంఠస్థంచేసిన క్షమార్పణలూ, అభినందనాలు పూర్తిగా మరచిపోయి, తనని ఇవ్‌డోక్స్యాకుక్షిన్, అనాసర్గీవ్నా ఆరోగ్యాన్నిగురించి తెలుసుకురమ్మని పంపిందని అర్థంలేని కారణం గొణిగి ఊరుకున్నాడు; ఆర్కాడీ నికోలాయివిచ్ ఆరోగ్యాన్ని గురించికూడా అడిగిందన్నాడు, అతనంటే ఆమెకు అమితగౌరవమట......అంతవరకూ చెప్పినతరవాత అతను తడబడ్డాడు. మనస్సు పూర్తిగా గందరగోళంలో పడిపోతూ, తన టోపీమీదే తను చటుకుని కూర్చున్నాడు. కాని, అతన్ని ఎవరూ పొమ్మనలేదు. అనా సర్గీవ్నా అతన్ని తన పినతల్లికీ, చెల్లెలికీకూడా పరిచయంచేసింది. దానితో కొంత స్థిమితపడి పెద్దగా మాట్లాడ్డం ప్రారంభించాడు.

ఎందుకూ కొరగాని ఒక వ్యక్తి రాకవల్ల కొన్ని సావకాశాలు సాధారణంగా కలుగుతాయి; వ్యక్తులమధ్య ఏర్పడ్డ బాధాకరమయిన ఒత్తిడి కొంత తగ్గుతుంది. ఆత్మను బంధించేవి, ఆత్మను దహించేవి ఉద్రేకాలు శాంతిస్తాయి; ఆ ఉద్రేకాలకూ ఆ వచ్చినవ్యక్తియొక్క మూర్ఖతకూ ఉన్న సామ్యం తక్కినవారికి తెలివిని కలగజేస్తుంది. సిట్నికోవ్ రాకవల్ల ప్రతిదీ తేలికయి

(22 వ పేజీ చూడుడు)

భారతరాజకీయాలు.

హైదరాబాద్‌తో మరొక ఒడంబడిక సంభవమా?

బట్టలపై తిరిగి కంట్రోల్‌కు ప్రభుత్వ సంసిద్ధత

భద్రతామండలిచే నియమింపబడిన ఉప సంఘము త్వరలోనే కాశ్మీర్ రానున్నది. ఈ సంఘములో అమెరికా, ప్రతినిధిగా బర్మాలోని అమెరికన్ రాయబారి హప్టిల్ నియమింపబడెను. ఇంకటితో సంఘసభ్యులందరి నియామకము పూర్తియైనది. ఈ సంఘమునకు సహాయము చేయుటకు కావలసిన ఇతరసిబ్బందిని కూడ, ఐక్యరాజ్యసమితి సిబ్బందినుండి ఏరి, నియమించిరి. స్థానికముగా మరి కొందరినికూడ అవసరమునుబట్టి నియమించుకొందురట.

వీలైనంతత్వరలో కాశ్మీర్‌కు బయలుదేరి వెళ్లవలసినదని కాశ్మీర్ ఉపసంఘమును ఆదేశించుచు భద్రతామండలి చేసిన తీర్మానము ఏమాత్రము అంగీకారయోగ్యము గాలేదు. కాశ్మీర్ సమస్యను గురించి విచారించుటగాక జునాగఢ్, ముస్లింజాతి హత్య, ఒడంబడికలను నిర్లక్ష్యము చేయుట మొదలగు విషయములను గూర్చి కూడ విచారించవలెనని ఈ సంఘము ఆదేశింపబడినది. ఈ విషయములను గురించి భద్రతామండలి సరిగా ఆలోచించనైన ఆలోచించలేదు. ఇవి అంతర్జాతీయ శాంతికి భంగకరము లగునో కావో నిర్ణయింపలేదు. పైగా, ఈ ఆరోపణలు కేవలము అసత్యములు. ముస్లిం జాతి హత్యకు భారత ప్రభుత్వము ప్రోత్సహించినదట! అసలు జరిగినది హిందూజాతిహత్యకు ముస్లింలీగ్ ప్రయత్నము. ముందు కొట్లాటలు ప్రారంభించినది కలకత్తా ముస్లింలే. ఆగష్టు 15వ తేదీ తర్వాత పంజాబ్‌లో సంక్షోభము ముందు ప్రారంభించినది పశ్చిమపంజాబ్ ముస్లింలే. ఇవి కప్పిపుచ్చుటకే పాకిస్థాన్ భారతప్రభుత్వముపై ఎదురు ఫిర్యాదు చేసినది. ఒడంబడికలను నిర్లక్ష్యము చేసినదికూడ ముఖ్యముగ పాకిస్థానే. అయినను భారతప్రభుత్వముపై ఫిర్యాదు తప్పలేదు. ఈ కృత్రిమ ఫిర్యాదులను విచారించుచు భద్రతామండలి కాలహరణము చేయవలెనని పాకిస్థాన్ అభిలాష.

భద్రతామండలి కాశ్మీర్ ఉపసంఘము ఈ విషయములన్నింటిని విచారించుటకు తన తీవ్ర అధిక్షేపణను పండిత నెహ్రూ భద్రతామండలి అధ్యక్షునకు తెలియజేసెను. భద్రతామండలి సంఘము ఏయే విషయములను గురించి భారత ప్రభుత్వముతో సంప్రదింపదలచినదీ ముందుగా తమకు తెలియజేయవలెననీ, ఇదివరకు తెలియజేసిన అధిక్షేపణలకు లోబడియే తాము ఆసంఘముతో సహకరింతుమనీ ఆయన స్పష్టపరచెను. భద్రతామండలియెట్లు పండిట్ నెహ్రూ ఇప్పటికైనను ఒక నిర్దిష్టవిధానమును అనుసరించుచుండుట హర్షదాయకము.

కాశ్మీర్‌లో భారతసేనల పురోగమనము చురుకుగ జరుగుచున్నది. అన్ని రంగాలలోను దుండగులు పారిపోవుచున్నారు. యుద్ధము ఇంకను కొండ ప్రాంతములలోనే జరుగుచుండుట వలనను, కొండలోయలలో ప్రవహించుచున్న షట్లెజ్ నదిపై వంతెనలను దుండగులు నాశనము చేసియుండుటవలనను భారతసేనల పురోగమనము చాల నెమ్మదిగానే జరుగుచున్నది. అయినను శీతాకాలముకోవలెగాక ఇప్పుడు పురోగమనము జరుగుచున్నది. దుండగుల నైతికబలము కొన్నాళ్లనుండి క్షీణించిపోవుచున్నది. పాకిస్థాన్ ప్రత్యక్షముగా సహాయము చేయనిచో తాము దండయాత్ర విరమింపవలసివచ్చునని వీరు పాకిస్థాన్ అధికారులకు తెలియజేసినటు ఇదివరకే వార్తలు వచ్చుచుండెను. పాకిస్థాన్ సేనలు ఇప్పుడు కాశ్మీర్ యుద్ధరంగంలో వాస్తవముగ పాల్గొనుచున్నవన్న ఎవ్వరూ అభ్యంతరపడ వక్కరలేదు. పాకిస్థాన్ సేనలే పాల్గొనక పోయిన, కాశ్మీర్ ఉపసంఘము అచ్చటికి చేరునప్పటికి కాశ్మీర్‌లో ఒక్క దుండగుడుకూడ వుండకపోవచ్చును; ఆ సంఘము పాకిస్థాన్‌కు సహాయము చేయు అవకాశమే వుండక పోవచ్చును!

నిజాంతో మరొక ఒడంబడిక సంభవమా?

నిజాంతో మరొక ఒడంబడిక కుదురు అవకాశమును గురించి అనేకవిధముల ఊహాగానము జరుగుచున్నది. హైదరాబాద్ ప్రధాని మీర్ లాయక్‌అలీ ఢిల్లీనుండి తెచ్చిన షరతులను నిజాం మంత్రివర్గము అనేక పర్యాయములు చర్చించినది. ఇత్తెహాద్ ముస్లిమ్ ఉలమా సంఘముకూడ సమావేశమై ఈ షరతులనుగూర్చి ఆలోచించినది. భారత ప్రభుత్వము సూచించిన షరతులపై ఒడంబడిక కుదుర్చుకొనుటకు మజ్లిస్ సభ్యులు, మంత్రివర్గ సభ్యులుకూడ ఇష్టపడుట లేదు. నిజాం సలహాదారగు సర్ వాల్టర్ మాంక్టన్ హైదరాబాదు వచ్చి, నిజాంతోను, మంత్రివర్గముతోను సంప్రదింపులు జరుపుచున్నాడు. త్వరలోనే లాయక్-అలీ తిరిగి ఢిల్లీ వెళ్ళి, ఒడంబడిక విషయమై ఏదో తేల్చి చెప్ప వేయుగలడు.

భారత ప్రభుత్వము సూచించిన షరతులు అధికసంఖ్యాకులగు హిందువులకు ఏమంత లాభకారిగా లేవు. సంస్థాన మంత్రివర్గములోను, శాసనసభలోను, ప్రభుత్వోద్యోగములలోను హిందువులకు, ముస్లిములకు సమాన ప్రాతినిధ్యమిచ్చుటకు నిజాం ఎన్నాళ్ళనుండియో అంగీకరించుచున్నాడు. నూటకి 90 వంతులున్న హిందువులకు నూటికి 60 వంతులు ప్రాతినిధ్యమున్ను, నూటికి 10 వంతులున్న ముస్లిములకు నూటికి 40 వంతులు ప్రాతినిధ్యమిచ్చుటకున్న అంగీకరించవలసినది భారత ప్రభుత్వము నిజాంకు సూచించినది. దీనిని అంగీకరించుటకే ముస్లిములు నిరాకరించుచున్నారు. వాస్తవమునకు సూచన హైదరాబాద్ హిందువులకు ఎంతేని నష్టదాయకము. ఇప్పటివరకు వారు ముస్లిం ఆధిపత్యమున కడు నష్టపడియున్నారు. భారతదేశము స్వాతంత్ర్యము నొందుటతో తమ కష్టములు గట్టెక్కునని వారు భారత యూనియన్ వంక ఆశగా చూచుచున్నారు. ఇప్పుడు చట్టబద్ధముగా ముస్లిములకు 40 వంతుల ప్రాతినిధ్యము లభించినచో ఇక వీరికి రక్షణమే వుండదు.

శాసనసభలోను, మంత్రివర్గములోను మతముల నిష్పత్తి నిర్ణయింపబడుటవే బాధ్యతాయుత ప్రభుత్వము సక్రమముగ వ్యవహరింపజాలదు. ప్రధానమంత్రి ఇతర మంత్రులను తన చెప్పుచేతలలో నుంచుకొనలేడు. ఇతర శాఖల నిర్వహణలో ప్రధానికి ఇష్టము లేనివెన్నో జరుగవచ్చును. ఇదివరకు కేంద్ర ప్రభుత్వములో కాంగ్రెస్-లీగ్ సంయుక్తమంత్రివర్గ మున్నప్పటి పరిస్థితియే తిరిగి ఏర్పడును. చివరకు ప్రతివిషయముపైనను మంత్రులందరిపై నిజాం పెత్తనము చేయవలసివచ్చును. ఇట్టి ప్రభుత్వములో పాల్గొనుటకు ప్రజాప్రతినిధు లెవ్వరును అంగీకరింపరు. హైదరాబాద్ రాజ్యాంగ చట్టమును రచియింపవలసినది హైదరాబాద్ ప్రజాపరిషత్తేగాని భారత-నిజాం ప్రభుత్వములు కావు. నిజాంతో ఇటువంటి ఒడంబడిక చేసుకొనకుండుటయే మొత్తముమీద, మంచి దని చెప్పవలెను.

సెకండరీ విద్యావిధానమును సంస్కరించవలెనని మద్రాసుప్రభుత్వము గత రెండేండ్లనుండి ఆలోచించుచున్నది. ఆ మార్పులను సూచించుచు ఉన్నతవిద్యాసంఘము, రాష్ట్రవిద్యాసలహా సంఘము తయారుచేసిన ప్రణాళికలను ఆలోచించి, ప్రభుత్వము ఇప్పుడు కొన్ని నిర్ణయములు చేసినది. నూతన విధానము క్రొత్త సంవత్సరంనుండి క్రమేణా అమలులోనికి రాగలదు.

ప్రాథమిక విద్యానంతరము విద్యార్థులకు వృత్తివిద్యాశిక్షణకూడ అవసరమని కాంగ్రెసు నాయకులని చాల రోజులనుండి చెప్పుచునే యున్నారు. ఆవిధముగానే ఇకముందు ఒకటవ ఫారంనుండి కూడ వృత్తివిద్య గరుపబడును. ఇకముందు హైస్కూళ్ళలో మూడురకముల ఉన్నత విద్య బోధింపబడును. ఇందు మొదటిది వృత్తివిద్య. ఈ విధానముప్రకారము వృత్తివిద్య నభ్యసించువారు ఉన్నత పాఠశాల చదువు పూర్తిచేసుకొనువప్పటికి ఏదో ఒక వృత్తిలో ప్రవేశింపగల సమర్థులగుదురు. రెండవది సాంకేతికవిద్య. ఈ విద్య నభ్యసించువారు ఉన్నతి సాంకేతిక విద్యనభ్యసించుటకు గాని, కర్మాగారములలో కొంతవరకు బాధ్యతాయుతమగు పదవులలో నియమింపబడుటకుగాని అర్హులగుదురు. విశ్వవిద్యాలయములలో ప్రవేశార్హత పొందుటకు తగినట్టిది మూడవ విధానము. ఈ క్రొత్త విధానము ఈ సంవత్సరము మొత్తం 50 స్కూళ్లలో మాత్రమే ప్రవేశపెట్టెదరు.

భాషా విషయమున ఇప్పుడు జరిగిన మార్పులు చాల ముఖ్యమైనవి. ఇప్పటివరకు ప్రధాన భాషగా నున్న ఇంగ్లీషు మూడవ స్థానమునకు నెట్టివేయబడినది. మొదటి స్థానము ప్రాంతీయభాషకు యివ్వబడినది. హిందుస్థానీ లేక సంస్కృతం, ఉర్దూ మొదలగు భారత ప్రాచీన భాషలకు రెండవ స్థానమిచ్చిరి. మొదటి స్థానము ప్రాంతీయభాషకు, మూడవ స్థానము ఇంగ్లీషుకు యివ్వబడుట సమంజసమే. కాని రెండవభాషాస్థానమే అసంతృప్తికరముగనున్నది. హిందుస్థానీ భారతదేశమున కంతకు రాజభాష. ప్రతివారు దానిని నేర్చుకొని తీరవలెను. కాబట్టి రెండవభాషగా ప్రతివారును హిందుస్థానీయే వచ్చును. సంస్కృతము ఇప్పటికన్న అధోగతిపాలైపోవును. తమిళదేశములో రెండవభాష బోధన 'ఆప్షనల్'గా వదలివేసి దేశమునకంతకు రాజభాషయగు హిందుస్థానీపై దెబ్బకొట్టిరి. ఇందుకు కారణములు హర్షింపదగినవిగా లేవు. హిందుస్థానీ తమిళుల కంత అవసరమో, ఆంధ్రులకు, కన్నడులకు కూడ అంతే అవసరము. దాని బోధన అన్ని ప్రాంతములలోను ఒకేవిధముగా జరగవలెను.

ప్రాంతీయభాషను ప్రథమ భాషగా నొనరించి హిందుస్థానీ, సంస్కృతం, ఉర్దూలను రెండవభాషగా నిర్ణయించుటవలన మరొక గొప్ప చిక్కు లేర్పడుచున్నది. ఒకప్రాంతములో ఆ ప్రాంతీయభాష మాతృభాషగాని వారు నివసించుచుండినవారికి మాతృభాష నేర్చుకొను అవకాశము లేకుండ పోవుచున్నది. ఉదాహరణకు తమిళనాడులో దాదాపు 25 లక్షల తెలుగువారున్నారు. ఇప్పటికే వారిలో తెలుగు వ్రాయను, చదువను గల సంఖ్య చాల తగ్గిపోయినది. వారికి తెలుగు మాట్లాడుటమాత్రమే తెలియును. అట్టివారు ఇకముందు తెలుగు నేర్చుకొను అవకాశము వుండనే వుండదు. తమిళ్నాడు ప్రాంతీయభాష యగు అరవము నేర్చువారు మొదటిభాషగా గ్రహించుట సమంజసమే. కాని రెండవభాషగానైనను తమ మాతృభాషను నేర్చుకొనుటకు అవకాశము వారి కుండవలెను. లేనిచో ఇతర రాష్ట్రములలోని భాషాధారక అల్పసంఖ్యాకులు విశేషముగా నష్టపడెదరు. ఈ విషయమును మద్రాసు ప్రభుత్వము గుర్తించినను, ఇట్లు చేయవలెననియే చేయుచున్నట్లున్నది. ఈ మధ్యనే దక్షిణాత్యాంధ్ర నాయకులు శ్రీ సాధు వరదరాజంపంతులుగారు విద్యాశాఖమంత్రిని దర్శించి, దక్షిణాదిన వున్న తెలుగువారికి నేర్చుకొను సౌకర్యములు కల్పించవలసినదని కోరగా, మంత్రిగారు నిరాకరించిన సంగతి పాఠకులకు విశదమే. క్రమేణా దక్షిణదేశములోని తెలుగువారు, తెలుగుభాషను మరచిపోయి, తమిళులైపోవలెనని వారి అభిప్రాయము. దక్షిణదేశమున తెలుగువారు గత నాలుగైదు శతాబ్దములనుండి తమ మాతృభాషను నేర్చుకొనుచున్నారు. అది పూర్వకాలము మన ఆలోచనల ప్రకారము అనాగరక కాలము. ఇది స్వతంత్రయుగము. నాగరికకాలము. ఇట్టి కాలములోనే లక్షలమందికి తమ మాతృభాష నేర్చుకొనుటకు అవకాశము లేదు. ఇట్టి స్వతంత్ర్యవిద్యావిధానముకొరకే మన మిన్నినాళ్ళు పోరాడితిమి!

సెకండరీ స్కూళ్లలో 'ఆప్షల్' పద్ధతి తొలగించుటకు నిర్ణయించినారు. ఈ పద్ధతి మధ్యకాలంలో వచ్చినదే. అది మంచిదని ఎవ్వరు భావించుటలేదు. పౌరశాస్త్ర శిక్షణను సెకండరీ స్కూళ్లలో ప్రవేశపెట్టుటకు నిర్ణయించినారు.

బట్టల ధరలు

వస్త్రములధరలపై కంట్రోలు, రేషనింగ్ తొలగించిన తర్వాత, సామాన్య మానవునకు సరియైన ధరకు బట్ట లభించక పోయినచో, కంట్రోలు తిరిగివిధించు విషయము ఆలోచింపబడునని భారతప్రభుత్వము స్పష్టపరచియే యుండెను. కంట్రోల్ తొలగించిన తరువాత బట్టలధర చాల ఎక్కువగా పెరిగిపోయినది. బజారు నిండ గుడ్డకనిపించుచున్నదిగాని అదికొనుటకు తగినంత డబ్బు జేబులలో కనిపించుటలేదు. బట్టలు కనపడనప్పటికన్నా, కనపడికూడా అందుబాటులోలేనప్పుడు మానవు లెక్కువ బాధపడుదురు. కంట్రోల్ తొలగించిన తరువాత బట్టలధర విపరీతముగా పెరిగిపోవుటకు కారణము బట్టల ఉత్పత్తిధర పెరిగిపోవుటకాక వర్తకుల లాభాపేక్షయే నగుట విచారకరము.

బట్టధరపై కంట్రోలు, రేషనింగు అమలులో నున్నప్పుడు పారిశ్రామికవేత్తలు, వర్తకులు ఆ ధరలు చాల తక్కువగా నున్నవని నెపముతో ప్రభుత్వముతో సహకరింప నిరాకరించిరి. కంట్రోల్, రేషనింగ్ తొలగించినచో సరియైన ధరలకు గుడ్డ లభించునటు చేసెదమని హామీకూడ యిచ్చిరి. కంట్రోల్ తొలగించిన తరువాత బట్టధర కొద్దిగా పెరుగునని అందరూ భావించిరి, అందుకు అంగీకరించిరికూడాను. కాని కంట్రోల్ తొలగించగానే బట్టల ధర రెట్టింపుకన్న ఎక్కువయైనది; ఇన్నాళ్ళకు కూడ ఏమంత తగ్గలేదు. అందువలన ప్రభుత్వము వారు జోక్యము కల్గించుకొనక తప్పని సరి యగుచున్నది.

మరొక 10, 15 రోజులలోగా బట్టలధరలు సరియైన స్థాయికి తగ్గకపోయినచో కంట్రోల్ తిరిగి విధించవలెననియే భారతప్రభుత్వము భావించుచున్నటు తెలియుచున్నది. మిల్లులలో ఉత్పత్తిఅయిన బట్టనంతను, నిర్ణీతమైన ధరలకు ప్రభుత్వమే వశపరచుకొని దానిని లైసెన్సు పొందిన వర్తకుల ద్వారా అమ్మింపదలచుచున్నట్లు తెలియుచున్నది. ఈ కంట్రోల్ సరిగా అమలు జరుపుటకు, బ్లాక్‌మార్కెట్ దారులను పట్టుకొనుటకు తగు సిబ్బందిని తయారుగా నుంచుకొనవలసిందని కేంద్ర ప్రభుత్వము రాష్ట్రముల నాదేశించినది. అన్ని రాష్ట్రముల ప్రధానులు త్వరలో సమావేశమై బట్టలసమస్యను గురించి ఆలోచింతురట. బట్టలపై కంట్రోల్ తిరిగి విధించుట ఈ సమయమున అవసరమే. కాని ఆ కంట్రోల్ ఇదివరకువలె అసంపూర్ణముగనుండి సక్రమముగ అమలు జరుగక పోయినచో ఇప్పటికన్న కంట్రోల్ సమయమునందే ఎక్కువ బాధపడవలసియుండును. కంట్రోల్ వుండదలచినచో నిక్కచ్చిగా, మిల్లునుండి బట్ట కొనుగోలుదారుకు చేరువరకు, నిర్దాక్షిణ్యముగ నుండవలెను. లేదా సాంతము లేకుండవలెను.

కంట్రోల్ తిరిగి విధింపబడు సూచనలు కనిపించగానే, బట్టలధరలు తగ్గుచున్నవని వార్తలు వచ్చుచున్నవి. గత 20 రోజులలో బొంబాయిలో బట్టల టోకుధర నూటికి 40 వంతులకుపైగా పడిపోయినదనీ, వర్తకులకు దాదాపు మూడుకోట్ల రూపాయలు నష్టము వచ్చినదనీ తెలుస్తున్నది. బట్టల ధరలు పడిపోవుటకు, కంట్రోల్ పునరుద్ధరింపబడునను భయముగాక, మరికొన్ని ఇతర కారణములుకూడ లేకపోలేదు. బట్టల ధరలు పెరిగినతరువాత చిల్లర అమ్మకము చాల తగ్గిపోయినది. కొంతకాలము గడచిన ధర తగ్గిపోవునని ఎంచి, కొనుగోలుదారులు బట్ట కొనకున్నారు. గత రెండుమాసములనుండి బొంబాయిలో ఉత్పత్తిఅయిన బట్ట చిల్లరవర్తకులవద్దకు ఇంతవరకు రానేలేదు; టోకువర్తకులు, మిల్లు యజమానులు దానిని

ఆశియా ఖండమునకొక నెహ్రూ పథకము అవసరమా?

ఒక దేశములో భిన్న భిన్న తరగతుల మధ్య ఆర్థిక వ్యత్యాసము అసంతృప్తికి, ఆందోళనకు ఎట్లు కారణమగుచున్నదో అట్లే ప్రపంచములోని వివిధదేశములమధ్య ఆర్థిక వ్యత్యాసము అసంతృప్తికి, భేదాభిప్రాయములకు, చివరకు యుద్ధమునకు దారితీయునని గత మూడు దశాబ్దముల అనుభవమువలన ప్రపంచ రాజకీయవేత్తలందరు గ్రహించిరి. అందువలననే యుద్ధకాలమున నాశనమైపోయిన ఆర్థికవ్యవస్థలను త్వరగా పునర్నిర్మించుటకు అన్ని రాజ్యములు, ముఖ్యముగా యూరప్ రాజ్యములు, తీవ్రకృషి చేయుచున్నవి. ఈ దేశములలో ఉత్పత్తి ఇప్పటికప్పుడే 1938 వ సం. నాటి స్థాయికి పెరిగినదిగాని ఇంకను ఎంతో అభివృద్ధి జరిగినగాని ఇప్పుడున్న జనసంఖ్యకు, ఇప్పటి జీవనవ్యయ భారమును బట్టి తగినంత జీవనసౌకర్యము లభింపదు. ఈ దేశములలో ఉత్పత్తి అవుసరమైన స్థాయికి సత్వరముగా వృద్ధిపొందుటకు వానికి అన్యదేశములనుండి సహాయముకూడ కొంతవరకు అవుసరమైనది. ఈ సహాయము చేయుటకు అమెరికా అంగీకరించినది. ఇప్పటికి ఒక సంవత్సరము క్రితం అమెరికన్ విదేశశాఖ కార్యదర్శి మార్షల్ ఈ అంగీకారమును సూచించినది మొదలు, మార్షల్ పథకమను పేరున పిలువబడుచున్న ఈ సూచనకు జరిగినంత ప్రచారము యుద్ధానంతరము ఏ ఇతర సూచనకూ జరుగలేదు. అమెరికా ఆర్థికసహాయమును పొందుటకు పశ్చిమయూరప్ రాజ్యములు నిశ్చయించినవి. అప్పటినుండియు, అట్టి ఆర్థిక సహాయమునే ఆశియా రాజ్యములు, ముఖ్యముగా భారతదేశము పొందవలెనని అనేకులు సూచించుచున్నారు. ఆశియారాజ్యములన్నియు కలసి, పశ్చిమయూరప్ రాజ్యములవలె ఒక ప్రణాళిక తయారుచేసికొని, అమెరికాను సహాయమర్థింపవలెనని కూడ కొందరు సూచించిరి. ఈ మధ్య అమెరికాలో పర్యటించి వచ్చిన సర్ సి. పి. రామస్వామిఅయ్యర్, ఇప్పటివరకు అమెరికాలో భారతరాయబారిగానున్న అసఫ్ అలీ గారలుకూడ ఇట్టి సూచనలే చేసిరి. ఇండియాలో అమెరికా రాయబారిగానున్న డా. హెన్రీగ్రేడీ కూడ ఇట్టి ఉద్దేశ్యములనే చాల పర్యాయములు వెల్లడించియుండెను. ఇప్పుడు ఉదకమండలంలో సమావేశమగుచున్న దూరప్రాచ్య ఆర్థికసంఘము ఈ దేశముల ఆర్థికాభివృద్ధి ప్రణాళికను తయారుచేయవలెనని, దాని ఆధారముగానైకాని అమెరికాను ఆర్థిక సహాయము, ఈ రాజ్యములన్నియు కలిసి అర్థింపవలెనని కొందరు అభిప్రాయ పడుచున్నారు.

మార్షల్ పథకము వంటి పథకము ద్వారా ఆశియా రాజ్యములు అమెరికన్ ఆర్థిక సహాయము పొందవలెనా లేదా అను విషయమును ఆలోచించుటకు పూర్వము మార్షల్ పథక నిజస్వరూపమును గుర్తెరుంగుటకు అవుసరము. 'మార్షల్ పథకము' యూరప్ రాజ్యముల ఆర్థిక వ్యవస్థను చక్కబరచుటకు అమెరికా ఆర్థికసహాయము చేయుటకొరకే ఉద్దేశింపబడినట్లు పైకి కనపించినను, అందు కొంత రాజకీయ ప్రయోజనముకూడ లేకపోలేదు.

ప్రథమప్రపంచ సంగ్రామము అమెరికాను ప్రపంచములో ఒక బలిష్ఠరాజ్యముగా నొనర్చినది. యుద్ధానంతరకాలములో అమెరికా తన బలమును సంఘటిత మొనర్చుకొనినది. ద్వితీయ ప్రపంచసంగ్రామ కాలములో పశ్చిమ ప్రజాస్వామ్యములకు అన్నివిధముల అమెరికాయే దిక్కయినది. ప్రపంచరాజ్యముల నాయకత్వము సంపాదించుటకు అమెరికాకు అప్పుడు మంచి అవకాశము లభించినది. యుద్ధకాలములో తాను సాధించిన విజయమును యుద్ధానంతరము స్థిరపరచుకొనుటకు అమెరికా ప్రయత్నించుట సహజమేకదా; యుద్ధకాలమున యూరప్ రాజ్యముల ఆర్థికవ్యవస్థదాదాపు పూర్తిగా నాశనమైపోయెను. యుద్ధానంతరము ఆ దేశముల పోషణ బాధ్యతకూడ మిత్రరాజ్యములే వహించవలసివచ్చెను. ఈ దేశములలో నామమాత్ర ప్రభుత్వములు ఏర్పడినను, మిత్రరాజ్యముల ఆర్థిక సహాయము లేనిదే ఆ ప్రభుత్వములు కూలిపోయి, విప్లవముజరిగి, కమ్యూనిజం వ్యాపించగల ప్రమాదము ఏర్పడినది. ఈ ప్రమాదమునుండి ఆ దేశములను కాపాడుట తన విధి యని అమెరికా భావించినది. అందుకే వానికి ఆర్థిక సహాయము లభింపజేసినది. తద్వారా పశ్చిమయూరప్ రాజ్యములపై అమెరికాకు నాయకత్వము లభించినది. ఇటలీ ఎన్నికలలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారముకొరకు అమెరికా కోట్లకొలది డాలర్లు ఖర్చుచేసినది. ఇటలీలో కమ్యూనిస్టులు విజయ మొందుచో, ఆ దేశమునకు తన ఆర్థిక సహాయము లభింపదని స్పష్టముగా చెప్పివేసినది. ట్రీస్టీప్రాంతము ఇటలీకే యిచ్చివేయుటకు అంగీకరించినది. ఈ విధముగా పశ్చిమ యూరప్ రాజ్యములలో కమ్యూనిస్టు వ్యాప్తిని అరికట్టుటకు, తన పలుకుబడిని, నాయకత్వమును స్థిరమొనర్చుకొనుటకు అమెరికా కాయకష్టులా పనిచేయుచున్నది. మార్షల్ పథకము పేరిట జరుగుచున్న ఆర్థిక సహాయము ఈ కృషిలో ఒక భాగము మాత్రమే. మార్షల్ పథకము ప్రకారము ధనసహాయము పొందుచున్న ఏ దేశములోనైనను కమ్యూనిస్టులు అధికారములోనికి వచ్చినచో ఆ దేశమునకు సహాయము నిలిపివేయబడుననికూడ స్పష్టపరచబడెను. అమెరికానుండి ధనసహాయము పొందుచున్న దేశములు రాజకీయముగ అమెరికా చెప్పుచేతలలో వుండవలెననియే అమెరికాప్రభుత్వము భావించుచున్నది. ఈ విషయమును పశ్చిమ యూరప్ రాజ్యములు గుర్తించినవి; అంగీకరించినవని కూడ భావించవచ్చును. కాబట్టి అమెరికా ఆర్థికసహాయము కేవలము పారమార్థిక చింతతో చేయబడుటలేదనీ, ఆ సహాయము నపేక్షించు రాజ్యములు అమెరికాకు రాజకీయముగ దాసోహమనక తప్పదనీ స్పష్టపడుచున్నది.

ఆశియా, దూరప్రాచ్య రాజ్యములు ఇప్పుడిప్పుడే తమ రాజకీయ స్వాతంత్ర్యమును గుంజుకొనుచున్నవి. ఇండియా, పాకిస్థాన్, సింహళం, బర్మాలు స్వాతంత్ర్యము పొందినవి. ఇండోచైనా, ఇండోనీసియాలలో స్వాతంత్ర్య పోరాట మింకను జరుగుచునే యున్నది. చైనా అంతరంగిక యుద్ధజ్వాలలలో మ్రగ్గుచున్నది. జపాన్ కొరియాలు విదేశముల ఆక్రమణనుండి విముక్తి ఇంకను పొందలేదు. విదేశపరిపాలనలో మ్రగ్గివుండి, ఇప్పుడిప్పుడే స్వాతంత్ర్యము పొందుచున్న దేశములు ఒక్కమారుగా భాగ్యవంతములు కావలెనని ప్రజలు వాంఛించుట సహజమే. ప్రపంచ జనాభాలో సగమునకెక్కువ ఈ ప్రాంతములోనే నివసించుచున్నారు. ఇన్నాళ్లనుండి అతి దారిద్ర్య మనుభవించుచుండి, ఎప్పుడు సర్వస్వతంత్రత లభించునా, ఎప్పుడు తమ స్థితి బాగుపడునాయని వారు ఎదురు చూచుచుండిరి. వ్యవసాయికముగను, పారిశ్రామికముగను ఈ ప్రాంతములు అభివృద్ధి జెందుటకు ఎంతైన అవకాశమున్నది. ఈ ప్రాంతపు ఖనిజ సంపద ఇంతవరకు పూర్తిగా సర్వే చేయబడనే లేదు. ఎక్కువ ప్రాంతములో వ్యవసాయము

శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ

జరుగుచున్నను అది పూర్వకాలపద్ధతులపై జరుగుచున్నది. పారిశ్రామికము ఈ ప్రాంతములు ఏమాత్రము జరుగనేలేదు. కావలసినంత సాధన సంపత్తి, మానవసంపత్తి యుండుటవలన ఈ ప్రాంతమునకు మంచి భవిష్యత్తున్నదని నిస్సందేహముగా చెప్పవచ్చును.

ఈ సంపత్తియంతయు చక్కగ ఉపయోగించుకొని, అభివృద్ధిజెందిన ప్రజల జీవితములు ఇప్పటికన్న ఎన్నోరెట్లు సౌఖ్యవంతము కాగలవు

ఆశియా, దూరప్రాచ్యరాజ్యాలు వ్యవసాయికముగ, పారిశ్రామికముగ అభివృద్ధి జెందుటకు ముఖ్యముగ కావలసినది యంత్రసామగ్రి, నిపుణులు, ధనము. ఈ మూడింటికి ఈ దేశములు చాలవరకు పాశ్చాత్య రాజ్యములపైననే ఆధారపడవలసియున్నది. అమెరికాను ధన సహాయమర్థించి, ఆధనముతో యంత్రములు కొనుక్కొనవచ్చునని అభిప్రాయపడియే పలువురు మార్షల్ పథకమును ఆశియా రాజ్యములకు కూడ వర్తింపజేయవలె ననుచున్నారు. రాజకీయముగ ఇప్పుడే స్వాతంత్ర్యము పొందుచున్న దేశములు తిరిగి అమెరికాకు దాసోహ మనుటకు ఎవ్వరును అంగీకరించరు. అప్పుడా రాజ్యములకు ధనసహాయము చేయుటకు అమెరికా ఇష్టపడదు. అందువలన మార్షల్ పథకమును ఆసియా దేశములకుకూడ వర్తింపజేయవలె ననువారి కోర్కెలు విఫలములై పోక తప్పదు. మొన్న ఉదకమండలంలో దూరప్రాచ్య ఆర్థికసంఘ సమావేశము నుపక్రమించుచు ఆసియా రాజ్యములు కొంచెము ఆలస్యమైనను, తమ స్వశక్తిపైననే ఆధారపడి, ఆర్థికాభివృద్ధి జరుపుకొనినుగాని ఆర్థికాభివృద్ధి కొరకు ఇతర రాజ్యములకు రాజకీయముగ దాసోహ మనవని భారత ప్రధాని పునరుద్ఘాటించెను.

ఆసియా, దూరప్రాచ్య రాజ్యాలు పరస్పర సహకారముద్వారా తమ ప్రయోజనములను కొంతవరకు సాధించుకొనవచ్చును. మార్షల్ పథకము ప్రకారము ధనసహాయము పొందుచున్న యూరప్ రాజ్యములుకూడ తమలో తాము వీలైనంత ఎక్కువ సహకారముతో వ్యవహరించుకొనుటకు అంగీకరించి యున్నవి. అట్లే ఆసియారాజ్యములన్నియు, ఒకదానితో నొకటి ఇప్పటికన్న ఎక్కువగా వ్యాపారవిషయములలో, సహకరించుకొనుటకు వీలు లేకపోలేదు. బర్మా, సయాందేశములనుండి బియ్యము భారతదేశమునకు, భారత దేశమునుండి గుడ్డ, జనపనార ఇతర దేశములకు, మలయానుండి వీటన్నింటికి రబ్బరు, టిన్ను—ఈ విధముగా పరస్పర సహకారముతో వ్యవహరించుటకు అవకాశమున్నది. ఇప్పుడు ఉదకమండలంలో సమావేశమగుచున్న దూరప్రాచ్య ఆర్థిక సంఘము ఈ విషయమై సమగ్రమైన పథకము తయారుచేయునని ఆశించబడుచున్నది.

ఆశియా రాజ్యము లొకదానితో నొకటి ఎంత సహకరించినను, పారిశ్రామికాభివృద్ధికత్యవుసరమగు యంత్రసామగ్రి విదేశములనుండి తెప్పించుకొనక తప్పదు. ఆశియారాజ్యముల ముడిపదార్థములు పాశ్చాత్యపారిశ్రామిక దేశములకు అత్యవుసరము. పారిశ్రామిక దేశములు యంత్రసామగ్రిని అమ్మిననే వానికి ముడిపదార్థములు అమ్మెదమని ఆశియా రాజ్యములు షరతు పెట్టవచ్చును. ఆ షరతుకు పారిశ్రామిక దేశములు కూడ ఒప్పుకొనక తప్పదు. కాని ఆశియా రాజ్యములలో కొన్ని ఇంకను పాశ్చాత్య దేశముల పాలనలోనే వున్నవి. ఉదాహరణకు: మలయా టిన్ను, రబ్బరు బ్రిటన్, అమెరికాలకు అత్యవుసరము కాని మలయా బ్రిటిష్‌పాలనలో నుండుటవలన బ్రిటన్‌తోగాని అమెరికాతోగాని మలయా బేరమాడగల స్థితిలో లేకున్నది. ఇండోనీసియా కూడ ఇట్లే వున్నది. మిత్రరాజ్యముల ఆక్రమణలో నున్న జపాన్ పారిశ్రామిక శక్తి పూర్తిగ అభివృద్ధిజెందనివ్వబడిన ఇతర ఆశియా రాజ్యములకు యంత్రసామగ్రి కొంతవరకు సరఫరా కాగలదు. అమెరికానుండి ప్రస్తుతం యూరప్ రాజ్యములకు యంత్రసామగ్రి ఎక్కువగా పంపబడుచున్నది. యూరప్ రాజ్యములు పూర్తిగా తేరుకొనినచో ఆ యంత్రసామగ్రి కూడ ఆశియా దేశములకు లభించును. ఆశియా దేశముల ఆర్థికాభివృద్ధి ఒక్క రోజులో జరుగునది కాదు. అయితే, విదేశములనుండి యంత్రసామగ్రి సకాలమునకు లభింపక పోయిన అది మరింత ఆలస్యము కావచ్చును.

పారిశ్రామికాభివృద్ధికి యంత్రము లెంత అవుసరమో వానిని నడుపగల నిపుణులుకూడ అంత అవుసరమే. భారతదేశమునకు కావలసిన నిపుణులకు విదేశములలోను, స్వదేశములలోను, కూడ శిక్షణ యిప్పించుచున్నారు. మరికొన్ని శిక్షణాలయములను స్థాపించి, విదేశస్థులను శిక్షకులుగా నియమించుటను గూర్చి ఆలోచించుచున్నారు. ఆశియారాజ్యము లన్నింటికి కావలసిన నిపుణులను లభింపజేయుటనుగూర్చి దూరప్రాచ్య ఆర్థిక సంఘము చాల రోజులనుండి ఆలోచించుచునే యున్నది. ఉదకమండలంలో ఈ విషయమై ఒక నిర్ణయము చేయబడునని ఆశించబడుచున్నది.

నిలువయుంచుకొనవలసి వచ్చినది. బొంబాయి నుండి ఇతర ప్రాంతాలకు రవాణా సౌకర్యములు తక్కువగా నుండుటవలన, ఇతర పట్టణములలోని వర్తకులు తమ కోటాలనుకూడ బొంబాయిలోనే అమ్మివేసికొనుచున్నారు. అందువలన వర్తకము వ్యాపారస్థులమధ్యనే జరుగుచూ, గుడ్డ కొనుగోలుదారువద్దకు పోక నిలువయుండిపోవుచున్నది. బట్టల వ్యాపారము మందముగా నుండుటచే వ్యాపారస్థులకు అప్పులిచ్చుబ్యాంకులు ఎక్కువ సెక్యూరిటీ కోరుచున్నవి. ధరలు విపరీతముగా నుండుటవలన మిల్లులవద్దనుండి బట్ట వశపరచుకొనుటకు టోకువ్యాపారస్థులు, టోకు వ్యాపారస్థులవద్ద కొనుటకు చిల్లర వ్యాపారస్థులు భయపడుచున్నారు. బట్టధర తగ్గినచో ఆ నష్టము తమపై బడునని ఎవరికి వారు భయపడుచున్నారు. బ్లాక్‌మార్కెట్‌లో సంపాదించిన డబ్బులో అధిక భాగము పన్నుగా వసూలు చేయవలెనని ప్రభుత్వము ఆలోచించుచున్నదని తెలిసి, మరికొందరు ఆందోళన జెందుచున్నారు. ఇన్ని కారణములవలన బట్టల ధరలు తగ్గిపోగల సూచనలున్నవి. ఇప్పటివరకు తగ్గినది టోకు ధరలేగాని చిల్లరధరలు కాదని తెలియుచున్నది. కాని ప్రభుత్వమిప్పుడు కొంచెము జాగ్రత్తవహించినచో, కంట్రోల్ తిరిగి విధింపకుండ బట్టల ధర సగానికి సగము తగ్గ అవకాశము లేకపోలేదు.



“వార్ధి”లో డాక్టరు కౌంతి, జె. సేత్ గారు స్థాపించిన, నూతన వైద్యశాలను శ్రీ మొరార్జీ దేశాయిగారు ప్రారంభోత్సవం జరిపినప్పుడు తీసిన చిత్రం.

యుగసంధి

(19-వ పేజీ తరువాయి)

పోయింది, చైతన్యం వచ్చింది అందరూ భోజనం కడుపునిండా తిన్నారు కూడా, మామూలుకంటే అరగంట ముందుగానే పడుకోడానికి వెళిపోయారు.

ఆర్కాడీ పక్కమీదపడుకుని, దుస్తులు మార్చుకుంటున్న బజరోవ్‌తో అన్నాడు, "నువ్వు ఇదివరకు నన్నడిగిన ప్రశ్న ఇప్పుడు నిన్ను నేను అడగవచ్చు. ఎందుకంత విషాదంగా ఉన్నావు? ఏదో పవిత్ర విధిని నిర్వర్తించి వచ్చినట్టు అగుపిస్తున్నావు"

కొద్దిరోజులనించీ ఇద్దరి యువకులమధ్యా సంభాషణలో విశృంఖలత్వం, నిర్లక్ష్యం నటనగా ప్రవేశించాయి. అనటన ఏదో అసంతృప్తికీ, అనకోని సందేహాలకీ నిర్దుష్టమయిన సూచన

"నేను రేపుమా నాన్న దగ్గరకు పోతున్నాను," అన్నాడు బజరోవ్. ఆర్కాడీ మోచేతిమీద పైకిలేచాడు అతనికి ఆశ్చర్యమూ కలిగింది, ఏకారణంచేతో కొంత సంతోషమూ కలిగింది. "అహా" అన్నాడు అతను, "అందుచేతేనా ఇంత విషాదంగా ఉంటా"

బజరోవ్ ఆవులించాడు. "అట్టే విషయాలు నీకు తెలుస్తే, నీ వయస్సు ముదిరిపోతుంది."

"అయితే అనాసర్గీవ్నా?" ఆర్కాడీ అంత త్వరితో వదలలేదు.

"అనాసర్గీవ్నా ఏమిటి?"

"అంటే ఆమె నిన్ను విడిచిపెడుతుందా? అని."

"నాకామె జీతం ఇచ్చి పెట్టుకోలేదే" ఆర్కాడీ ఆలోచనలో పడ్డాడు బజరోవ్ గోడవేపుతిరిగి పడుకున్నాడు.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. "యవ్‌గనీ," అన్నాడు ఆర్కాడీ చటుక్కుని

"ఏం"

"రేపు నేనూ నీతో వచ్చేస్తున్నాను"

బజరోవ్ సమాధానం చెప్పలేదు

"నేనూ మా ఇంటికి పోతాను" ఆర్కాడీ అన్నాడు. "హోఖ్లోవిస్కీదాకా ఇద్దరమూ కలిసిపోదాం. ఫెడోట్ దగ్గర నీకు గుర్రాలు దొరుకుతాయి అక్కడినించి ప్రయాణానికి. మీవాళ్లతో పరిచయంచేసుకోవాలని నాకు చాలా ఉందిగాని, నేను మీఅందరికీ అడ్డుతగులుతానేమోనని సందేహం. తరువాత మళ్లీ నువ్వు మా ఇంటికి ఎల్లాగా వస్తున్నావుగా?"

"నాసామానంతా మీ ఇంటిదగ్గరే వదిలేశాను," అన్నాడు బజరోవ్, అతనివేపు తిరగకుండానే.

"నేనెందుకు వెళ్లిపోతున్నానో అడగడే? అందులో అతనిలాగే ఇల్లా చటుకుని వెళ్లిపోతున్నాను?" అని ఆలోచించాడు ఆర్కాడీ. "నిజంగా నేను ఎందుకు వెళిపోతున్నాను? అతనెందుకు వెళ్లిపోతున్నాడు?" అతనికి సంతృప్తికరమైన సమాధానం కనబడలేదు. అతని హృదయమంతా ఏదో బాధతోనిండిపోయింది. ఇంత అలవాటయిన ఈ జీవితాన్ని వదలి వెళ్లిపోవడం చాలా కష్టమని అతనికి అనిపించింది! కాని అతను ఒక్కడూ ఉండిపోవడం బాగుండదు "వాళ్లిద్దరిమధ్యా ఏదోవచ్చింది," తనలో తను తర్కించుకున్నాడు, "అతను వెళ్లిపోయిన తరవాత నేనిక్కడ పట్టుకు వేళ్లాడితే ఏంబాగుంటుంది? ఆమెకు నేనంటే విసుగు నా ఆఖరు ఆశకూడా నిరాశ అయిపోయింది." అనాసర్గీవ్నాని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. క్రమంగా ఇంకో కొత్త రూపురేఖలు ఆమె సుందర చిత్రాన్ని మాటుపరిచాయి

"కాట్యాని విడిచిపెట్టి పోవడంకూడా కష్టంగానే ఉంది!" ఆర్కాడీ తనలో తను అనుకున్నాడు. అతని తలగడమీద ఒక కన్నీటి చుక్క రాలింది ... ఒక్కసారిగా తన జుట్టును వెనక్కి విసురుకొని పైకి అన్నాడు

"ఆ చచ్చుముండావాడు సిట్నికోవ్ ఎందుకు తయారయాడు ఇక్కడికి!" బజరోవ్ ముందు కొద్దిగా కదిలాడు; తరవాత అన్నాడు, "నువ్వింకా తెలివితక్కువ వాడవోయి, అబ్బాయి. సిట్నికోవ్ లాంటివాళ్లు మనకి ఇప్పుడు ముఖ్యంగా అవసరం నేను—నీకు అర్థమయిందా?—నేను, అల్లాంటి మట్టి బుర్రలని చాలా ప్రేమిస్తాను. ఇటుకలుమోసే పని దేవతలు చెయ్యరుగా మరి"

"ఓహో" అనుకున్నాడు ఆర్కాడీ బజరోవ్ తన గర్వంతో కప్పిపుచ్చుకున్న లోతులన్నీ ఒక్క మెరుపులో ఆర్కాడీకి కనబడ్డాయి. అయితే దేవతలంటే మనమిద్దరమూనా? పోనీ నువ్వు దేవతవే అనుకో, నేను మట్టిబుర్రనేనా?"

"ఆ" అన్నాడు బజరోవ్, "నువ్వింకా తెలివితక్కువ వాడవోయి"

ఆర్కాడీ తనుకూడా బజరోవ్‌తో వెడుతున్నానని మరునాడు చెప్పినప్పుడు ఓడిన్‌ట్సోవ్ సతి అంత ఆశ్చర్యాన్ని ప్రకటించలేదు. ఆమె పరధ్యానంగా, అలసిపోయినట్టు కనిపించింది, కాట్యా మౌనంగా తీక్ష్ణంగా అతని వేపు చూసింది. ముసలి రాకుమారి అతనికి కనిపించేటట్టుగా తనుకప్పుకున్న శాలువా లోపలే చేతితో సిలువ సంజ్ఞ చేసింది. సిట్నికోవ్ పూర్తిగా తలక్రిందులయిపోయాడు. అప్పుడే అతను కొత్త దుస్తులు ధరించి—వెనకటి బాపతువి కాదు—భోజనానికి తయారయాడు. క్రితంరాత్రి అతన్ని చూస్తుండమని నియమించిన సేవకునిముందు, తను తెచ్చుకున్న దుస్తులు అన్నీ విప్పి గాభరా పెట్టాడు ఇంతలోనే తన స్నేహితులు అతన్ని వదలి వెళ్లిపోతున్నారు రెండడుగులు వేశాడు. వేటకాని బారినించి పారిపోతూ చటుకుని చెట్లచాటు అడ్డంతగిలిన తోడేలులాగ గబుక్కుని వెనక్కి తగ్గాడు. ఉండి ఉండి ఒక్కసారిగా, ఎంతో విషాదంతో, ఆర్తనాదం చేస్తున్నట్టు తనుకూడా వెళ్లిపోవాలని చెప్పాడు ఓడిన్‌ట్సోవ్ సతి అతన్ని ఆపడానికి ప్రయత్నించలేదు.

"నా గుర్రపుబగ్గీ సుఖంగానే ఉంటుంది," ఆ దురదృష్టవంతుడు ఆర్కాడీతో "నువ్వు నా బండిలో ఎక్కవచ్చు యవ్‌గనీవాసిలిచ్ నీ బండిలో పోవచ్చు. అల్లాఅయితే ఎక్కువ వీలుగా ఉంటుంది"

"నిజానికి నీ ఇంటికి దారి ఇదికాదు అదీగాక మాఊరు చాలాదూరముంది"

"అదేంఫరవాలేదు. నాకు కావలిసినంత వ్యవధి ఉందీ, అదిగాక కొద్దిగా పనుందికూడా ఆ దారిలో"

"సారా అమ్మకమా?" అన్నాడు ఆర్కాడీ వెటకారంగా సిట్నికోవ్ పూర్తిగా నిస్పృహలో మునిగిపోయాడు అంచేత అతను మామూలులాగ నవ్వలేదుకూడా. "నాబగ్గీచాలా సుఖంగా ఉంటుంది, నీకుతెలియదు" అని గొణుక్కున్నాడు, "అందరికీ సరిపోతుంది కూడా."

"సిట్నికోవ్‌గారి కోరికను నిరాకరించి ఆయన్ని అట్టే బాధపెట్టకండి" అంది ఓడిన్‌ట్సోవ్ సతి.

ఆర్కాడీ ఆమెవేపు చూశాడు అంగీకార సూచకంగా తలవంచాడు

అతిథులు భోజనాలయిన తరువాత బయలుదేరారు. బజరోవ్ దగ్గర శలవుతీసుకుంటూ ఆమె అతనికి చెయ్యి జాపింది అంది "మనం మళ్లీ కలుసుకుంటాం, కదూ?"

"తమ ఆజ్ఞ," అని బజరోవ్ జవాబు చెప్పాడు.

"అల్లాగయితే కలుసుకుంటాం."

అందరికంటే ముందు ఆర్కాడీ మెట్లు దిగాడు సిట్నికోవ్ బగ్గీలో ఎక్కాడు. ఒక సేవకుడు అతన్ని జాగ్రత్తగా లోపలికి ఎక్కించాడు ఆసేవకుణ్ణి చంపగలిగితే అతను సంతోషంగా చంపి ఉండును, ఏడవగలిగితే హృదయపూర్వంగా ఏడిచి ఉండును బజరోవ్ రెండో బండిలో ఎక్కాడు. హోఖ్లోవిస్కీ చేరిన తరవాత ఫిడోట్ కొత్తగుర్రాలను తెచ్చేదాకా ఆర్కాడీ ఆగాడు. గుర్రాలను పూన్చిన తరవాత అతను వెనుకటి చనువుతో చిరునవ్వు నవ్వుతో బండిదగ్గరకువెళ్లి బజరోవ్‌తో అన్నాడు, "యవ్‌గనీ, నీతోకూడా తీసుకుపోవోయి. నాకు రావాలని ఉంది."

"ఎక్కు" అన్నాడు బజరోవ్ పళ్లు బిగించి సిట్నికోవ్ తన బగ్గీచక్రాల చుట్టూ ఈలవేసుకుంటూ తిరుగుతూ, ఈమాటలు విన్నాడు. ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. ఆర్కాడీ తన సామానుబగ్గీలోనించిలాగి, బజరోవ్ బండిలో వెళ్లికూర్చున్నాడు, సిట్నికోవ్ వేపు తిరిగి మర్యాదగా తలవంచి, "పోనియ్యి," అన్నాడు బండివాడితో బండికదిలి, కొద్దిసేపట్లో చూపు మేరదాటి వెళ్లిపోయింది సిట్నికోవ్ కలవరపడిపోయి తన బండివాడి వేపు చూశాడు. వాడుమట్టుకు ఎడమ వేపు గుర్రంతోకని చబుకుతో నిమురుతూ నిలబడ్డాడు. సిట్నికోవ్ బండిలో ఎగిరి కూర్చున్నాడు పక్కనించి పోతున్న ఇద్దరు కృషికులనుమాసి, "టోపీలు పెట్టుకోండి, చచ్చుముండావాళ్లు!" అన్నాడు. తరవాత పట్టణానికి బండితోలించుకు పోయాడు. అక్కడికి చేరుకునేసరికి చాలా పొద్దుపోయింది. మరునాడు కుక్షిన్ ఇంటికి పోయి, ఇద్దరు "పొగరుబోతు తలతిరుగుడుగాళ్లను" గురించి తనివితీర తిట్టాడు.

బజరోవ్ పక్కని కూర్చుని ఆర్కాడీ, అతని చేతిని చనువుగా నొక్కాడు. చాలాసేపటి వరకు ఏమీ మాట్లాడలేదు. బజరోవ్ కూడా ఆ చెయ్యినొక్కడమూ, ఆ మౌనమూకూడా బజరోవ్‌కి అర్థమయింది, అతని హృదయంలో కదలిక కలిగిందికూడా. క్రితంరాత్రి అతనికి అసలు నిద్ర పట్టలేదు; అతడులాగ కొద్దిరోజుల నించీ అతనికి ఆహారం ఏమీ రుచించడంలేదు. అతని ముఖం—అసలేలోలగా ఉంటుంది—మరీపల్చగా అయిపోయింది. కనుబొమలదరకూ లాక్కున్న టోపీకింద చీకటిగా, తీక్ష్ణంగా పొడుచుకుని కనబడుతోంది.

"అయితే తమ్ముడూ," అన్నాడు చివరకి, "ఒక సిగరెట్టుఇయ్యి ఇల్లాచూడు, నా నాలుక పసుపురంగుగా ఉందా?"

"ఆ ఉంది" అన్నాడు ఆర్కాడీ.

"ఊం, సిగరెట్టు రుచి తెలియడంలేదు యంత్రం కొంచెంపాడయింది"

"ఈమధ్య నీలో స్పష్టంగా మార్పు కనబడుతోంది," అన్నాడు ఆర్కాడీ

"ఏమీలేదు త్వరలోనే మళ్లీ బాగుపడుతుంది దేహం. ఒక్క విషయమోయి తమ్ముడూ. మా అమ్మది చాలా మెత్తనిగుండె, రోజుకి పదిసార్లయినా తిండితిని, గుండ్రంగా నీళ్ళతొట్టిలా తయారయితేగాని ఆమెకు తోచదు మా నాన్న ఫరవాలేదు. అన్ని రకాల ఒడుదుడుకులూ అతనికి అనుభవమయాయి అబ్బే, సిగరెట్టు కాల్చలేను" అని రోడ్డుమీదికి గిరవాటేశాడు

"ఒక ఇరవయి మైళ్ళుంటుందంటావా?" ఆర్కాడీ అడిగాడు.

"ఆ అయినా ఈ యోగినడుగు," బండి తోలుతున్న ఫిడోట్ సేవకుడివేపు చూపిస్తూ బజరోవ్ అన్నాడు.

కాని ఆ యోగిసత్తముడు చెప్పలేకపోయాడు "ఎవరికి తెలుసు?" అన్నాడు, "ఈ చుట్టుపక్కల మైలుకొలతలు లేవు." అతను మళ్లీ ఎడమగుర్రాన్ని ఉద్దేశించి లోపల తిట్టుకుంటూ కూర్చున్నాడు ఆ గుర్రంతల "ఊరికే తన్నుకుంటోంది", అంటే తల పైకీ కిందకీ ఊపుతోంది.

"అవునవును," అన్నాడు బజరోవ్," ఇది నీ కొక గుణపాఠం, తమ్ముడూ! బాగా తెలియజెప్పే గుణపాఠం ఎంత అసహ్యమైనదో దేవుడికెరుక ఏదో చేతికిదొరికిన తాడు పట్టుకుని మనిషి వేలాడుతుంటాడు ఏ నిమిషంలోనైనా తన కాలికింద ఉన్న అఖాతం లోకి పడిపోవచ్చు. అయినా అలాగ వేలాడుతూనే ఉండాలి అనవసరమయిన అసౌఖ్యాలను సృష్టించుకోవాలి, జీవితాన్ని భగ్నం చేసుకోవాలి"

"దేన్నిగురించి నువ్వు అంటున్నది?" ఆర్కాడీ అడిగాడు.

"దేన్ని గురించీకాదు. నేను ఉన్నదిఉన్నట్లు చెప్తున్నాను. మనమిద్దరం వట్టి చవటల్లాగ ప్రవర్తించాం దాన్నిగురించి ప్రస్తావించి ఏం లాభం! కాని వైద్యవృత్తిలో ఒక విశేషాన్ని గుర్తించాను. తన జబ్బునిగురించి ఏ రోగి ఎక్కువ చిరాకు పడతాడో అతనికి, ఆ జబ్బు తప్పకుండా నిమ్మళిస్తుంది."

"నువ్వు చెప్పేది నాకు పూర్తిగా అర్థంకావడం లేదు," అన్నాడు ఆర్కాడీ; "నీకంత బాధ కలగడానికి కారణ మేమీ ఉండకూడదని అనుకుంటున్నాను నేను."

"నీకు పూర్తిగా అర్థం కాలేదుకనక, ఇది మట్టుకు చెపుతాను—ఆడదాని వశంలో నీ చిటికెన వేలి చివర అయినా అప్పజెప్పడం కంటే, రోడ్డుపక్కని రాళ్ళు బద్దలు కొట్టుకుని బతకడం నయం నాకు తోచిన అభిప్రాయం అది. అదంతా" బజరోవ్ మామూలు ధోరణిలో 'అయోమయప్రణయం' అనబోయి, ఆపుకుని లన్నాడు," వట్టి చెత్త నేను చెపితే "నీకు నమ్మకం కలగదు కాని చెపుతున్నాను నువ్వూ నేనూ ఆడవాళ్ళతో కులాసాగా కాలం గడిపాం అప్పుడు మనకది చాలాబాగుంది. అయినా సరే అల్లాంటి వాతావరణంలోంచి బయట పడితే మంచి ఎండలో చన్నీళ్ళ స్నానం లాగ ఉంటుంది అలాంటి చిన్నచిన్న విషయాల కోసం తాపత్రయ పడడానికి మగవాడికి తీరుబడి లేదు. ఒక చక్కని స్పానిష్ సామెతలో చెప్పినటు మగవాడు మచ్చిక కాకూడదు ఏమోయి, ఓ యోగీశ్వరా," బండితోలుతున్న కృషికుడిని ఉద్దేశించి అన్నాడు, "నీకు పెళ్లాం ఉందా?"

కృషికుడు నిస్తేజమయిన తన ముఖాన్ని ఇద్దరి స్నేహితులవేపూ తిప్పాడు

"పెళ్లామా? ఆ, ప్రతీ మగవాడికీ ఉంటుంది పెళ్లాం"

"ఆమెను కొడతావా?"

"పెళ్లాన్నా? ఎప్పుడో ఒకప్పుడు అన్నీ అవుతుంటాయి తప్పులేకుండామాత్రం ఎప్పుడూ కొట్టం"

"చాలా బాగుంది. అయితే, ఆమె నిన్నెప్పుడయినా కొడుతుందా?"

కృషికుడు గుర్రపు కళ్లాలు ఒకసారి లాగాడు "అలాంటి వింతమాటలన్నీ అడుగుతారేం? మీకు వేళాకోళంగా ఉంది" అతనికి కోపం వచ్చినట్టు స్పష్టంగా తెలుస్తోంది.

"విన్నావా, ఆర్కాడీ నికొలాయివిచ్! కాని మనం దెబ్బ తిని వచ్చాం చదువుకున్నవాళ్ళమవడంచేత"

ఆర్కాడీ నవ్వు తెప్పించుకు నవ్వాడు. బజరోవ్ రెండో పక్కకి తిరిగి మళ్ళీ మాట్లాడలేదు

ఆర్కాడీకి ఆ ఇరవయిమైళ్లూ నలభయిలాగ అనిపించాయి చిట్టచివరికి అంతకంతకి ఎత్తుగా అవుతున్న ఒక ఏటవాలు ప్రదేశంలో, బజరోవ్ తల్లిదండ్రులు నివసిస్తున్న పల్లె కనపడింది. ఒక పక్కగా చిన్నచెట్ల తోపులో, తాటిఆకుతో కట్టిన చిన్న ఇల్లు కనబడుతోంది. ఇద్దరు కృషికులు ఒకరి నొకరు తిట్టుకుంటూ మొదటి గుడిసె దగ్గర నిలబడిఉన్నారు ఒకడు అన్నాడు "నువ్వో పెద్ద పందివి. పందన్నా నయమే నీకంటె"


నీ పెళ్లాం ఒక దెయ్యం," అన్నాడు రెండోవాడు

"మా నాన్న కమతంలో పనిచేసే రైతుల్లను అంత పీడించడు—వాళ్లు కులాసాగా, విశృంఖలంగా ఆడుకునే వేళాకోళాలనుబట్టి అర్థమవుతుంది నీకు అదుగో, మా నాన్న గుమ్మంలోంచి దిగుతున్నాడు. బండిగంటలు వినపడి ఉంటాయి అతనే. అతనే—ఆ ఆకారం నాకు తెలుసు అరే, పాపం ఎంత ఎలా నెరిసిపోయింది అతని జుట్టు!"


—



చలిమంట :—బ్రిటన్‌లో చలికి, ఇళ్లల్లో ఎప్పుడూ వెచ్చదనం కాపాడుకొనేందుకు, ఉష్ణప్రకోపన యంత్రాలను వాడుకొంటారు. ఒక్కచోట నిప్పు రాజేస్తే, ఉష్ణవాయు పరిభ్రమణంవల్ల, మూడుగదులలో వెచ్చదనం, ఈ 'హార్త్' (పొయ్యి) కాపాడుతుంది.




చీడ మొక్కలు :—పైరుతోపాటు కలిసిఉండే, కొన్నిరకాల చీడమొక్కలను రసాయనిక పద్ధతిని మందు చల్లి నిర్మూలించటానికి కొత్త స్ప్రేయంత్రమువ్యాపసాయికులు ఉపయోగిస్తున్నారు.




వృద్ధుల హోటల్ :—తమ సంతతితమ్మ కనిపెట్టిచూసే వాళ్లు లేకా, లోకానికక్కర్లేకా, ఇంటిసౌఖ్యం లేక అలమటిస్తూన్న వృద్ధులకు, సౌఖ్యాన్నీ మనశ్శాంతినీ చేకూర్చేందుకు, వాండ్స్‌వర్త్‌కౌన్సిలు, వారు, స్ట్రీథాంలో ఈ హోటలు కట్టించారు.

బ్రిటిష్ జీవిత విన్యాసాలు, విశేషాలు



పిల్లలకోడి :— కోడిగ్రుడ్లనుయీ కొత్త 'ఇన్క్యుబేటరు' యంత్రంలో పెట్టి మూతవేస్తే, ఎవరూ కాపలాచూడవలసిన అక్కరలేకుండానే యంత్రం కోడిగ్రుడ్లనుంచి పిల్లలనుపొదుగుతుంది.

1950 లో ఇంటి నమూనా :— లండన్ గృహనిర్మాణ ప్రదర్శనంలో, ఇంటి పెరటిభాగం గృహిణికి సౌకర్యాలతో నిండిఉండేటట్లు కట్టి, ఈ నమూనా ఇళ్లను ప్రదర్శించారు.



★

ఫలశాఖ పరిశోధనలు :—ఉష్ణ దేశాలనుంచి వచ్చే ఫలాలను పరిశోధిస్తూ ఇంగ్లండులో ఈ ఫలవృక్షాలను, కృత్రిమ పద్ధతుల్లో ఎల్లా తయారు చేద్దామా అని పరిశోధనలుచేస్తున్నారు. →



★



← **ఇంట్లో ఎగిరే విమానాలు:** రబ్బరుదారాల విసురువల్ల, ఎగిరే ఈ బొమ్మ విమానాలు పిల్లల ఆటలకోసం, పెద్దపెట్టున తయారుచేస్తున్నారు.

Regd. No. M. 4479

గాంధీ మహాత్ముని
ఆత్మకథ

ప్రధమ సంపుటము
[చతుర్థముద్రణము]
శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు   వెల రూ. 5-0-0   తపాలఛార్జి రూ. 0-9-0

(ద్వితీయ సంపుటము త్వరలో వచ్చుచున్నది.)

పోస్టుబాక్సు 212,   ఆంధ్రగ్రంథమాల   మదరాసు 1.

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము
ప్రధమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డిమ్మీ ౪-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్య" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౩౫, వివిధ విషయములు ౪౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౪-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అః" మొదలుకొని "అశ్వని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౩ అమరావతీ స్తూపమునకును ౩ అనాహతమునకును చెందినవియు, ౬ దేశ చిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీ స్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేష భూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱువేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౩౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౪౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతిసంపుటము వెల రూ. ౧౦.

పోస్టుద్వారా : రూ. ౧-౮-౦.
రైలుద్వారా దగ్గరచోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,
ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,
నెం. 7, తంబుశెట్టివీథి, మదరాసు.

ఉత్తమ శైవమత గ్రంథము

పండితారాధ్య చరిత్ర

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము. డా॥ చిలుకూరి నారాయణరావుగారిచే పరిష్కరింపబడినది. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వతము లను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించి యుండ లేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికకూడ కలదు.

వెల రూ 5-0-0.

ప్యాకింగు, పోస్టేజి రూ. 1—4—0.

ఆంధ్రగ్రంథమాల,
పోస్టు బాక్సు నెం. 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G.T Madras.